# మూసీ

# MUSI

• Samputi : 27 • Sanchika : 04 • Pages : 64 • Rs. 20
• February 2024

UGC Care List
Approved Journal

- శేషేంద్ర శర్మ సాహిత్య దర్శనం
- తెలుగువారి 'పద్మ' సిరులు
- ఆచార్య భూమయ్య గారి 'భౌమమార్గ విమర్శ'
- సుప్రసన్న భక్తి కవిత్వం 'ప్రపత్తి తత్త్వం'
- సరస్వతీ ! నమస్తుభ్యం !!
- తెలుగు సినిమాకు పాటలు రాసిన మహిళామణులు
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-2
- తెలంగాణ అమర్నాథ్ - సలేశ్వరం





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 27 సంచిక : 4
ఫిబ్రవరి - 2024
'శోభకృత్' పుష్య, మాఘ మాసాలు
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

ఈ సంచికలో ...

## వ్యాసాలు

శేషేంద్ర శర్మ సాహిత్య దర్శనం ... డా. పి.సి. వెంకటేశ్వర్లు 7
కళాతపస్వి కె. విశ్వనాథ్ సినిమాలు - స్త్రీ పాత్రలు ... డా. బూర్ల చంద్రశేఖర్ 13
తెలుగు వారి 'పద్య' సిరులు ... డా. టంగుటూరి సైదులు 17
తెలుగు బైబిలు అనువాదాలు : చారిత్రక వర్ణనాత్మక భాషాంశాలు ... డా. ప్రత్తిపాటి మాథ్యు21
ఆచార్య భూమయ్య గారి 'భౌమమార్గ విమర్శ' ... అరుణ ధూళిపాళ 27
సుప్రసన్న భక్తి కవిత్వం 'ప్రపత్తి తత్త్వం' ... దాసోజు జ్ఞానేశ్వరాచారి 33
సరస్వతీ! నమస్తుభ్యం!! ... ఆచార్య శ్రీవత్స 37
తెలుగు సినిమాకు పాటలు రాసిన మహిళామణులు... కె. నవీన్ కుమార్ 40
మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-2 ... డా. అట్టెం దత్తయ్య43
పద్యమనోహరం -49 ... గన్నమరాజు గిరిజామనోహర్ 46
తెలంగాణ అమర్నాథ్ - సలేశ్వరం ... ఎ. ప్రవీణ్‌కుమార్ బోళ్ళ 47

## కవితలు

సరస్వతీ స్తుతి మాలిక ... డా. అయాచితం నటేశ్వర శర్మ 5
తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ 6
'మెత్తని 'పిల్లో' ... డా. వద్దపురం కృష్ణ 22
అయిలన్నకు అభినందనలు ... ఆచార్య ఎస్వీ సత్యనారాయణ 26
బుడ్డెద్దులు ... ఎజ్జు మల్లయ్య 31
భక్తవశంకరా! హరా!! .... అమరవాది రాజశేఖర శర్మ 36
పాటలు పక్షులైతాయి ... డా. అంజనాశ్రీ ఖమ్మం 58
నాదేశ్వరి (పద్యకావ్యం) ... రాయసం శేషగిరి రావు 62

## సమీక్షలు

నెమలి కన్నులు - ఆలంకారిక రచనకు వన్నెలు ... ఆచార్య పగడాల చంద్రశేఖర్ 50
బంజారాల బ్రతుకు చిత్రానికి ప్రతీక 'కేసులా' ... డా. భూక్యా రాజారాం నాయక్ 53
సమకాలీన సమాజ చిత్తరువు 'దురస్తు' ... డా. ఉప్పల పద్మ 55
మెకంజీ కైఫీయత్తులలోని సమాజ భాషా స్వరూపాలు ... ఘట్టమరాజు 57
వెలుగుదారులు చూపించే జీవితం - నంబూరి పరిపూర్ణ ... ఆలమూరి సౌమ్య 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderbad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# సం'బంధం'

బధ్యతే అనేన ఇతి బంధనం.. కట్టివేయబడేది బంధనం, అదే బంధం. సమ్యక్ బంధమే సంబంధం. దేనితో కట్టివేయబడేదైనా మనం బంధనమనే ఉపయోగిస్తాం. లోకంలో అనేక రకాల బంధనాలు మనకు తెలుసు. దేనితోనైనా బంధింపబడితే అది సంబంధమే. బంధాన్ని అనుసరించేదంతా అనుబంధం అవుతుంది. చుట్టూ ఉంటే చుట్టాలు, బంధం ఉంటే బంధువులు అని మనం ఇప్పుడు పిలుచుకుంటూనే ఉన్నాం.

బాహ్యమైన బంధనాలు అందరికీ తెలిసినవే. పశువులను కట్టివేయడానికి తాళ్ళు, గొలుసులు వినియోగిస్తాం. ద్వారబంధాలకోసం తాళాలుంటాయి. వాహనాలు కదలకుండా ఉండడానికి మరో మార్గం ఉంటుంది. వైవాహిక బంధం అనేది లోకంలో స్త్రీపురుషులను కలిపి ఉంచే బంధం. ఇలా ఎన్నో విషయాల్లో బంధనాలు కొనసాగుతూనే ఉన్నాయి.

బంధనానికి మూలమైంది మనస్సు మాత్రమే. మనస్సు అనేక బంధనాలను ఏర్పరచుకుంటుంది. తనకున్న జ్ఞానాన్ని బట్టి ఆ బంధనాలు మారుతూ ఉంటాయి. ఎక్కువ కాలం దేనితో జీవిస్తే దానితో బంధనం ఏర్పరచుకుంటుంది మనస్సు. అందుకే ముందుగా మన శరీరంతో మనస్సు బంధనం ఏర్పరచుకుంటుంది. తర్వాత తాను అందంగా కనిపించడానికి, హోదా పెంచుకోవడానికి, నివసించడానికి, ధన సంపాదనకు ... ఇలా ఎన్నో బంధనాలు పెరుగుతూనే ఉంటాయి. మనం ఉపయోగించుకునే సబ్బులు, షాంపూలు, రంగులు, ధరించే వస్త్రాల రంగులు, వస్త్ర విశేషాలు, శరీరానికి ఉపయోగించే మైపూతలు, ఇంట్లో పూజల కోసం ఉపయోగించే ద్రవ్యాలు, పూజలు చేసే విధానాలు, పూజాద్రవ్యాలు... ఇలా ఇంటికి, ఒంటికి వినియోగపడే ప్రతి వస్తువుతోనూ మన మనస్సు బంధనాన్ని పెంచుకుంటుంది. బంధనాలు పెరుగుతున్నా కొద్దీ మనిషి బలహీనుడు అవుతూనే ఉంటాడు. బంధనం (చెరసాల) తొలగితే గాని ముక్తుడు కాలేడు.

మరి బంధం తొలగాలంటే మనం బంధంలో ఉన్నామనే జ్ఞానం మొదలు ఏర్పడాలి. ఆ తర్వాత ఎటువంటి బంధమో అధ్యయనం చేసి, దానిని వదిలించుకోవడానికి దానికన్నా శక్తివంతమైన దానితో బంధనాన్ని ఏర్పాటు చేసుకోవాలి. స్థాయి ఎక్కువ ఉన్న వానితో బంధనం పెంచుకోవడం వల్ల చిన్న చిన్న బంధనాలు క్రమంగా తొలగి, వ్యక్తి స్థాయి పెరుగుతుంది. ఒక తాడును వదిలించుకోవాలంటే మరో బలమైన శక్తిని మనం పట్టుకోవలసిందే.

మనిషి భవ బంధాలలో, భావ బంధాలలో ఉంటాడు. ఎటువంటి బంధనాలలో ఉంటే వాటి గూర్చి మాత్రమే ఆలోచిస్తుంటాడు. అవే అతని ఇబ్బందికి కారణాలు కూడా అవుతుంటాయి. భూమికి ఆకర్షణ శక్తి ఉండడం వల్ల చంద్రుని వంటి ఉపగ్రహాన్ని కూడా తన చుట్టూ తిప్పుకుంటుంది. మన భావాలు కూడా భౌమ మార్గంలోనే ఉంటాయి. భూమి బంధాన్ని వదలాలంటే, మనసులో జలబంధాన్ని క్రమంగా, అగ్ని, వాయు, ఆకాశ బంధనాలుగా మార్చుకోగలిగినవాడు ఉత్తముడు అవుతున్నాడు. భూ సంబంధమే ఈ లోకం నుండి వ్యక్తిని దాటనివ్వదు. ఇక్కడే విజ్ఞత కావాలి.

వ్యక్తి భావనలు విస్తరించి, ఈ సమాజానికి వినియోగపడే బలమైన పనులు, తక్కువ కాలంలో చేయగలగడం బంధనాలు తక్కువగా ఉన్నవానికి మాత్రమే సాధ్యం. ఒక్కో బంధనం వదిలిపెట్టి పోతుంటే అజ్ఞానికి చాలా బాధాకరం అవుతుంది. అసలు పెద్దవైన భావాలు రావాలంటే కూడా పెద్దవానితో అనుబంధాలు పెరగాలి. ఉపాసనా మార్గం అదే. భూమి ఆకర్షణాబంధాన్ని వదలాలి అంటే సూర్యాకర్షణ వంటి దానిలోకి మన మనస్సు వెళ్తుంటే .. వారు అత్యున్నతిని పొందుతారు. అందుకే సంబంధాలన్నీ తమకన్నా శక్తివంతమైన వాటిపైన మాత్రమే ఉండాలి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# సరస్వతీ స్తుతి మాలిక!



అక్షరమాలనిచ్చితివి హాసములొల్కెడి నీ వచస్సుతో
శిక్షణనిచ్చి గాచితివి, జీవితమున్ సరిదిద్దుకోవగా
రక్షణనిచ్చు విద్యలను రాజిలజేసితి వక్షయమ్ముగా
కుక్షిని నింపు జీవికను గూర్చితివమ్మ! దయా సరస్వతీ!

నీవు కరుణింపకున్ననే నిలువగలనె?
నిండుగా శబ్దరత్నాల నిధులనొసగి
కవన నైపుణ్యములనిచ్చి గాచినావు
తల్లి! నీ కృపామృతముల జల్లు గురియ

నీ దయతోడ మూకుడు వినీతవచస్విగ మారిపోయె, నీ
మేదురమైన వాక్ప్రభల మీటి మహాకవియై వెలింగె, నీ
స్వాదుతరోక్తి వాహినుల సాధన జేసినవాడు, రాజుచే
నాదరణమ్ములన్ గొని మహాగజ వాహన సత్కృతిన్ గొనెన్!



నీవు తలచిన రత్నమై నిలుచు రాయి
కఠిన శిలయైన శిల్పమై కాంతులీను
నీ కటాక్షము కనకాభిషేకమొసగు
జ్ఞానవారాశి పుట్టిన కలువవీవు!

వేదములు నాదములతోడ వేడు నిన్ను
దర్శనమ్ములు నిను మ్రొక్కి తరలుచుండు
కవన లక్ష్యము నిన్ చేరు గమ్యమగును
భాషలే భూషలై వెల్గు వాక్ప్రభాస!





డా. అయాచితం నటేశ్వర శర్మ
ఫోన్ : 96032 04507

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 6 UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

## మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

కోపమెందుకోయి నరుడా
ఉన్నమాట చెబుతున్నా
ముల్లెలన్ని నీళ్లమూటలే
ముందు దెలుసుకున్న మందులే

అహంకార మభిమానము
'నేను' చుట్టు త్రిప్పుచుండును
నువ్వన్నది కల్లమాటరా
కనుల మాటు చోటు చేరరా

పాప కారణంబు కోపము
కాల్చివేయు తాప శాపము
వీడు విబుధ జనుల చేరుము
విశ్వంభరు చింత చేయుము

ఆరుగురిని అదుపునుంచుము
ఆత్మ సత్య మెరిగి మసులుము
తుకా చూపు సత్య మార్గము
చేర్చు ముక్తికాంత ద్వారము




అనువాదం :
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 (7) UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# శేషేంద్ర శర్మ సాహిత్య దర్శనం

**డా. పి.సి. వెంకటేశ్వర్లు,** ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి ఫోన్ : 9490164963



**"నేను కవిని కాదు కఠోర పత్రాన్ని - వ్యక్తిని కాదు ఉద్యమాన్ని"** అంటాడు ఒక ప్రశ్నకు సమాధానంగా శేషేంద్ర. నిజమే, ఆయన అభిప్రాయాలు, ప్రశ్నలకు జవాబులు, ఇంటర్వ్యూలకు స్పందించిన తీరు, లేఖలకు ఇచ్చిన ప్రత్యుత్తరాలు వంటివాటిని 'సాహిత్య దర్శిని' గ్రంథంలో ఆసాంతం చూసినప్పుడు, ఆ మాటలు వాస్తవాలు అనిపిస్తాయి. 1927 అక్టోబర్ 20న నెల్లూరు జిల్లా, ఉదయగిరి తాలూకా, నాగరాజుపాడు గ్రామంలో పుట్టినప్పటి నుండి, చదువుకున్న విద్య, కమ్యూనిస్టు నాయకుడు పద్మనాభయ్య ప్రభావం, తన తండ్రి (మునసబ్) సుబ్రహ్మణ్యశర్మను తహసిల్దార్ మాట్లాడిన నీచపు మాటలు వంటివన్నీ 'సాహిత్య దర్శిని'లో ఆయన చెప్పుకున్నాడు. అంటే కవిత్వంలోనో, కథల్లోనో, నవలల్లోనో చెప్పడానికి వీలుకాని అనేక విషయాలకు ఈ పుస్తకం సమాధానమిస్తుంది. చలం తన సాహిత్యంలో స్వేచ్ఛను ప్రతిపాదిస్తే, శేషేంద్ర తన స్వేచ్ఛాలోచనను 'సాహిత్య దర్శిని'లో ప్రతిబింబిస్తాడు. తన జీవితంపైన, సమకాలీన వ్యవస్థ పైన, ఆలోచనలపైన, తన దృక్పథంపైన 'కవిసేన మేనిఫెస్టో' వంటి రచనలు పరోక్షంగా కొన్ని విషయాలు తెలియజేస్తున్నప్పటికీ శేషేంద్ర పరిపూర్ణమూర్తిమత్వాన్ని, ఆంతరంగిక, బహిర ఆలోచన విధానాన్ని స్పష్టపరుస్తుంది ఈ గ్రంథం.

'సాహిత్య దర్శిని'లో నాలుగు విభాగాలున్నాయి. అవి ప్రశ్నలు - జవాబులు, ఇంటర్వ్యూలు, లేఖలు, వ్యాసాలు. వీటిలో మొదటి మూడింటికే పరిమితమవుతున్నాను. ఒక కవి లేదా విమర్శకుడి యొక్క దృష్టికోణం ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఉపయోగపడేవి లేఖలు, ఇంటర్వ్యూలు వంటివి. అంటే సాహిత్య ప్రయాణం చేస్తున్న రచయిత ఏదోఒక సందర్భంలో తనలో నిబిడీకృతమైన వున్న ఆలోచనను, ఆవేదనను బయటపడి చెప్పడానికి ఇవి అవకాశా న్నిస్తాయి. అలాగే గంతంలో ప్రసిద్ధ రచయితలందరూ సాహిత్య విషయాలను చర్చకు పెడుతూ, పాఠకులడిగిన ప్రశ్నలకు పత్రికాముఖంగా సమాధానమిచ్చే సంప్రదాయం ఉండేది. అలాగే కొన్నిసార్లు జర్నలిస్టు అడిగే సాహిత్య, సాహిత్యేతర అంశాలకు సమాధానమిచ్చే జవాబుదారీతనం ఉండేది. అందుకే ఆధునిక కాలంలో లబ్ధప్రతిష్టులైన కవులు, రచయితల ఇంటర్వ్యూలు, లేఖలు, ప్రశ్నలు - జవాబుల కాలమ్‌లు కనిపించేవి. వాటిలో పేరెన్నికగన్నవి, తెలుగు సాహిత్య విమర్శలో సంచలనం కలిగించినవి, శేషేంద్రశర్మ ప్రశ్నలు-జవాబులు, లేఖలు, ఇంటర్వ్యూలు.

**1. ప్రశ్నలు - జవాబులు :**

శేషేంద్రశర్మ వివిధ ప్రశ్నలకు చెప్పిన సమాధానాలు కొన్ని పత్రికా ముఖంగా ఆరు నెలలపాటు వచ్చాయి. ఆంధ్రజ్యోతి వారపత్రికలో 07-11-1986 నుండి 01-05-1987 వరకు ప్రశ్నలు/ జవాబుల కాలమ్ వచ్చింది. అలాగే **'ఆధునిక కవిత అభిప్రాయ వేదిక'** అనే శీర్షిక కింద వీరి జవాబులు అనేక కొత్త ప్రశ్నలను లేవనెత్తుతాయి. కవిత్వంపై, కవులపై, స్వవిషయంపై, సాహిత్యరంగంపై, సినిమా భాషపై, సామాజికతపై, అవార్డులపై ఈయన చెప్పిన సమాధానాలు ఇప్పటికీ కొత్తగానే అనిపిస్తాయి. శేషేంద్రను భారతీయ సంస్కృతిని గౌరవిస్తూ ముందుకు సాగిన విప్లవవాదిగా నిరూపిస్తాయి.

**1.1. కవిత్వం :**

**"కవిత్వానికి అర్థం చెప్పమని అడగడం, అర్థం కాలేదని బలాత్కరించడం ఒక విధమైన జాంతవ లక్షణం. నాగరిక లక్షణం కాదు"** అంటాడు కవిసేన మేనిఫెస్టోలో శేషేంద్ర. కవిత్వమంటే ఏది? అనే ప్రశ్నకు సమాధానంగా **'కవిత్వమంటే ఉపమాదలం కారాలు కలిసిన భాష. ఇంకా బాగా చెప్పాలంటే కవిత్వం అలంకార ప్రధానభాష అంటే భాషలో నుండి అలంకారాన్ని తొలగిస్తే అది కవిత్వంగా ఉండటం మానేస్తుంది'.** (సాహిత్యదర్శిని - పుట.45) అని చెప్పడాన్ని బట్టి వీరు అలంకార ప్రధానవాది అని అర్థమవు తుంది. కవిత్వమంటే ఏంటో కూడా ఆయన ఉదాహరిస్తాడు. **"వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టు మనిషి. చెట్టుగా ఉంటే ఎడాదికి ఒక వసంతమన్నా దక్కేది. మనిషినై అన్ని వసంతాలను కోల్పోయాను".** ఇలాంటి కవిత్వం విన్న తర్వాతనే శ్రోత

చమత్కృతుడయ్యేలా ఉండా లంటాడు శేషేంద్ర. **"హృదయం పోయిందా జీవనశోభే పోయింది. బాధ పోయిందా సమస్త సృష్టే పోయింది"** వంటివి ఉత్తమ కవిత్వమని చెబుతాడు. మనిషనేవాడు అనేక భావాల సంవేదనల సముద్రమని, సుఖం దు:ఖం మిశ్రమమైన జీవిత సన్నివేశాల నుండి ప్రవహించే మనిషిలో శృంగారం, అంగారం రెండూ ప్రధానంగా ఉంటాయని, ఈ రెండింటిలో ఏదోఒకటి మాత్రమే కవిత్వంలో ఉండాలనుకోవడం అర్భకుని లక్షణమని, కవి లక్షణం కాదని స్పష్టం చేస్తాడు.

ఆధునిక కవిత్వమంటే ఏమిటి? అనే అంశంపై ఇప్పటికీ కొంతమందికి స్పష్టతలేదు. ఆధునికకాలంలో జీవించేవాళ్ళంతా ఆధునికులు కారు. శేషేంద్ర కవిత్వానికి మూడు శరీరాలున్నాయని అంటాడు. పైకి కనిపించే ఆహారం, బట్టలు, గ్రామాలు, పట్టణాలు, నిజజీవితం వంటివి ఒక శరీరమని, మనిషిలో కనిపించే సంస్కారమైన గౌరవించడం, స్నేహధర్మం, మానవ సంబంధాలు రెండవ శరీరమని, ఇవి రెండూ దేశ కాలానుగుణంగా మారుతూ ఉంటాయని, మూడోదైన అంతరంగికమైన కవి ఆత్మపదార్థం శాశ్వతంగా ఉంటుందని, దానికి చక్కటి ఉదాహరణ వాల్మీకిని చదివితే ఇప్పుడు కూడా ఆనందం కలుగుతుందని, అదే కవిత్వపు మూడో శరీరమని చెబుతాడు. కాబట్టి కవి అంతర్గతమైన కవిత్వ శరీరానికి కాలవిభజన చెయ్యడం కుదరదు అని అంటాడు.

ఆధునికకాలంలో అందరూ పీడిత తాడిత జనాల గురించి కవిత్వం రాస్తున్నారని, దేన్ని కవిత్వంగా గుర్తించాలని అడిగినప్పుడు శేషేంద్ర సూటిగా సమాధానం చెబుతాడు. ఆలీబాబా నలభై దొంగల కథ చెప్పి **"ఎవరు కవో ఎవరు కవి కాదో గుర్తించడం తెలుగు సాహిత్యంలో కష్టమై పోయిందని, కావ్య మర్మజ్ఞుడు వెంటనే గుర్తు పడతాడని, కవిత చదువుతున్నప్పుడు, వింటున్నప్పుడు పాఠకుడి హృదయంలో 'ఫీలింగ్' అనే జ్వాలను రగిలించేదే కవిత్వమంటాడు"**. (సాహిత్యదర్శిని – పుట.29) అలాగే వచనకవిత్వాన్ని, మినీకవిత్వాన్ని కూడా సమర్థిస్తాడు. కవిత్వం బహిర స్వరూపం అప్రధానమనీ, కానీ మన తెలుగు కవులు అప్రదానమైన దానిని నెత్తిన పెట్టుకొని వీరావేశంతో విర్రవీగుతున్నారని చురకవేస్తాడు. ఏ రూపంలో ఉన్నా అందులో కవిత్వం ఉంటే చాలంటాడు. దిగంబర కవిత్వాన్ని ఖండిస్తాడు. సిద్ధాంతం పేరుతోనో, ఒక మూర్ఖఆవేశం చేతనో, పాఠకుడిలో విముఖత కలిగిస్తున్న కవిత్వంగా అభివర్ణిస్తాడు. (సాహిత్యదర్శిని – పుట.31). భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం వంటివి విదేశాల నుండి కృత్రిమంగా వచ్చాయనే వాదనను ఖండిస్తాడు. ప్రపంచంలో వచ్చిన రాజకీయ, సామాజిక, ఆర్థిక సంబంధమైన విశ్వజనీన మార్పులవల్లే కవిత్వం అంత:బాహ్య స్వరూపాల్లో మార్పును సంతరించుకున్నదని చెప్తాడు. డాడాయిజం, సెర్రిలిజం వంటివి యూరప్‌లో స్థానికంగా వచ్చినవి కాబట్టి అవి విశ్వజనీన ఉద్యమాలు కాదని నిరూపిస్తాడు.

**1.2. కవులపై శేషేంద్ర అభిప్రాయం :**

శేషేంద్రశర్మ వాల్మీకిని ఆరాధ్య కవిగా చెప్పుకుంటాడు. రామాయణ కావ్యాన్ని ఎన్నోసార్లు చదివానని, అందులోని గొప్ప విషయాలను 'షోడశి రామాయణ రహస్యాలు' గ్రంథంలో రాశానని ఆయన చెప్పుకున్నాడు. అయితే ఆధునికులైన తెలుగుకవుల గురించి ప్రశ్నించినప్పుడు ఆయన తడుముకోకుండా సమాధానాలు చెప్పాడు. గురజాడ అప్పారావును గొప్పద్రష్ట, సాహిత్యస్రష్ట, ప్రజాభిలాషిగా చెబుతూ, కవిత్వం పాళ్లు తక్కువ అంటాడు. కృష్ణశాస్త్రిని రొమాంటిక్ యుగం రేపిన ఒక సమ్మోహన నాగరికతకు, సాహిత్యానికి ప్రతీక అంటాడు. తెలుగు కవులలో నిజమైన కవి తిలక్ అని, కాలం నోట్లో పడకుండా మిగిలే చంద్రబింబమని అంటాడు. అపార కవిత్వ ఉత్సాహమున్న కర్మిష్ఠిగా కుందుర్తిని వర్ణిస్తాడు. ఆవేదన ఉన్న అసలైన కవి నారాయణబాబు అంటాడు. నారాయణరెడ్డిని గురించి చెబుతూ కావ్యం 'యశసే అర్థకృతే వ్యవహారవిదే' అనే మూడు ముక్కలు ఆయన కవిత్వానికి సరిపోతాయంటాడు. పఠాభి కవిత్వంలో చమత్కారముంది గానీ ఎత్తులు లేవంటాడు. దాశరథిని మనోహర కవితా పద్యశిల్పిగా మెచ్చుకుంటాడు. శ్రీశ్రీని అభ్యుదయ కవిత్వోద్యమ విస్పష్టరూపకర్తగా చెబుతూనే, కవిగా సామాన్యుడని, వ్యక్తిగా అవకాశవాది అని విమర్శిస్తాడు. **'ప్రజల్లో అజ్ఞానం, విద్యావంతుల్లో అవినీతి కలసి కల్పించిన సాహిత్య స్థానాన్ని అనుభవిస్తున్న గొప్ప తెలుగు అదృష్టవంతుడని'** (సాహిత్యదర్శిని – పుట.39) వ్యంగ్య విమర్శ చేస్తాడు. కాళోజీని తెలంగాణ శ్రీశ్రీ అని, సి.ఆర్.రెడ్డిని ఆంధ్రమహాపురుషుల్లో ఒకడని, పుటపర్తిని మానవత్వం తొణికిసలాడే గొప్పకవి అని నిర్వచిస్తాడు. రాయప్రోలుకు ఆధునికకవులలో అగ్రతాంబూలమిస్తాడు. రాయప్రోలు తనకు ఎలా కనిపిస్తున్నాడో కూడా వివరిస్తాడు. **"ఈ మహాపురుషుడు వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం యావత్తు ఒక పద్మ పీఠిక చేసుకొని కూర్చున్న సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మగా దర్శనమిస్తాడు"** (సాహిత్యదర్శిని – పుట.39). కవుల ఆలోచన ఎలా ఉండాలి? వాళ్ళు ఆదర్శంగా ఉండాలి? వంటి విషయాలపై శేషేంద్ర ఒక విలక్షణమైన అభిప్రాయం ఉంది. పోతన లాగా కవులు లాభాన్ని ఆశించకుండా సాహిత్యాన్ని సృష్టించాలంటాడు. ఏ కాలంలోనైన అలాంటి కవులు అరుదుగా ఉన్నారంటాడు. మన తెలుగులో కవులకు సాహిత్యమనేది ఏదో లాభాన్ని అందుకోవడానికి ఉపయోగపడే నిచ్చెన లాంటిదని విమర్శిస్తాడు. తాను విప్లవ కవిత్వం రాస్తున్నా సంప్రదాయవాది అయినా, విశ్వనాథను గురుతుల్యునిగా గుర్తించడానికి కారణాన్ని విడమరచి చెబుతాడు. **"విశ్వనాథ కళాత్మకత రక్తమాంసాకృతి. ఆయన నైతికత ఒక అయస్కాంత సీమ. ఆయన తెలుగు సాహిత్యంలో గాంధీ మహాత్ముడు"** అని చెప్పి కుందుర్తి, శ్రీశ్రీ వంటివారు కూడా ఆయన శిష్యులుగా చెప్పుకున్నారని గుర్తు చేస్తాడు. తెలుగులో కొంతమంది రచయితలు రచనల్లో ఆశయాలు చెప్పుకుని, వ్యక్తిగా సామాన్య మానవుడి కంటే

అధ్వాన్నంగా కనిపిస్తున్న తీరును శేషేంద్ర ఎండగడతాడు. రచయిత, రచన రెండూ వేర్వేరు కాదని ఒక గజదొంగ, ఒక నీచుడు, ఒక కుట్రదారుడు ఎప్పటికీ నిజమైనకవి కాలేడని అంటాడు. చలం వివాదాస్పదమైన వ్యక్తి అయినా, ఆయన రచనలపై శేషేంద్ర సానుకూలమైన వ్యాఖ్య చేస్తాడు. **"ఆయన సాహిత్యం కళా స్వరూపం. ఆయన బోధించిన విలువలు వివాదమైనవి. ఆదర్శానికి, అచరణకు మధ్య జరిగే తీవ్ర సంఘర్షణకు ఆయన జీవితమొక ప్రతీక"** (సాహిత్యదర్శిని – పుట. 91). శ్రీశ్రీ శేషేంద్ర కవిత్వాన్ని ఫ్రెంచి మద్యంతో పోల్చడంపై ఆయన సమాయోచితంగా, తొట్రుపాటు లేకుండా స్పందించి సమాధానం చెబుతాడు. **"శ్రీశ్రీ కావ్యరస లోలుడు. శుష్కరాజకీయ కాష్ఠం కాదు. కనుక కవితలో ఉన్న మజా పీలుస్తాడు. చప్పరిస్తూ ఆస్వాదిస్తాడు".** (సాహిత్యదర్శిని – పుట. 99)

**1.3. సాహిత్యం :**

శేషేంద్ర తెలుగు ప్రాచీనసాహిత్యంతో పాటు హిందీ, ఆంగ్ల సాహిత్యాలను లోతుగా అధ్యయనం చేసినవాడు. అనేక దేశాలు, రకరకాల ప్రాంతీయ సాహిత్య వాసనలు ఆకళింపు చేసుకున్నవాడు. అందుకే ఈనాటి సాహిత్యానికి, పత్రికల్లో రిపోర్టులకు తనకు తేడా కనిపించడం లేదని అసహనాన్ని వ్యక్తం చేస్తాడు. **"పత్రికలు, సాహిత్యం రెండూ ప్రజాదరణతో, అభ్యదయంతో నడుస్తున్నాయి. అందరికీ వాటి మధ్య తేడా కనిపిస్తుంది. అదృష్టం సాహిత్యానికి పర్యాయపదమైంది"** (సాహిత్యదర్శిని – పుట. 8). ఇంత ప్రపంచ సాహిత్యాన్ని చదివిన వాడు కాబట్టి మన సాహిత్య పరిశోధకులు చేసిన యుగవిభజన సరిగ్గాలేదంటాడు. తెలుగు సాహిత్యాన్ని పురాణ యుగం, ప్రబంధయుగం అని విభజించడం కంటే తెలుగు సాహిత్య గ్రంథాలను తలగడ గ్రంథాలు, కిటికీలు కొట్టుకోకుండా పెట్టే గ్రంథాలు, మంచినీళ్ళ గ్లాసుపై ఉంచే గ్రంథాలు అని పెడితే బాగుంటుందని వ్యంగ్యోక్తులు విసురుతాడు. శేషేంద్ర కూడా తనది సహేతుకమైన సాహిత్య విభజన అంటూ ఒకటి చేశాడు. 1. వాచ్యార్థ ప్రధానయుగం, 2. లక్షణార్థ ప్రధానయుగం, 3. ద్వితీయ వాచ్యార్థ ప్రధానయుగం, 4. ద్వితీయ లక్షణార్థ ప్రధానయుగం. అయితే ఈ యుగవిభజనను ఎవరూ అంగీకరించలేదు.

ఏది సాహిత్యం? అనే ప్రశ్నకు సమాధానంగా 'మనిషిలో ఉన్న సానుభూతిని కొల్లగొట్టే గజదొంగ సాహిత్యం. అది సాహిత్య కళ' అని చెబుతూ మనిషిని వెడల్పు చేస్తూ, అలంకారాలనే పూలపడవ లను మోస్తూ ప్రయాణం చేస్తుంటుందని చెబుతాడు. సాహిత్యం సినిమాలను, రాజకీయాలను ఆశ్రయించి చచ్చిపోయిందనే వాస్తవాన్ని అంగీకరిస్తాడు. సాహిత్యంలో స్త్రీల సాహిత్యం, పురుషుల సాహిత్యం అనే విభాగం గురించి వచ్చిన ప్రశ్నకు సమాధానం చెప్తూ కొందరు స్త్రీలు రాసే సాహిత్యం, కొందరు పురుషులు సాహిత్యం ప్రయోజనకరంగా ఉంటుందని, సాహిత్య సృజనలో స్త్రీ పురుష విభజన సరికాదంటాడు. సాహిత్య సముద్రమనే పదాన్ని శేషేంద్ర చాలా లోతుగా విశ్లేషిస్తాడు. సాహిత్యం సముద్రం కావచ్చుగానీ, సముద్రం మాత్రం ప్రవాహం కాదంటాడు. ఎటువైపో వెళుతున్నట్లు అభినయం చేసే మహానటుడు లాంటిది సముద్రమని మనిషిలోని కరుణ, ప్రేమ, ద్వేషం వంటివి రసాలుగా మారి, సాహిత్య సముద్రంలోకి ప్రవహిస్తాయని గొప్ప సమీక్ష చేశాడు శేషేంద్ర. జీవితానికి సాహిత్యాన్ని అవినావభావ సంబంధముందని, జీవితం తల్లి అయితే, సాహిత్యం శిశువని చెప్తాడు. నీరసించిపోయిన సమాజానికి సాహిత్యం సంజీవిని అవుతుందా? అని అడిగిన ప్రశ్నకు సమాజానికి సాహిత్యమే సంజీవిని అని చెబుతాడు. ఒకవేళ సాహిత్య కారుల్లో ఐక్యత లేకపోయినా, సమాజం ఐక్యంగానే ఉంటుందంటాడు. దానికి కారణం సమాజం సాహిత్యాన్ని చదువుతుంది. కానీ సాహిత్యకారులను కాదని హేతుపూర్వకమైన సమాధానమిస్తాడు. పాఠకుల్లో సాహిత్యాభిరుచిని కలగజేయడంపై బాధ్యతాయుతమైన ప్రకటన చేస్తాడు. అప్పటికే సాహిత్యాన్ని చదివే పాఠకులు తగ్గుతున్న క్రమాన్ని ఆయన గుర్తించాడు. సాహిత్యలోక సంస్కారం పాఠకుణ్ణి చదివేటట్టు రచయిత చేయాలంటాడు. మేతమేసిన అరణ్యాన్నే దోచుకుందామనే దుర్బుద్ధి కొంతమంది రచయితలకు కలగడంవల్ల, వారు పుస్తకాన్ని వ్యాపారంగా మార్చడం వల్ల, సాహిత్య పఠనాభిలాష తగ్గిపోతుందని బాధపడ్డాడు. సాహిత్యం సాహిత్యపరిధిని దాటి కొట్టుకుపోతుందనే ప్రశ్నకు సమాధానమిస్తూ, మనిషి అనేక రకాల వ్యవహారాల్లో సాహిత్యమనేది స్వేచ్ఛాయుత వ్యవహారమని, అందులో కొన్ని చెడు ఫలితాలున్నా కాలమనే మహా జల్లెడ చక్రాయుధంలో తిరుగుతూ సాహిత్యాన్ని తన పరిధిలోకి తెస్తుందని చెప్తాడు. సాహిత్యంలో రాణించాలంటే కథ అయినా, కవిత్వమైనా ఏదైనా ఒక్కటేనని ముందుగా రాసేవ్యక్తికి ప్రతిభ ఉండాలని సాహిత్య ప్రక్రియలు ఏవీ ఎక్కువ, తక్కువ కావని, అవి మానవజాతి సమాన మైన సంపద అని చెప్పడం వారి విశాలమైన దృష్టిగా అర్థం చేసుకోవాలి.

శేషేంద్ర అనేక పుస్తకాలను చదివిన అనుభవం వల్ల ఎన్నో విషయాలపై వచ్చిన ప్రశ్నలకు స్పష్టంగా సమాధానం చెప్పుకుంటూ వచ్చాడు. కవిత్వానికి ఛందస్సు అవసరమా? అన్నప్పుడు ప్రసిద్ధ కమ్యూనిస్టు కవులైన మాయాకోవ్‌స్కీ, పాబ్లోనెరూడా వంటివారిని ఉదాహరిస్తూ మాత్రాఛందస్సు కవిత్వానికి ఆయుష్షు పెంచుతుం దంటాడు. అలాగే 'దుశ్శాలువా' వంటి పదాలు 'దుష్షాల' అనే వికృతరూపంగా ఏర్పడ్డాయంటాడు. కవిత్వంలో ఒక పరభాషాపదం కొరతను తీరుస్తుంది అనిపిస్తే ఇతర భాషాపదాలను వాడుకోవచ్చు అంటాడు. తన పేరులో కుల సంకేతమైన 'శర్మ' పదాన్ని తొలగించి చాన్నాళ్ళైందంటాడు. చెప్పే సమాధానాల్లో హాస్యాన్ని చెప్పడం కూడా వీరికి వెన్నతో పెట్టిన విద్య. మహాకవి స్థానానికి తాను పోటీపడటం లేదని, ఆ పోటీ జాతరగా ఉంటుందని, తమలాంటి సామాన్యుడికి

ఆ సమూహంలోకి తోసుకపోయే శక్తి ఉండదని సరదాగా సమాధాన మిస్తాడు. ఇలా తన దృక్పథాన్ని గురించి, సామాజికత గురించి, స్వవిషయాలు గురించి అరమరికలు లేకుండా సమాధానం చెప్పడం శేషేంద్ర శర్మ నైజంగా కనిపిస్తుంది.

**2. లేఖలు - ప్రతిపాదనలు :**

శేషేంద్ర శర్మ రాసిన 60 లేఖల్లో విషయాలను 'సాహిత్య దర్శిని'లో పొందుపరిచారు. ఆంధ్రప్రభ దినపత్రికలో 26-03-1987 నుండి 09-08-1987 వరకు అచ్చు అయిన లేఖలివి. వీటికి ఆయన ప్రచురించిన ప్రేమలేఖలకు సంబంధంలేదు. ఈయన లేఖలు కొన్ని 'ఇన్ డిఫెన్స్ ఆఫ్ పీపుల్ అండ్ పోయిట్రీ' అనే పుస్తకంలో అచ్చు అయినట్లు తెలుస్తుంది. ఇందులో శేషేంద్ర సమకాలీనత పైన, కవిత్వ శిల్పంపైన, ఆధునికతపైన, విమర్శపైన, దృక్పథంపైన, భౌతికవాదం పైన చేసిన వ్యాఖ్యలు ఒక స్థిరమైన ప్రతిపాదనలుగా కనిపిస్తాయి. ఆనాడు కవులపై, వామపక్షవాదులపై, కొందరు బలహీనులపై జరుగుతున్న దౌర్జన్యాన్ని **"దేశం దేశమాత నన్ను అడుగడుగునా వేదిస్తున్నట్లు ఒక ఆంతరంగిక బాధ. దేశమే బాధిస్తే ఎక్కడికి పరిగెత్తుకుపోతాం"** (సాహిత్యదర్శిని - పుట.117) అని బాధపడుతాడు. అంతేకాదు సమకాలీన వ్యవస్థలో గొప్పవాడి బాధను వినడానికి కోట్లమంది తరలివస్తున్నారని, దరిద్రుడు చస్తున్నా తిరిగి చూసేవాడు లేడని వాస్తవమైన వ్యాఖ్య చేశాడు. ఇలా ఆయన లేఖల్లో చేసిన వ్యాఖ్యలను చూద్దాం.

**2.1. కవిత్వ శిల్పం :**

కవులంతా కవిత్వానికి నిర్వచనం ఇవ్వలేదు. అయితే శేషేంద్ర ఇచ్చే నిర్వచనాలు గమ్మత్తుగా ఉంటాయి. ఆయన దృష్టిలో అనుభూతే కవిత్వం. అందుకే కాబోలు **"కవిత్వం భాషకు మానవానుభూతికి మధ్య జరిపే సంగ్రామం"** (సాహిత్యదర్శిని - పుట.117) అంటాడు. అలాగే సాధారణ అనుభూతిని తెల్పడానికి సాధారణభాష సరిపోతుందనే కానీ ఒక సంవేదనతో కూడిన సంభాషణ చెప్పడానికి సాధారణ భాష సరిపోదని, దానికోసం ప్రత్యేకపదజాలం సృష్టించు కోవడాన్ని కవిత్వం అంటాడు. ఒక వ్యక్తి అనుచితంగా ప్రవర్తించి నప్పుడు తిట్టేతిట్లలో భిన్నంగా భాష ఉపయోగిస్తారు. పాతకాలంలో ఆయుధాలు, యుద్ధాలను చేయడానికి ఉపయోగిస్తారు. నేడు కవి వర్తమానజీవితంలో సరికొత్త వర్తమాన జీవితపాత్రలను నిర్మించే క్రమంలో సరికొత్త ఆయుధాలను నిర్మించుకోవడాన్ని శిల్పం అంటాడు. ఈ కవిత్వ యుద్ధవ్యూహంలో కవి శబ్దాల్ని, పదాల్ని ఒక చోటు నుండి మరొకచోటుకి అనుకూలంగా ఉండేట్లు నెడుతూ ఉంటాడని, రొట్టెపిండిలా పిసుకుతూ ఉంటాడని వివరిస్తాడు.

**2.2. విమర్శ :**

సాహిత్యాన్ని ఎలా విమర్శించాలి? ఏ కోణంలో విమర్శ సాగాలి? భౌతికవిమర్శలో వస్తున్న వికృత ప్రతిపాదనలు వంటి అంశాలపై శేషేంద్ర ఘాటైన ప్రతిపాదనలు చేశాడు. లేఖల్లో విషయాన్ని మరింత విస్తృతంగా చెప్పడానికి అవకాశం ఉంటుంది కాబట్టి అలాంటి సమగ్రమైన ప్రతిపాదనలు చేశాడు.

భాష, ప్రాంతం, స్థానిక సాహిత్యం వంటివి సంకుచిత వైఖరులని, సాహిత్యాన్ని జాతీయస్థాయిలో మూల్యాంకనం చేయడం అవసరమని ఆయన అభిప్రాయ పడ్డాడు (సాహిత్యదర్శిని - పుట.119). అయితే ఈ అభిప్రాయంపై నేడు చాలా అభ్యంతరాలు ఉన్నాయి. విమర్శ ప్రాంతీయ అస్తిత్వ కోణాలు కూడా అవసరం అంటుంది. కవిత్వంలో శబ్దార్థాల్లో ఏది ప్రధానమైంది అనే విమర్శకు శేషేంద్ర ఒక నూతన ప్రతిపాదన చేస్తాడు. కవిత్వంలో శబ్దం, అర్థం ప్రధానం కాదని జగన్నాథ, కుంతకుల సిద్ధాంతాలను సమన్వయం చేస్తాడు. అలంకారం లేనిదే వక్రోక్తి లేదని, వక్రోక్తి లేనిదే ధ్వని లేదని, ధ్వని ఫలితమే చమత్కారమని, అదే నిజమైన కవిత్వమని చెప్తాడు. మనదేశంలో నేటికవిత్వం పాశ్చాత్య వాయువులు మోసుకొచ్చిన పరిమళం కాబట్టి సాహిత్య విమర్శ కూడా ఆధునిక పాశ్చాత్య విమర్శనా స్థాయిని అందుకోవాలని అంటాడు (సాహిత్యదర్శిని - పుట.161). హిందీ సాహిత్య విమర్శ ఆధునిక స్థాయిని అందుకున్న దని చెబుతూ **"తెలుగులో విమర్శ ఒక వైపు ఆధునిక రహితం మాటు రాజకీయ చదరంగం, మరోవైపు వ్యక్తిగత అశిక్షిత అశాస్త్రీయ అభిప్రాయాల ముద్ద. తెలుగు విమర్శ ఆధునిక ప్రపంచంలో కాలంతోపాటు నడవలేరు"** (సాహిత్యదర్శిని - పుట.116) అనడంలో ఆయన ధైర్యం అర్థమవుతుంది.

వ్యాస, కాళిదాసుల శకుంతలోపాఖ్యానాలకు విమర్శిస్తూ వ్యాసుడి ఉపాఖ్యానంలోనే నాటకీయత ఎక్కువని చెప్తాడు. అలాగే కాళిదాస, భవభూతుల వాక్కులను త్రాసులోపెట్టి తూచినప్పుడు కాళిదాసు వాక్కు ఉన్న తక్కెడ పైకి తేలిపోతుండగా సరస్వతి చూసి, తన చెవిలో ఉన్న లీలాకర్ణాన్ని కాళిదాసు వాక్కు ఉన్న తక్కెడలో వేసి మకరంద బిందువులు కూడా చల్లిందట. ఈ సన్నివేశాన్ని శేషేంద్ర అసలైన విమర్శ పంథాలో వ్యాఖ్యానిస్తాడు. **"భవభూతి వాక్కు, కాళిదాసు వాక్కు కంటే బరువైనదని సూచిస్తున్నారు. పైగా కాళిదాసుకు భవభూతి కంటే హెచ్చుగా సరస్వతి అనుగ్రహం ఉందంటున్నాడు. ఆ కారణం గానే భవభూతి వాక్కులో లేని దివ్య మాధుర్యం కాళిదాసు వాక్కులో ఉందంటున్నాడు"** (సాహిత్యదర్శిని - పుట.160). అలాగే ఒక విమర్శకుడికి శేషేంద్ర కొన్ని సలహాలు కూడా లేఖల్లో ఇవ్వడం మనం చూడవచ్చు. మిత్రుడైన విమర్శకుడు కావాల్సిన సాధన సామాగ్రిని సంపాదించుకోమంటాడు. తోచింది రాసి దాన్ని విమర్శ అనవద్దంటాడు. పాశ్చాత్య విమర్శను, హిందీ ఉర్దూ భాషల్లో విమర్శను చదవమంటాడు. చివరగా ఆధునికకాలంలో వచ్చిన ముఠక కవులను విసర్జించమంటాడు. ధూర్తులైన పంచాంగ విధాన విమర్శకులను పుల్లతో కూడా ముట్టుకోవద్దని కఠినంగా చెబుతాడు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

**2.3. దృక్పథం :**

శేషేంద్రశర్మ దృక్పథం విలక్షణంగా కనిపిస్తున్నా అందులో స్పష్టత ఉంది. భారతీయ సంస్కృతిని, మార్క్సిస్టు దృక్పథాన్ని అధ్యయనం చేయాలని అంటాడు. రష్యా, చైనా వంటి దేశాల లాగానే భారతదేశంలో కూడా మార్క్సిస్టు సిద్ధాంతం మట్టిని ముట్టుకొని గొప్ప మార్పులకు శ్రీకారం చుడుతుందని అంటాడు. రష్యాలో విప్లవం పుట్టకముందే రెండువందల యేండ్ల పూర్వం మహాద్రష్టలైన రచయితలు పుట్టారని, వారి సాహిత్యాన్ని చదివి రష్యాలో నాయకులు పుట్టారని, కవిసేన మేనిఫెస్టోలో ఆయన చెప్పిన దృక్పథంగా అర్థం చేసుకోవాలి. మనిషి ఎవడి పని వాడు త్రికరణశుద్ధిగా చేసుకుంటే అందులో విజయం సాధ్యమవుతుందని, భారతంలోని ధర్మవ్యాధునికథ అదే చెబుతుందని, ఒక ఋషి మాంసం అమ్ముకునే వ్యాధుడిని మోక్షోపాయం చెప్పమని కోరడంలో, ధర్మసూక్ష్మాలు తెలుసుకోవడంలో విశేషాన్ని గ్రహించడ మని శేషేంద్ర చెప్పడంలో ఆయన దృక్పథం అర్థమవుతోంది. ఈ సృష్టిని దేవుడు పుట్టించాడా? అదే పుట్టిందా? అనే ప్రశ్నలకు సమాధానం ఆలోచిస్తూ కూర్చోవడం అజ్ఞానమంటాడు. మనిషి తర్కంలోంచి విశ్వం పుట్టిందని అనుకోవడం, పరమేశ్వరసృష్టి ద్వారా పుట్టిందనుకోవడం రెండూ అవివేకమే అంటాడు.

శేషేంద్ర లేఖల్లో భౌతికతత్వంపై అనేక వ్యాఖ్యలు కనిపిస్తాయి. ప్రకృతిలో ప్రతిచెట్టు, ప్రతిజీవి భూమి ఆకర్షణ శక్తితో పోరాడుతూ ఆకాశంవైపు ప్రయాణం సాగిస్తుందనే వాస్తవాన్ని చక్కగా ఉదహరిస్తాడు. గింజలో నుండి వచ్చిన చెట్టు, పక్షుల ప్రయాణం, మనిషి ప్రయత్నం అన్నీ ఆకాశంవైపు వెళ్ళడానికి జరుగుతున్న ప్రయత్నం అన్నీ యాదృచ్ఛికం కాదంటాడు. అలాగే ఆయన ఆస్తికవాదికాదు. యుగయుగాల నుండి ఆకలితో అల్లాడే కోట్లాది దళిత మానవులకు మెడిటేషన్ గాని, కృష్ణభక్తిగాని ఔషధాలుగా పనిచేయలేదని వారి ఆకలికి అన్నమే ఔషధమయ్యిందని చెబుతాడు. ఆ రెండు ఔషధాలు కడుపు నిండినవారికి ఉపయోగపడతాయని చెప్పడంలో భౌతికతత్వం ఇమిడి ఉంది.

**2.4. భాష :**

సమాజంలోనూ, సాహిత్యంలోనూ మనిషి తన ఆలోచనలు చెప్పడానికి ప్రధానమైన సాధనం భాష. ఈ భాషపై జరుగుతున్న సిద్ధాంత రాద్ధాంతాలపై శేషేంద్ర స్పదించాడు. మనిషిని ఎన్నో హద్దులు, లోపాలు పీడిస్తున్నట్లే భాష కూడా పీడిస్తుందంటాడు. భాష ఉపయోగపడుతుంది కాని, పీడిస్తుందా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన భాషల్లో నిమ్నోన్నతాలు, తక్కువ ఎక్కువలు ఆధారంగా ఒకజాతిని కురస చేస్తున్న పద్ధతిని విమర్శిస్తాడు. **'రాజకీయవాది తన ఆత్మరక్షణకోసం ఎత్తిన నూతన ఆయుధం భాషాభిమానం'** (సాహిత్యదర్శిని – పుట. 120). ఒక భాషలో నుండి మరొక భాషలోకి సాగే తర్జుమా విధానంపైన శేషేంద్రకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. అనువాదం చాలా క్లిష్టమైన పని అని, మూలభాషలో ఉన్న నాజూకు, జాతీయాలు వంటివి అనువాదంలోకి రావడం అంత సులభమైన పని కాదని చేస్తున్న వాదనను ఆయన ఖండిస్తాడు. స్వయంగా అనేక భాషలలో పరిచయం ఉన్న ఆయన మూలభాషలో ఉన్న విశేషాలను జాగ్రత్తగా కృషి బద్ధుడై చేస్తే అనువాదమంత సులువైన ఇంకొకటి లేదని అంటాడు. తెలుగుభాషలో తెలుగు నానుడిని తెలుసుకున్న మహానుభావుడు సుమతీ శతకకారుడని, నొప్పించక తానొవ్వక తప్పించుక తిరగడం తెలుగు జాతీయ లక్షణంగా 12 శతాబ్దానికే స్థిరపడిపోయిందని వ్యంగ్యంగా అంటాడు శేషేంద్ర.






**3. ఇంటర్వ్యూలు :**

'సాహిత్య దర్శిని'లో రెండు సుదీర్ఘ ఇంటర్వ్యూలు ఉన్నాయి. 1. ఉదయం పత్రికకోసం త్రిపురనేని శ్రీనివాస్ చేసింది కాగా, 2. ఆంధ్రప్రభ పత్రిక చేసింది. లేఖలు, ప్రశ్నలు – జవాబుల కంటే భిన్నమైనవి ఇంటర్వ్యూలు. ఒక పత్రికారంగానికి సంబంధించిన సామాజికుడు సుప్రసిద్ధుడైన కవిని వివాదాస్పద వ్యాఖ్యలు చేయించడానికి గానీ, సమకాలీన సాహిత్య పయనానికి సంబంధించి గానీ ప్రశ్నలు సంధిస్తాయి. సాహిత్య రంగంలో పరిపూర్ణత సాధించిన వారిని మాత్రమే గతంలో ఇంటర్వ్యూలు చేశారు. తెలుగు సాహిత్యరంగంలో పరిపూర్ణమైన మూర్తిమత్వం గల శేషేంద్రను కూడా ఇంటర్వ్యూల్లో అనేక అంశాలపై ప్రశ్నించారు. మార్క్సిజంపైన, ఆధునికతపైన, కవి రాస్తున్న సాహిత్యంపైన, విమర్శపైన పత్రికా సంపాదకులు అడిగిన ప్రశ్నలకు శేషేంద్ర శర్మ తొట్రుపాటు లేని సమాధానాలు చెప్పాడు. ఈ సమాధానాల్లో కొన్ని గతంలో ప్రశ్నలు/జవాబులు కింద ఇచ్చిన సమాధానాల కంటే భిన్నంగా కనిపించవు. వాటిలో ఏ ఆలోచన విధానం దృక్పథంతో వివరణలు ఉంటాయో అదే విధంగా ఈ ఇంటర్వ్యూల్లో కూడా సారూప్యత కనిపిస్తుంది.

మార్క్సిజానికి సంబంధించి ఆలోచన అక్కరలేదని, ఆచరణ అవసరమని చెబుతున్న శేషేంద్ర అభిప్రాయాన్ని వక్రీకరణ కాదా? అని పత్రికా ప్రతినిధి ప్రశ్నించినప్పుడు భారతదేశంలో మార్క్సిజం ఎలా సాగుతుందో చెబుతాడు. భారతదేశంలో వివేచన దగ్గరనే మార్క్స్ సిద్ధాంతం ఆగిపోయిందని, ఆచరణ దగ్గరకు వచ్చేసరికి ఛిన్నాభిన్నమై

పోయిందని అంటాడు. అలాగే శేషేంద్ర వ్యక్తి అనడానికి బదులు 'ఆత్మ' అని, అధ్యయనాన్ని 'తపస్సు' అని, వర్తమాన సామాజిక వ్యవస్థను 'విధి' అని, ఆర్థిక విముక్తిని 'మోక్ష'మనే పదాలతో సూచించడం సాంప్రదాయ విధానం కాదా? అని ప్రతినిధి ప్రశ్నించినప్పుడు తన వాదాన్ని శేషేంద్ర సమర్థించుకున్నాడు. మారుతున్న సమాజంలో పదాలు మారిన మాట వాస్తవమే కానీ, వ్యక్తి లోతును 'ఆత్మ' పదంతో, అధ్యయనపులోతును 'తపస్సు' పదంతో సూచించడం తప్పేమికాదని అంటాడు. శేషేంద్ర రాసిన ఆధునిక మహాభారతం పుస్తకాన్ని పర్వాలుగా విభజించడం 'ఇది వింశతిత శేషేంద్ర నామ సంవత్సరమని' ముగించడం ప్రాచీనకవుల లక్షణం అవుతుందే కాని, ఆధునిక కవుల లక్షణం కాదు కదా? అని ప్రశ్నించినప్పుడు మనదేశంలోని గ్రామాలు ప్రజలు పదహారవ శతాబ్దంలోనే ఆగిపోయారని, ఇరవై శతాబ్దంలోకి ఇంకా రాలేదని అంటాడు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం భారతపర్వాల్లో 17వ పర్వం కాదా? మరి అది అధునికమైనప్పుడు తను పర్వాలుగా విభజించడం ఆధునికత కాకుండా ఎలా పోతుందని అంటాడు.

సాహిత్యరంగంలో విమర్శకుడు కోర్టులో జడ్జి లాంటిదంటాడు. అయితే తెలుగు సాహిత్య విమర్శకుల్లో న్యాయస్పృహ లేదని, పలుకుబడి కలిగిన వారిని మెప్పించే దిశగా విమర్శ సాగుతోందని, పెద్దవాళ్ళనెదిరిస్తే తమకు నష్టమనే భావం విమర్శకుల్లో ఉందంటాడు. తాను రాజకీయ సిద్ధాంతపరంగా కమ్యూనిస్టునని, సంస్కృతి పరంగా భారతీయతకు అగ్రతాంబూలం ఇస్తానని, ప్రపంచ సంస్కృతినంతా మనిషి తనలోకి తీసుకురావాలని విశ్వాసం కలిగిన వాడినని చెబుతాడు (సాహిత్యదర్శిని – పుట.227). సగటు మనిషి న్యాయం పొందటానికి మార్గాలన్నీ బందు చేయబడి ఉన్నాయి కాబట్టి, నక్సలిజం ఈ సమాజానికి సరిపోతుందంటాడు. ఇంతటి తీవ్రవాద ఆలోచనలు కలిగిన శేషేంద్ర వాల్మీకి కవిత్వంతో ప్రభావితమైనానంటాడు. సైగల్, ఫంకజ్ మల్లిక్ వంటి గాయకుల పాటలు, శరత్ నవలలు వంటివి తనను ప్రభావితం చేశాయని అంటాడు.

శేషేంద్ర రాసిన 'కామోత్సవ్' నవల విమర్శలకు గురైంది. దానికి ఆయన సూటిగానే సమాధానం చెబుతాడు. **"వ్యతిరేకత మా సాహిత్యంలో రాజకీయ ముసుగుదారుల నుంచే. వాళ్ళు ఇంత గొప్ప నైతిక ఋషీశ్వరులని, సంఘసంస్కర్తలని నాకిప్పుడే తెలిసింది"** (సాహిత్యదర్శిని – పుట.239). అంటూ వ్యంగ్యంగా అలాంటి విమర్శ చేసిన వారిని మొత్తుతాడు. మనదేశంలో నీతులు, చట్టాలు సామాన్య ప్రజలకే కాని ఉన్నత వర్గాలకు వర్తించవనే వాస్తవాన్ని ఆధారంగా చేసుకుని రాసిన నవలను, మన సర్వ అవగుణాలు కలిగిన ఋషీశ్వరులు విమర్శించడం, కోర్టులో కేసులు వేయడం వంటివి చేశారని వివరణ ఇస్తాడు.

**"నేను వాల్మీకి అనే ఇరుసు మీదనే యావత్తు భారతీయ సాహిత్యం తిరుగుతూ ఉంటుందంటాను"** అంటూ వాల్మీకినే సాహిత్య కేంద్రబిందువుగా చేస్తాడు. ఈ రోజు విమర్శకులంతా ప్రతి కవిని ఏదో గాడి కట్టి అందులో ఇరికిద్దామని చూస్తుంటారని చెప్తాడు. వాల్మీకి తర్వాత ఆధునికకాలంలో శ్రీరంగం నారాయణబాబు మంచి కవిత్వం రాశాడని, తెలుగులో ఎవరూ అలాంటి కవిత్వాన్ని రాయలేదని అందుకే ఆయన 1955లో రాస్తే 1972లో అచ్చు అయ్యిందని, ఆయన కాలిగోటికి కూడా సరిపోనివారు లక్షల పుస్తకాలు అచ్చు వేసుకున్నారని, ఒక్కొక్కసారి సమాజం ఇలాంటి అవకాశం కల్పిస్తుందని అంటాడు.

శేషేంద్రశర్మకు న్యాయంగా రావాల్సినంత పేరు ప్రతిష్టలు పొందని సాహిత్యకారుడు. సూటిగా మాట్లాడటం, నిర్ద్వంద్వంగా ఖండించడం, తన మార్గాన్ని తాను నిర్మించుకుంటూ వెళ్ళిపోవడం, గులాంగిరి చేయడానికి ఇష్టపడకపోవడం ఆయనకు ఆభరణాలే అయ్యాయి. పాఠకులకు సంబంధించి ఆయన చెప్పిన మాటలు వాస్తవంగా అనిపిస్తాయి. **"వినేవాళ్ళు చాలా గొప్పవాళ్ళు. కవిత్వమంటే ఏమిటని తెలుసుకునేందుకు టైమ్‌వేస్టు చేయని మహానుభావులు. నిజమైన కవిత్వాన్ని వీళ్ళు గుర్తుపట్టలేరు. దేనికైనా డబ్బు ఖర్చు లేదు కాబట్టి చప్పట్లు కొడతారు. నిజమైన కవిత్వం చెబుతుంటే నిర్వికారంగా చూస్తుంటారు. రాసినవాడు చదువుతూ కూలబడి ఇక రాయకూడదని అనుకుంటాడు."**

శేషేంద్రశర్మ కవిత్వంలాగా ఆయన సమాధానాలు, లేఖలు, ఇంటర్వ్యూలు అర్థం చేసుకోగలిగిన స్థాయి ఉన్నవారికి తప్పకుండా అర్థమవుతాయి. ఒకవేళ అర్థం చేసుకోలేని స్థాయిలో ఉంటే వారికి ఏవీ అర్థం కావు కాబట్టి ఇవీ అర్థం కావు. చివరగా అంధ్రప్రభ దినపత్రిక 29-08-1983న రాసిన రెండు మాటలతో ముగిద్దాం. **"శేషేంద్రశర్మగారిది మామూలు కలం కాదు అదొక విచిత్రమైన కత్తి. ఆయన దానిని పద్యంలో పుటంపెట్టి వచనంతో పదునుచేసి వ్యంగ్య ద్రావకంలో శుద్ధిచేసి స్వప్నంలోకాల పగడాలు అద్ది కవితా సరస్వతికి కానుకగా ఇచ్చాడు".**

**ఆధారగ్రంథాలు :**

1. సాహిత్యదర్శిని (లేఖలు, ఇంటర్వ్యూలు, వ్యాసాలు)– శేషేంద్ర

2. యుగకవి గుంటూరు శేషేంద్రశర్మగారి కవితా ప్రస్థానం– కలువగుంట రామమూర్తి

3. ఎంతకాలం ఈ ఎండమావులు (పత్రికారచనలు)– శేషేంద్ర



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 (13) హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# కళాతపస్వి కె. విశ్వనాథ్ సినిమాలు – స్త్రీ పాత్రలు

**డా. బూర్ల చంద్రశేఖర్**, సహాయాచార్యులు, మెట్‌పల్లి, కరీంనగర్. ఫోన్ : **98495 82926**




కథా కథన విధానం, సంఘటనల, పాత్రల మధ్య సంఘర్షణాత్మక సంభాషణలు, సన్నివేశ కల్పనలను దృశ్యరూపంలో తెరపై ప్రదర్శించే కళ సినిమా. సినిమా నిర్మాణంలో ముఖ్యమైనవాడు దర్శకుడు (డైరెక్టర్). సినీ దర్శకుడు తను ఏదైతే తన ఊహాలోకంలో దర్శిస్తాడో దానిని తనకు కావలసిన రీతిలో, సృజనాత్మకంగా దృశ్యరూపంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. అందుకుగాను చలనచిత్ర నిర్మాణం కొరకు నియమించబడిన అందరిలో ఉన్న శక్తులను (టాలెంట్) సమర్థవంతంగా సమన్వయపర్చడంలో ముఖ్యభూమిక పోషిస్తాడు. పరిపూర్ణ చలనచిత్ర ఆకృతి తీసుకురావడానికి తోడ్పడతాడు. దర్శకుడు ఎంత కళాత్మక హృదయుడైతే అంతగా తన చలనచిత్రాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంటాడు. అలాంటి దర్శకులు చాలా అరుదుగా ఉంటారు అందులో ఒకరే కీ.శే. కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ గారు.

"కావ్యేషు నాటకం రమ్యం" అని మన భారతీయ సాహిత్యంలో నాటక ప్రక్రియ గురించి ఆలంకారిక విమర్శకులు ఉన్నతంగా చెప్పారు. ఆ నాటకం యొక్క ఆధునిక పరిణామ రూపమే నేటి సినిమా ప్రక్రియ. చాలా వరకు నాటక ప్రక్రియకున్న సాహిత్య శాస్త్ర సూత్రాలనే సినిమా ప్రక్రియకు అన్వయించుకోవచ్చు.

"విభావానుభావ వ్యభిచారీ సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుని రస సూత్రం. రసం ఒక భావోద్వేగ స్థాయి (emotional state). నాటకంలో నవరసాలను పండించి సహృదయునిలో అద్భుతమైన భావాలను పూయించే అవకాశం (స్కోప్) ఉంటుంది. ఈ నవ రసాలను తన నటన ద్వారా అందించే కళాకారుడు ఒక్కో రసం ద్వారా ఒక్కో భావాన్ని ప్రేక్షకునిలోని స్థాయీభావాన్ని చేరుకునే విధంగా చేయగలడు. అత్యుత్తమ నటుడు తన రసాభినయంతో ప్రపంచాన్నే మైమరపింపజేయగలడు. అలా ఒక నటునిలో ఉన్న అలాంటి కళాకారున్ని సందర్భానుకూలంగా బయటకు తీసుకు వచ్చేవాడే దర్శకుడు. అంటే దర్శకుని బాధ్యత సినిమా రంగంలో ఎంతో ఉంటుంది. సినీ దర్శకునికి అధ్యయన జ్ఞానంతో పాటు ఆకస్మిక జ్ఞానం, లౌకిక జ్ఞానం ఎంతో అవసరం. విశ్వనాథ గారు వేద, పౌరాణిక విషయాలే కాకుండా భరతుని నాట్యశాస్త్ర లోతులు, ధ్వన్యాలోకకారుని కావ్యాత్మ భావుకత, ఆధునిక సామాజిక శాస్త్రాల అధ్యయనం చేసినట్టు శంకరాభరణం, కాలంమారింది, సప్తపది లాంటి సినిమాలు చూస్తే మనకు తెలుస్తుంది.

మన ప్రాచీన అలంకారశాస్త్రాలలో ధీరోదాత్తాది నాయక, అష్టవిధశృంగార నాయిక లక్షణాలెన్నో చెప్పారు. కొన్ని లక్షణాలు సార్వకాలీనంగా మనకుపయోగపడినా, ఆధునిక కాలంలో వచ్చిన ప్రక్రియల విశ్లేషణలకు కావలసిన నాయిక లక్షణాలను ఏర్పరచుకోవలసిన అవసరం నేడు ఎంతో ఉంది. అప్పటి అవసరానికి ఆయా లక్షణాలు సరిపోవచ్చు. కాని ఇప్పుడున్న ఆధునిక ఇతివృత్తాలను, సమస్యలను, ప్రేక్షకులను, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాయిక లక్షణాలను మనం కొన్ని రూపొందించుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఎంతో ఉందనిపిస్తుంది. సినిమా ప్రక్రియనే తీసుకుంటే కొన్ని సినిమాలలో నాయిక పాత్రల్ని సూక్ష్మంగా చూసినట్లైతే, అధ్యయనం చేసినట్లైతే మనం కొన్ని లక్షణాలు ఏర్పరచుకోవచ్చు. వాటి ఆధారంగా మనం కొంత నాయికా లక్షణాలకు సంబంధించిన సూత్రాలను తెలిపే ప్రయత్నం చేయవచ్చు. ఇందుకు ప్రాచీన సాహిత్యాన్ని, లక్షణగ్రంథ సూత్రాలను కూడా కొంత వాడుకోవాల్సి ఉంటుంది. నాయకుడు, నాయిక అంటేనే శ్రేష్ఠులై ఉండాలని సాంప్రదాయం. సినిమాలలో సానుకూల దృక్పథాలున్న నాయిక పాత్రలను అధ్యయనం చేసి వారందరిలో అంతఃసూత్రంగా ఉన్న (కామన్) సమాన శ్రేష్ఠ గుణాలకు ఒక సూత్రం చెప్పవచ్చు. ఇక్కడ విశ్వనాథ సినిమాలలో ఉన్న కొన్ని ఉన్నత గుణాలుగల స్త్రీ పాత్రలను తీసుకొని, భగవద్గీతలో తెలిపిన స్త్రీల లక్షణాలను ఆధారం చేసుకొని పాత్రలను విశ్లేషించే ప్రయత్నం చేసాను.

**"మృత్యుః సర్వహరశ్చాహమ్ ఉద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ॥** (భగవద్గీత, 10-34)

కీర్తి, సిరిసంపద, చక్కటి వాక్కు, జ్ఞాపకశక్తి, మేధస్సు, ధైర్యం మరియు క్షమాగుణం అనేవి స్త్రీలలో ఉండే గొప్పవైన ఏడు లక్షణాలు తానే అని గీతాకారుడు తెలుపుతాడు. విశ్వనాథ సినిమాలలో మనం ఈ లక్షణాలు పరిపూర్ణంగా ఉన్న స్త్రీ పాత్రలను చూడవచ్చు. వీరి సినిమాలలో ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం కలిగిన సజీవ స్త్రీ మూర్తులు మన ముందు కదలాడుతారు. పై ఏడు లక్షణాలలో ఒక్కొక్క లక్షణం అధికంగా ఉన్న పాత్రలను, అలాగే ఒక్క స్త్రీ పాత్రలో అన్ని లక్షణాలను కూడా మనం చూడవచ్చు.

**1. కీర్తి మంతురాలు : (కీర్తిః)**

కీర్తి అంటే యశస్సు, ప్రసిద్ధి, ప్రఖ్యాతి అనే అనేక అర్థాలున్నాయి. మనిషి తనలోని దివ్యత్వాన్ని లేదా నైపుణ్యాన్ని (పాజిటివ్ టాలెంట్) స్వయంగానో లేక గురువు (మార్గ దర్శకుడు) ద్వారానో గుర్తించి, ప్రయత్న పూర్వకంగా బయటకు తీసుకొచ్చి ప్రదర్శించడం ద్వారా వచ్చేది కీర్తి అని స్థూలంగా చెప్పవచ్చు. అశాశ్వత ఆడంబరాల ద్వారా పొందేది కీర్తి కాదు. అదే కీర్తి అనుకోవడం కేవలం భ్రమ మాత్రమే అవుతుంది. కీర్తి అనే గుణం మొదటగా మనిషిని తనను తాను ప్రక్షాళనం చేసుకొనేలా చేస్తుంది. మనిషిని పరిపూర్ణుని చేస్తుంది. ఆత్మానంద లోతులోంచి పెల్లుబికేదే కీర్తి. ఇలాంటి కీర్తి లక్షణం స్వర్ణకమలం చిత్రంలో నాయిక (భానుప్రియ) పాత్రలో కనిపిస్తుంది. తనలో నిబిడీకృతంగా ఉన్న అనంతమైన నాట్య శక్తిని అణచి పెడుతూ, ఆధునికాడంబరాల యాంత్రిక జగత్తును ఆరాధించే స్వాభిమాన యువతిగా మనకు నాయిక కనబడుతుంది. మధ్యతరగతి జీవన విధానంలోని స్తబ్దతలో స్త్రీ ఎదుర్కునే సంఘర్షణ ఆమెలో కనబుతుంది. అలాంటి నాయిక తనకు మార్గదర్శి దొరకగానే తనలోని కళను జాగృతం చేసుకుంటుంది. తన ప్రతిభను పరిపూర్ణంగా బయటకు తీసుకొచ్చి కళాహృదయులనే కాదు తన హృదయాన్ని ప్రక్షాళితం చేసుకుంటుంది. ఇంతకన్న గొప్ప కీర్తి ఏముంటుంది. మనకు పూర్వం నుంచి ఉన్న సప్తవిధ కీర్తి లక్షణాలైన **"దానకీర్తి, పుణ్యకీర్తి, కావ్యకీర్తి, వక్తృత్వకీర్తి, వర్తనకీర్తి, శౌర్యకీర్తి, విద్వజ్జనకీర్తి"** (సంకేత పదకోశము–రవ్వా శ్రీహరి 2002) ప్రయోజనం కూడా ప్రతిభా ప్రదర్శనలే కదా. మనలోని సంతృప్తి రాహిత్యాన్ని కళ ఎలా పోగొడుతుందో ఈ చిత్రంలో నాయిక పాత్ర ద్వారా చూపిస్తాడు దర్శకుడు. సినిమా చివర్లో అందించే **'మీలోని ప్రతిభను మీరు మేల్కొల్పుకోండి'** అనే ప్రబోధం అనుసరణీయం.

**2. సంపదవంతురాలు (శ్రీః):**

సంపద అంటే డబ్బనే వ్యవహారికార్థం వెంటనే జ్ఞప్తికి వస్తుంది. సంపద అంటే భౌతికంగా, మానసికంగా అన్ని రకాలుగా సమృద్ధిగా ఉండడం అని అర్థం. గుణాల సమృద్ధి ద్వారానే సంపద భావం మనలో కలుగుతుందనేది అక్షర సత్యం. శంకరాభరణం చిత్రంలో నాయిక (మంజుభార్గవి) తనకు అనుకోకుండా వచ్చిన సంపదను కళాభివృద్ధికి ఖర్చు పెడుతుంది. కళ కోసం ఉపయోగించే ధనమేదైనా ద్విగుణీకృతం అవుతుందని, లోక కళ్యాణం కోసం ఉపయోగ పడుతుందని ఆ పాత్ర ద్వారా మనకు తెలుపుతాడు దర్శకుడు. అంత గొప్పగా తను ఆలోచించడంలోనే ఆమె సమృద్ధి దాగి ఉంది. ఇలాగే సిరివెన్నెల, సాగరసంగమం చిత్రాలలోని నాయికలు మనకు కనిపిస్తారు.

**3. వాక్చాతుర్య గుణం (వాక్) :**

చతురత్వం అంటే తెలివి అనే అర్థం. మనమిప్పుడు ఎక్కువగా వింటున్న ఇంగ్లీషు భాషలోని కమ్యూనికేషన్స్ స్కిల్ అనే పదానికున్న అర్థం వాక్ చాతుర్యమే. అయితే ఈ నైపుణ్యం వ్యక్తిత్వ అభివృద్ధికి తోడ్పడినప్పుడే సాఫల్యం చెందుతుంది. నన్నయ భారత శకుంతల పాత్రలో, తిక్కన భారత ధర్మరాజు పాత్రలో ఈ సంభాషణా చాతుర్య పరాకాష్ఠ మనకు కనబడుతుంది. విశ్వనాథ వారి చాలా మంది నాయికలు మంచి వాక్చాతుర్యం కలిగినవారిలాగా కనిపిస్తారు. సూత్రధారులు చిత్రంలో రయ్యకృష్ణ పాత్ర, స్వయంకృషి చిత్రంలో విజయశాంతి పాత్ర, స్వర్ణ కమలం చిత్రంలో భానుప్రియ పాత్రలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

**4. జ్ఞానం (స్మృతిః)**

స్త్రీ అంటే వంటింటి కుందేలు కాదు సమాజంలో గొప్ప పాత్ర వహిస్తుందని సిరివెన్నెల, స్వాతిముత్యం, సాగర సంగమం నాయికల ద్వారా మనకు ప్రబోధిస్తాడు విశ్వనాథ్ గారు. సిరివెన్నెలలో మాటలు రాని నాయిక (సుహాసిని) కళ్ళు లేని నాయకునికి ప్రకృతి అందాలను దర్శింపజేస్తుంది. స్వయంకృషి చిత్రంలో నాయిక (విజయశాంతి) చదువురాని పల్లెటూరి పిల్ల. ఆమె ఉత్సుకతతో ఇంగ్లీషు నేర్చుకోవడంలో స్త్రీకి చదువెంత ముఖ్యమో తెలుస్తుంది. చదువుకోవాలనే ఆశయానికి వయసుతో సంబంధం లేదనే స్ఫూర్తి కలిగిస్తుంది. ఈ పాత్ర ద్వారా జ్ఞానానికున్న విలువను బోధిస్తాడు దర్శకుడు. ఈ పాత్ర ఎందరో చదువుకోవాలనుకునే గృహిణులకు ఆదర్శప్రాయం. సాగర సంగమంలో నాయిక (జయప్రద) జర్నలిజం చదువుకున్న అమ్మాయిగా చూపిస్తాడు. చదువుకున్న అమ్మాయి సాధికారికంగా ముందుకు వెళ్ళి తన లక్ష్యాలను నెరవేర్చుకోగలదనే అభిప్రాయం ఈ పాత్ర ద్వారా కనిపిస్తుంది.

**5. మేధోవంతురాలు (బుద్ధి) :**

చెల్లెలి కాపురం చిత్రంలో నాయిక రాధ (వాణిశ్రీ) తన మేధాశక్తితో నాయకునిలోని రచనా ప్రతిభను అందరూ గుర్తించేల చేస్తుంది. మొదటి నుండి తను ఆరాధించి రచనలకు కర్త నాయకుడు (శోభన్ బాబు) అని తెలుసుకొని, అతనిని మోసం చేసి ఆ రచనలను తన పేరు మీద ప్రచారం చేసుకుంటున్న వాని (నాగభూషణం) బండారం బయటపెట్టాలని అనుకుంటుంది. తన మేధాశక్తితో చాకచక్యంగా వ్యవహరించి ప్రతినాయకుని మోసాన్ని రెడ్ హాండెడ్ గా పాఠకులకు పట్టిస్తుంది. రూపం కన్న ప్రతిభా నైపుణ్యాలు గొప్పవని నాయకుని వివాహం చేసుకుంటుంది. సాగర సంగమం చిత్రంలో కూడా నాయిక (జయప్రద) విఫల ప్రేమికురాలిగా, కూతురిగా, ఇల్లాలిగా, తల్లిగా పాత్రలు నిర్వహిస్తూనే తన కళారాధనను వీడకుండా, తాగుబోతుగా మారిన తన స్నేహితుడిలోని కళా ప్రతిభను ప్రపంచం గుర్తించేలా చేస్తుంది. అలాగే తన కూతురిని కూడా అతనికి శిష్యురాలిని చేస్తుంది.

**6. ధైర్యవంతురాలు (ధృతిః)**

స్వాతిముత్యం చిత్రంలోని నాయిక (రాధిక) పాత్ర, అలాగే శు

భలేఖ చిత్రంలోని నాయిక (సుమలత) పాత్రలను చూసినట్లైతే వారికి ఎదురైన కొన్ని సామాజిక సమస్యలను, సంఘటనలను ధీ శక్తితో ఎదుర్కొనే ధీరవనితలలాగా కనిపిస్తారు. సమన్యాయం కోసం, స్త్రీ అస్తిత్వం కోసం పోరాడుతున్నట్టు కనిపిస్తారు. స్త్రీలందరూ అనుభవిస్తున్న సామాన్య అంశాన్ని ఆధారంగా తీసుకొని పరిష్కార దిశగా అభ్యుదయంతో అడుగేస్తారు. అలాగే తమ అభిప్రాయాలతో అందర్ని చైతన్యపరుస్తారు. స్వాతి ముత్యం చిత్రంలో నాయిక పాత్ర చాలా ధైర్యవంతురాలు. భారతీయ సమాజంలోని సాంప్రదాయిక మూఢ ఆచారాలను ప్రతిఘటిస్తుంది. వితంతువుగా ఉన్న స్త్రీ మళ్ళీ వివాహం చేసుకోవడం తప్పేమికాదన్న అభ్యుదయ దృక్పథం ఆమెది. అలాగే అమాయకుడైన నాయకుడిని అర్థం చేసుకోవడమే కాకుండా ప్రయోజనవంతునిగా మారుస్తుంది. ఒక సందర్భంలో నాయకుడి చేతికి కర్ర ఇచ్చి పంపడంలో అతనికి అన్యాయంపై పోరాడే మనస్తత్వాన్ని కల్పిస్తుంది. శుభలేఖ చిత్రంలోని నాయిక పాత్ర కూడా సామాజిక సమస్య అయిన వరకట్న దురాచారంపై పోరాడుతుంది. అలాగే శుభసంకల్పంలో నాయిక (ఆమని) కూడా లోకకళ్యాణం కొరకు ఏర్పాటు చేయబడిన సంకల్పం కోసం తన ప్రాణాల్ని కూడా లెక్కచేయదు.

**7. క్షమా గుణం (క్షమా) :**

శ్రుతిలయలు చిత్రంలో నాయిక (సుమలత) పాత్ర ఓర్పు, క్షమా గుణం కలిగింది. తన వ్యక్తిత్వంతో వ్యక్తిలో, వ్యవస్థలో మార్పు తీసుకొస్తుంది. స్వాతికిరణం చిత్రంలో నాయిక (రాధిక) పాత్ర ఈర్ష్యాళువుగా ఉన్న భర్తని అసహ్యించుకున్నా తిరిగి అతను మారాడని తెలిసిన తర్వాత క్షమా గుణంతో అక్కున చేర్చుకుంటుంది, ఆదరిస్తుంది. క్షమా అనేది బలహీనత కాదు మంచి సమాజనిర్మాణం కోసం మనం అవలంబించబడే వ్యక్తిత్వం అని ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. ఒక్కోసారి మాటలకందని ఎంతో గొప్ప మనో భావాన్ని మాటలు లేకుండానే పలికిస్తాడు ఈ దర్శకుడు. ఈ సినిమాలో అది కనిపిస్తుంది.

**8. మరికొన్ని సానుకూల లక్షణాలున్న స్త్రీ పాత్రలు :**

శ్రుతిలయలు చిత్రంలో నాయిక (సుమలత) పాత్రను తీసుకుంటే వ్యసనాల వెంట పరుగెట్టుతున్న భర్తను సరైన మార్గంలోకి తీసుకువచ్చే క్రమంలో ఎంతో సహనశీలగా కనబడుతుంది. చివరగా లక్ష్యసాధన దిశకు భర్తను మరలిస్తుంది. అలాగే తన భావాలను స్పష్టంగా వ్యక్తపర్చే ధైర్యశాలిగా కనబడుతుంది. తనకెదురైన సమస్యలను చాకచక్యంగా ఎదుర్కొనే ధీమతిలాగ కనిపిస్తుంది. ఆమెలో ఒక సాధికార నిర్ణాయక శక్తి కలిగిన స్త్రీమూర్తి మనకు కనబడుతుంది. ప్రణాళికా బద్ధంగా వ్యూహాలు ఏర్పరచుకొని తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. చివరగా అంతులేని క్షమా గుణాన్ని కనపరుస్తుంది. తను కేవలం తన కోసమే కాకుండా పరుల హితం కోసం పరితపిస్తుండడంలో ఆమె వ్యక్తిత్వం కనిపిస్తుంది. తన మరుదులను మార్చడంలో, అత్తామామల బాధ్యత




భుజాన వేసుకోవడంలో, కొడుకుకు విద్యాబుద్ధులతో పాటు విలువలను నేర్పించడంలో పరిపూర్ణతగల మహిళగా దర్శనమిస్తుంది. అంతేకాకుండా అనంత బ్రహ్మానంద సాగర లోతుగల సంగీతాన్ని తుచ్ఛమైన స్వార్థ పూరిత ఇంద్రియలోలత్వంతో బంధించడం అవివేకమని తెలిపే ప్రయత్నం చేస్తుంది. ఈ పాత్రలో మనకు పాశ్చాత్య ఫెమినిజం భావాలుగల స్త్రీ కనిపిస్తూనే, సహనభావంతో తన సంసారాన్ని చక్కదిద్దుకునే సగటు భారతీయ మహిళగా కూడా కనిపిస్తుంది. సహనం అంటే పరతంత్రంలో బ్రతకడం కాదు. తన తెలివితో సమస్య పరిష్కారం సాధించేంత వరకు స్వతంత్ర జీవన విధానంలో వేచి ఉండడమనే విషయాన్ని ఈ పాత్ర ద్వారా మనకు తెలుపుతాడు దర్శకుడు.

సప్తపది చిత్రంలో నాయిక నాయకునిలో కులం చూడదు. అతనిలోని వేణుగాన కళా నైపుణ్యాన్ని ఆరాధిస్తుంది. మనువు అయినా కూడా మనసును చంపుకొని జీవితాంతం ఏడ్చుకుంటూ మనుగడ సాగించకుండా మగని అనుమతితో మనసిచ్చిన వాడితో వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది. ఇందులో ఎంత స్థిరాభిప్రాయం, సాహసోపేత నిర్ణయం దాగి ఉందో మనం గమనించవచ్చు. సినిమాలో నాయిక ఒకరిని ప్రేమించి, పరిస్థితుల ఒత్తిడితో మరొకరిని పెళ్ళి చేసుకున్నప్పుడుండే మానసిక సంఘర్షణను, ద్వంద్వ భావాల పెనుగులాటను అనిర్వచనీయంగా చిత్రించాడు దర్శకుడు. సంభాషణలను అతితక్కువగా ఉపయోగిస్తూ హావభావాలతోనే పాత్రల మనసును తెలుసుకునేలా చేయగలుగుతాడు. నాయిక భర్త గుళ్ళోకి తీసుకుపోయి ప్రమాణం చేయించి, నిజం తెలుసుకునే సందర్భంలో సంభాషణల అవసరం లేకుండానే మనందరికీ కథ అర్థం అయ్యేలా చేస్తాడు. అంటే ఒక సాంప్రదాయిక కట్టుబాట్ల మధ్య, భావస్వేచ్ఛలేని స్త్రీ మౌన సంభాషణను మన కళ్ళను చెవులుగా మార్చి వినిపిస్తాడు. అప్పట్లో వచ్చిన రాధాకళ్యాణంలాంటి సినిమా కథకు సప్తపది సినిమా కథ ఒక విప్లవాత్మకం. మార్పును వెంటనే అనుమతించని ఈ సమాజంలో ఇది పెద్ద సాహసమే అని చెప్పాలి. అలాగే శంకరాభరణం చిత్రంలో కూడా నాయిక దాదాపు సగం సినిమా అయిపోయేంత వరకు మాట్లాడదు. తరువాత కూడా చాలా తక్కువే. ఈ రెండు సినిమాలలో చాలా వరకు పాత్రలు మాట్లాడవు వారి హావభావాలే మనకు కథను స్పష్టంగా తెలియజేస్తాయి.

సీతామహాలక్ష్మి సినిమాలో పల్లెటూరిలో పుట్టిన అమ్మాయి సినీరంగంలో ప్రవేశించి పట్నందాకా వెళ్ళడం కనిపిస్తుంది. అలాంటి క్లిష్టమైన రంగంలో ఆమె అనుభవించే సమస్యలు వాటిని ఆమె ఎదుర్కొన్న తీరు ఉన్నతంగా ఉంటుంది. సిరిసిరిమువ్వ చిత్రంలో మాటలు రాని నాయిక (జయప్రద) గుండెనిబ్బరంతో సవతితల్లి బాధలనెదుర్కొని చివరకు తననుకున్న లక్ష్యానికి చేరుకోవడం ఒక స్ఫూర్తి నింపే పాత్ర. ఆమె నాట్యాన్ని తన జీవిత గమ్యంగా చేసుకుంటుంది. ఓ సీతకథ చిత్రంలో నాయిక తను ప్రేమించిన వ్యక్తిని చంపేసిన వాడికి బుద్ధి చెప్పాలనుకుంటుంది. ఆ వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకోవడానికి వాడి తండ్రినే పెళ్లి చేసుకుంటుంది. తనకు జరిగిన అన్యాయానికి ఏ కోర్టులు విధించని శిక్ష అతనికి విధిస్తుంది.

ఉండమ్మ బొట్టుపెడతా సినిమాలో పేదరికంలో పుట్టిన అమ్మాయి పెద్దింటి కోడలిగా వెళితే ఎలాంటి కష్టాలు పడుతుందో చూపిస్తాడు దర్శకుడు. అతంటి కష్టంలోనూ నాయిక ఆత్మస్థైర్యంతో ఉంటుంది. అది తనిల్లుగానే భావిస్తూ ఇంటి వారికోసం, వారి బాగు కోసం తనను తాను త్యాగం చేసుకుంటుంది. ఈ సినిమా చూసినప్పుడు మనకు కట్టమంచి రామలింగారెడ్డి రచించిన "ముసలమ్మ మరణం" తెలుగు కావ్యం గుర్తుకు వస్తుంది. ఊరు బాగుండాలని 'ముసలమ్మ' అనే వనిత ఊరికోసం ప్రాణత్యాగం చేస్తుంది.

కాలం మారింది సినిమాలో అంటరానితనం నిర్మూలన ప్రధానాంశం. నాయిక (శారద) దళితుల ఇంట పుట్టిన బిడ్డ. ఆమె తండ్రి యజమాని కోసం త్యాగం చేసి చనిపోతాడు. ఆ సానుభూతితో యజమాని (గుమ్మడి) నాయికను తన కూతురుతో పాటు పెంచి పెద్ద చేస్తాడు. ఆ ఇంట్లో, ఆ కుటుంబంలో ఆమె ఎంతో వివక్షగా పెరుగుతుంది. తరువాత తన జన్మరహస్యం తెలుసుకొని ఎంతో సంఘర్షణ పడుతుంది. అయినా తన త్యాగ గుణంతో అందరి మనసులను మారుస్తుంది.

శంకరాభరణం చిత్రంలో నాయిక తనపై అత్యాచారం జరిగినా కూడా సామాన్య స్త్రీలాగా సమాజానికి బయపడి అబలగా ఆత్మహత్య చేసుకోవాలనో లేదా పారిపోవాలనో ఆలోచించదు. ఆ సమస్యను సాహసంగా ఎదుర్కొంటుంది. అట్టడుగునున్న తన జీవితాన్ని అనిర్వచనీయంగా మార్చుకుంటుంది. నాయికకు సంగీతం, నృత్యం అంటే ప్రాణం తల్లి ఆమెను వేశ్యావృత్తిలోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తే ఇంట్లో నుండి పారిపోతుంది. తనపై అత్యాచారం జరిగితే దానివల్ల ఆమె గర్భవతి అయి బిడ్డకు జన్మనిస్తుంది. తల్లిగా తన బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తుంది. కొడుకుకు సంగీత పరిజ్ఞానం నేర్పించి శంకరశాస్త్రి దగ్గరికి శిష్యరికానికి పంపుతుంది. విషపు బీజమైన తన సంతానాన్ని అసహ్యించుకోకుండా శంకరశాస్త్రిలాంటి సంగీత విద్వాంసుని దగ్గరకు పంపి శంకరుని మెడలో పాములాగా అందరూ పూజించేలా చేస్తుంది. తన కొడుకుని శంకరాభరణంగా భావిస్తుంది. ఒక కవి, రచయిత, కళాకారుని మనసు అతని సృష్టిలో కనిపిస్తుందనే దానికి నిదర్శనం శంకరాభరణం లాంటి సినిమాలు.

శుభలేఖ చిత్రంలో నాయిక (సుమలత) పెళ్ళి చూపులప్పుడు మాట్లాడే మాటల్లో స్త్రీవాద కవితా సంకలనమైన నీలిమేఘంలోని కవితలు గుర్తుకు రాక మానవు. అంగట్లో పశువును కొన్నట్టు వరుణ్ణి కొనుక్కోవడం ఇష్టం లేదని వరకట్న దురాచారంపై తిరుగుబాటు చేస్తుంది. స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, అవసరమో ఆమె పాత్ర ద్వారా తెలుస్తుంది.

తాత్కాలికావేశాలను రగిలిస్తూ, లాభాపేక్షే ధ్యేయంగా సినిమాలు వస్తున్న కాలంలో ఇలాంటి ఉన్నత భావాలుగల, కళాదృష్టిగల సినిమాలు తీసిన విశ్వనాథగారిది మొండి సాహసమే అని చెప్పాలి. తెలుగుదనం ఉట్టిపడే వేషధారణతో, స్పష్టమైన భావాలు పలికించగల సజీవత్వంతో, సామాజిక సమస్యలపై పోరాడే మనస్తత్వంతో, దృఢమైన వ్యక్తిత్వంతో, ఉదాత్తతతో నిండిన ఇలాంటి ఎన్నో స్త్రీ పాత్రలకు తన సినిమాల ద్వారా పురుడు పోశారు విశ్వనాథ్ గారు.

**ముగింపు**

వ్యాపార చట్రంలో పడి కొట్టుకుపోతూ, స్వర్ణానుభూతుల కోణం దగ్గరే ఆపే సినిమా రంగంలోని స్త్రీ పాత్రని సమగ్ర భావాల సమున్నత శిఖరంపై కూచోబెట్టడమే కాదు పట్టాభిషేకం కూడా చేసాడు విశ్వనాథ గారు. గాలి ఎటు వీస్తే అటు పోయే చంచలమైన పాత్రలు సృష్టించ లేదు వీరు. ప్రతి పాత్రకు ఒక గొప్ప ఆశయం ఉంటుంది. ప్రాచ్య, పాశ్చాత్య భావాల మేళవింపున్న పాత్రలతో, కౌటుంబిక సామాజిక విలువలను స్పష్టంగా బోధించగలరు వీరు. పురాణకాలం నాటి స్త్రీని పునర్నిర్వచించాలన్న దృక్పథం వీరి పాత్రల్లో చాలా చోట్ల కనిపిస్తుంది. అలాంటి పాత్రలను సృష్టించడంలో వీరు ప్రతీసారి వినూత్న పంథాను అనుసరించి విజయం సాధించారు. విశ్వనాథ కీర్తి కిరీటంలో కలికితురాళ్ళు వారు మలచిన స్త్రీపాత్రలు. ధ్వన్యాత్మకంగా తన పాత్రలద్వార పరోక్ష ప్రబోధం చేసినా అవి కేవలం తీర్పులాగా కాకుండా నిర్ణాయక శక్తిని ప్రేరేపించేవిగా ఉంటాయి. కళాదర్శకత్వం అంటే ఇదేనేమో. వాస్తవిక విషయాలను కళాత్మకంగా చెబుతూ, ప్రగాఢంగా బుద్ధిలో నాటుకునేలా చేయడం ఒక ఉత్తమ కళాకారునికే సాధ్యం. కళను తపస్సుగా భావించే వారికే సాధ్యం.

**ఆధార గ్రంథ సూచి**

1. చంద్రశేఖర్, బూర్ల. తెలుగు సినిమా పాట ప్రబోధాత్మకత. 2018.

2. https://www.sakshi.com/telugu-news/movies/director-k-viswanath-female-characters-movies-1522789

3. https://te.wikipedia.org

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# తెలుగు వారి 'పద్మ' సిరులు

డా. టంగుటూరి సైదులు, తెలుగు అధ్యాపకులు, ఎన్.జి. కళాశాల, నల్లగొండ, ఫోన్ : 991 267 6267

ఒకప్పుడు కేంద్ర పురస్కారాలు అంటే పెద్ద పెద్ద పట్టణ, నగరాలలో ఉండే క్లాస్ కళాకారులకే వచ్చేవి. క్రిందిస్థాయి గ్రామీణ కళాకారులను పట్టించుకునేవారు కాదు. కానీ దశాబ్ద కాలంగా మరుగునపడిన మట్టిలో మాణిక్యాలకు ప్రత్యేక గుర్తింపు వస్తోంది. పల్లెలోని మట్టి పరిమళాలు ఢిల్లీలో పద్మశ్రీలై పరిమళాలను వెదజల్లుతున్నారు. వారిలో మన తెలంగాణ వారిని 4 పద్మాలు వరించాయి. వారే సాహితీ కృషీవలుడు కూరెళ్ళ విఠలాచార్య, కేతావత్ సోంలాల్, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప.

**కూరెళ్ళ విఠలాచార్య :** జీవితానుభవాలనే సాహిత్యంగా మలిచి ఎందరికో మార్గదర్శకులుగా నిలిచి భవిష్యత్ తరాలకు ఏదో చేయాలనే తపనతో తన సొంత ఇంటినే పరిశోధన గ్రంథాలయంగా మార్చి కళామతల్లికి సాహిత్యసేవ చేస్తున్న కవి, రచయిత, నిత్య పరిశోధకులు, అభినవ పోతన, మధురకవిగా పేరుగాంచిన విఠలాచార్యగారు 80 సం॥ వయసులోనూ చేస్తున్న సాహిత్యసేవకు గానూ కేంద్రం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది.

విఠలాచార్య గారు ఉమ్మడి నల్గొండ జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో జన్మించారు. పసితనంలో తండ్రి వెంకటరాజయ్య చనిపోయారు. తల్లి లక్ష్మమ్మ ఎంతో కష్టపడి పెంచి పెద్దచేసింది. చిన్నతనం నుండే చదువంటే ఎంతో ఇష్టం. కానీ పుస్తకాలకు చాలా ఇబ్బంది పడ్డారు. తోటి విద్యార్థులు చదువుకుని నిద్రించిన తరువాత రాత్రివేళలో వారి పుస్తకాలు తీసుకుని చదువుకునేవారు. పుస్తకాలు లేకపోతే ఎంత కష్టమో వారికి తెలుసు. 9వ తరగతిలో ఉన్నప్పుడే "గోవిలాపం" కావ్యఖండిక రాశారు. ఎంతో శ్రమించి అధ్యాపకులుగా ఎదిగి నిరంతరం సమాజానికి ఏదో చేయాలనే తపనతో ప్రతి పల్లెపట్టు సాహిత్యానికి ఆటపట్టు కావాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో కవి సమ్మేళనాలు, సాహిత్యసభలు, అవధానాలు ఏర్పాటుచేయించి సాహిత్య సంస్థలను నెలకొల్పి యువతరాన్ని రచనావ్యాసంగం, సాహిత్యంవైపుకు మళ్ళించారు. కొంత కాలానికి గ్లకోమా కళ్ళజబ్బు వల్ల దృష్టిని కోల్పోయారు. అయినా మారుమూల తన జన్మస్థానం వెల్లంకిలో తన గృహాన్నే సాహితీ కుటీరంగా చేసుకుని 2014సం॥లో 500 పుస్తకాలతో గ్రంథాలయం ప్రారంభించి నేడు 50 లక్షల విలువైన భవనంలో 2 లక్షల పైచిలుకు పుస్తకాలతో అందుబాటులోకి తెచ్చారు. అనేక గ్రామాలలో గ్రంథాలయ స్థాపనకు కృషి చేసి కొత్త గ్రంథాలయాలు స్థాపించే వారికి 100 పుస్తకాలు బహూకరిస్తున్నారు.



ఎంతో కాలంగా కుల నిర్మూలన కోసం కృషి చేస్తున్నారు. 1960లో అక్షరాస్యత ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వీరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించే దాశరథి సాహిత్య పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. 6 దశాబ్దాలుగా సాహితీ రంగంలో సేవలందించినందుకుగానూ అనేక విశ్వవిద్యాలయాలు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. వీరి సాహిత్యసేవను గుర్తించి భారత ప్రధాని మాన్యశ్రీ నరేంద్రమోడి **"మన్ కీ బాత్"** కార్యక్రమంలో స్వయంగా ప్రశంసించారు.

వీరు **"తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణ"** అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. 20కి పైగా అద్భుతమైన రచనలు చేశారు. వివిధ ప్రక్రియల్లో పద్యం, వచనం, వ్యాస సంకలనాలలో సిద్ధహస్తులు. వీరి సాహిత్యసేవకుగాను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది.

**కేతావత్ సోంలాల్ :**

కులములోన నొకడు గుణవంతుడుండిన
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజం బున్నట్లు



ఈ వేమన పద్యం సోంలాల్ గారికి సరిపోతుంది. వారు అట్టడుగు వర్గాలలో జన్మించి నిరంతరం శ్రమించి అత్యున్నత పద్మశ్రీ పురస్కారం పొందుకున్నారు.

సోంలాల్ గారు 8-8-1959లో ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరి మండలం ఆకుతాట బావి తండాలో జన్మించారు. కేతావత్ భిక్ష, తారమ్మ వీరి తల్లిదండ్రులు. సోంలాల్ గారిది మొదటి నుండి కష్టపడే తత్త్వం. తన జాతి, తన భాష, అస్తిత్వం కోసం నిరంతరం కష్టపడి తమ భాషకు జీవం పోసి శాశ్వతత్త్వం కలిగించడానికి తనవంతుగా ప్రయత్నించి సాధించారు. జనగామ హాస్టల్‌లో ఉంటూ చదివేటప్పుడు పక్కనే ఉన్న గుడి నుండి రోజూ ఉదయాన్నే లౌడ్ స్పీకర్‌లలో వచ్చే భగవద్గీతను వినేవాడు.

మొదటి నుండి ఆధ్యాత్మిక భావాలు కలవాడు కావడంతో తమ జాతి ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని సంస్కృతంలో ఉన్న గీతను బంజారా భాషలోనికి తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. భగవద్గీతలోని 701 శ్లోకాలను 16 నెలల పాటు అవిశ్రాంతంగా శ్రమించి బంజారా భాషలోకి అనువదించారు. గీత అనువాదం 1983లోనే పూర్తయినా అది పుస్తకరూపం దాల్చడానికి 35 ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. 2014లో వీరు రచించిన గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించారు. దీనితో వీరి కృషి విశ్వవ్యాప్తమైంది.

వీరు ఎస్.బి.ఐలో పని చేస్తూ పదవి విరమణ చేసిన వీరు బంజారా జాగృతి కోసం 500పైగా పాటలు వ్రాశారు (జాగృతి గీతాలు). వీరు ఆధ్యాత్మిక ఆలోచనా విధానంతో రామాయణం, భారత గ్రంథాలపై పట్టు సాధించారు. వీటితో పాటు వెంకటేశ్వర చరిత్ర, హనుమాన్ చరిత్ర, సేవాలాల్ బాపోతి, మేదామామ్ బాపోతి, బంజారా పదకోశం వంటి రచనలు బంజారా భాషలో వ్రాశారు. తెలుగులో తొలి వెలుగు రచన చేశారు. 1987లో పాలేరులో కూలీలుగా మారిన లంబాడీల జీవితాన్ని ప్రతిబింబించే కథలు టి.వి, రేడియోలలో ప్రసారం చేయబడినవి. వీరికి భార్య కేతావత్ లలిత ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు. తన జాతి, భాష కోసం చేసిన సేవను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు.

**గడ్డం సమ్మయ్య :**

గత 5 దశాబ్దాలుగా కళను నమ్ముకుని తన కంచు కంఠంతో 19వేల ప్రదర్శనలిచ్చిన చిందు యక్షగాన కళాకారుడు సమ్మయ్యకు పద్మశ్రీ వరించింది. జనగామ జిల్లా దేవరుప్పల మండలం అప్పిరెడ్డి పల్లెలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. తన తండ్రి రామస్వామి నుండి ఈ కళను నేర్చుకున్నారు. 5వ తరగతి వరకు చదివారు. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తి కళాకారులు అయినందున 12సం॥ వయసు నుండే రంగస్థల వేదికపై రకరకాల పాత్రలు





వేస్తూ యక్షగాన కళను ప్రదర్శించేవాడు. దేశవ్యాప్తంగా వేలాది ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను రంజింపజేశాడు. చిన్నతనం నుండే రామాయణ, భారత పద్యాలపై పట్టు సాధించాడు.

తరతరాలుగా వస్తున్న కళ ఎల్లమ్మ వేషం, ఆది జాంబవంతుని ప్రదర్శనలు ఆకాశవాణిలో వందల కొలది ప్రదర్శనలిచ్చిరి. జిల్లా పౌర సంబంధాల శాఖలో 30వేల పైగా ప్రదర్శనలు మద్యపానం, కుటుంబ నియంత్రణ, హెచ్ ఐ వి ఆరోగ్య సమస్యలు, కరోనా వంటి సామాజిక అంశాలపై ప్రదర్శనలిచ్చారు. **"రంగస్థలంపై రారాజులుగా నిజ జీవితంలో దుర్భరులుగా"** ఎన్నో బాధలు పడ్డారు. ముఖ్యంగా సమ్మయ్య కంసుడు, కీచకుడు, భీముడు వంటి పాత్రలతో రంగస్థలాన్ని రక్తి కట్టించగలరు. కానీ టి.వి, సినిమా ప్రభావం వలన వారి కళ నిరాదరణకు గురైంది. వృత్తి కళ అడుగుబట్టింది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారి సహకారంతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందని, దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రం నాగ్‌పూర్ వారి ఆధ్వర్యంలో తమను అయోధ్యలో జరిగే బాల రాముని ప్రతిష్ట సందర్భంగా 4 రోజులు ప్రదర్శనలిచ్చారు. మొదటి రోజు సీతారణ్యవాసం, రెండవ రోజు లవకుశ, మూడవ రోజు మైరావణ, నాలుగవ రోజు సీతారాముల కళ్యాణం ప్రదర్శనలిచ్చాడు. వీరితో పాటు భార్య రంజిని, కుమారుడు పాల్గొంటారు. గడ్డం సమ్మయ్య యువ కళాక్షేత్రం వంటివి స్థాపించి కళను సజీవంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం **'కళారత్నహంస'** పురస్కారంతో సత్కరించింది. కళను నమ్ముకున్న తనను కేంద్రం గుర్తించి పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తమను కళాకారులుగా గుర్తించి గౌరవవేతనం ఇవ్వాలని సాంస్కృతిక సారథి కళాకారులతో సమానంగా అవకాశాలు ఇవ్వాలని, వృత్తి కళాకారులుగా ఎంతో చిన్నచూపు ఉందని, పక్కా గృహాలు కట్టించి ప్రభుత్వాలు ఆదుకొనాలని చూస్తున్నారు.

**దాసరి కొండప్ప :**

పాలమూరు మట్టి పరిమళం, జీవన నాదమైన వేళ అరుదైన కళకు జీవం పోసిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పను



పద్మశ్రీ వరించింది. ఒకప్పటి పాలమూరు జిల్లా ప్రస్తుతం నారాయణ పేట జిల్లా దామరగిద్ద గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు వెంకప్ప, వెంకటమ్మ. కొండప్ప పూర్వీకులు కూడా బుర్రవీణనే వాయించి జీవనం గడిపేవారు. తండ్రి నుండి కొండప్ప, వారి సోదరుడు నేర్చుకున్నారు. సోదరుడు మంచి గాయకుడు. అతని వద్ద పాడటంలో మెలకువలు నేర్చుకున్నారు. బుర్రవీణపై 24 రకాల శబ్దాలను వినిపించగలడు. ఆధ్యాత్మిక జ్ఞాన తాత్విక పౌరాణిక గీతాలను, రామాయణ మహాభారత, హరిశ్చంద్ర కథలను వీణ వాయిస్తూ అందర్నీ ఆకట్టుకుంటాడు.

జానపదులు తాము పాడే పాటకు తోడుగా ఏదో ఒక వాద్యాన్ని వాయిస్తుంటారు. వృత్తి కళాకారులకైతే తప్పనిసరి. బుర్రవీణ జానపదుల సాంప్రదాయం నాటి కాలంలో ఆ వాద్యాలకు ఎంతో ప్రాచుర్యం ఉండేది. నేడు మారిన సామాజిక పరిస్థితుల వలన జానపద వాద్యాలు మూలన పడి ఆ కళ అంతరించిపోతుంది. అక్కడక్కడ దాసరి కొండప్ప లాంటి వారు ఈ కళకు జీవం పోస్తున్నారు. కొండప్ప తన వాద్యాన్ని తనే తయారుచేసుకుంటాడు. గుండ్రంగా ఉన్న సొరకాయను తీసుకుని గుజ్జు, విత్తనాలను తీసేసి మధ్యలో వెదురుకర్రను అమర్చి తీగలను గట్టిగా లాగి అమర్చి శ్రు తులు పలికిస్తాడు. హెులియ దాసరి తెగకు చెందిన వారిగా వ్యవహరిస్తారు. కొన్ని ప్రాంతాలలో వేలితో వాయిస్తారు. కొందరు కర్రలతో వాయిస్తారు.

పండగలు, జాతరలు, ఉత్సవాల సమయంలో ఈ బుర్రవీణ వాయిస్తూ అందర్నీ ఆకర్షిస్తాడు. ఎవరైనా డబ్బు ఇస్తే అది అతనికి జీవనాధారమైతుంది. వృత్తిలో భాగంగా భిక్షం కూడా అడుగుతారు. 60 ఏళ్ళుగా ఇదే వృత్తి. భార్య వెంకటమ్మ చనిపోయింది. కుమారుడు ఉన్నాడు. బలగం సినిమాలో ఈ పాటను గానం చేశాడు.

అయ్యో శివుడా యేమాయె
యెనకటి దానికి సరిపోయె ॥2॥
యాసకండ్లదొక బర్రుండె
బర్రెకి దగ్గ దునపోతుండె ॥2॥
బర్రె బలిసిపాయే
దున్న దుంకిపాయే
నాగలి ఇరిగిపాయే
నవ్వుల పాలాయే

బుర్రవీణతో అనేక ఆధ్యాత్మిక తత్వాలను గానం చేశాడు.

"వద్దే మనసా నీకు బుద్ధిగల్గి ముద్దుగుండు"
"కృష్ణా దేవకీ నందన యాదవ సృష్టిలో
నీకన్న ఇష్టదైవము ఎవరు
కష్టపెట్టుట న్యాయమా యాదవ బాల"

గ్రామీణ ప్రాంతాలలో చాలా కష్టాలు ఎదుర్కొని నమ్మిన వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. ఇలాంటి వారిని జయధీర్ తిరుమల రావు గారు ప్రోత్సహించి రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పిస్తున్నారు. దాసరి రంగ పరిశోధనలో భాగంగా కిన్నెర మొగులయ్య, దాసరి కొండప్పను వెలుగులోకి తీసుకువచ్చాడు. తన కళను గుర్తించి పద్మశ్రీ వరించినందుకు అతని జీవితంలో వెలుగులు నిండుతాయని ఆశిద్దాం. కేంద్ర ప్రభుత్వం క్రింది స్థాయిలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించడం హర్షనీయం. ముందు ముందు ఎందరికో ఈ మహాభాగ్యం కలగాలని కోరుకుందాం.

**ఆనందాచారి వేలు :**

శిలలపై శిల్పాలు చెక్కినారు, మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు... కనుచూపు కరువైన వారికైనా కనిపించి కనువిందు కలిగించు రీతిగా... శిలలు చెక్కి ఎన్నో శిల్పాలకు ప్రాణం పోసిన ఆనందాచారి వేలును పద్మశ్రీ వరించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లిలో 1952లో జన్మించారు. చిన్నతనం నుండి కష్టపడే స్వభావం. కూలీగా జీవితం



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 20 హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

ప్రారంభించి పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు స్థపతి ఆనందాచారి. 1972లో టిటిడి శిల్పకళాశాలలో చేరారు. 4 సంవత్సరాలు శిల్పకళను అభ్యసించి తరువాత దేవాదాయ శాఖలో అధ్యాపకునిగా చేరారు. 1980లో దేవాదాయ శాఖలో సహాయ స్థపతిగా స్థిరపడ్డారు. గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, విజయనగరం, అన్నవరం, కాణిపాకం, శ్రీకాళహస్తి, బాసర, యాదగిరి గుట్ట ఆలయాల్లో పనిచేశారు. 2015లో మొదలైన యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో వీరిని యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటిడిఏ) ప్రధాన స్థపతిగా నియమించింది. టి.వి., రేడియోలలో అనేక శిల్పకళా ప్రసంగాలు చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వీరి ప్రతిభను గుర్తించి 2017లో శిల్పకళా విభాగంలో ప్రతిభా పురస్కారం అందజేశారు. వీరు అనేక అవార్డులు (150 పైగా) పొందారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కూడా సాధించారు. ప్రస్తుతం పద్మశ్రీ పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.

**ఉమా మహేశ్వరి :**

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు, చిన్ననాటి నుండే ఒక్కొక్కరు ఒక్కో రంగం వైపు అడుగులు వేస్తారు. సర్వాంతర్యామి యైన ఆ శ్రీహరిని కీర్తించి, శ్రీహరి లీలామృతాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఆధ్యాత్మిక రంగం వైపు పయనించిన డా. ఉమా మహేశ్వరిని పద్మశ్రీ పురస్కారం వరించింది. వీరు 1960 మే 21న కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి బాలాజీరావు నాదస్వర విద్వాంసుడు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసునిగా 3 దశాబ్దాలకు పైగా పనిచేశారు. ఉమామహేశ్వరి గారు కూడా తండ్రితో పాటు వేములవాడలో ఉండేవారు. పదో



తరగతి వరకు చదువుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరంలో ఉన్న శ్రీ సర్వారాయ హరికథా గురుకులంలో 14 ఏళ్ళ వయసులో చేరారు. విజయనగరం సంస్కృత కళాశాలలో 'రుక్మిణీ కళ్యాణం' హరికథాగానం తొలి ప్రదర్శనను ఇచ్చారు.

వారు హరికథా ప్రస్థానంలో ఇప్పటివరకు వేల ప్రదర్శనలు ఇచ్చారు. సంస్కృతంలో 500 ప్రదర్శనలు, తెలుగులో 800 ప్రదర్శనలు ఇచ్చారు. అంచెలంచెలుగా ఎదిగి జాతీయ కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మహేశ్వర భర్త ప్రముఖ ఆంధ్ర నాట్య నిష్ణాతులు శ్రీ కళాకృష్ణ గారు. మణిదీప్, అఖిల ఇద్దరు పిల్లలను దత్తత తీసుకొని పెంచి పెద్దచేశారు. ప్రస్తుతం బేగంపేటలో ఉంటున్నారు. పద్మశ్రీ పురస్కారం వరించినందుకు పూర్ణమైన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

---

## 'మెత్త' ని 'Pill'ow...!!??

**డా. వడ్డపురం కృష్ణ**
**ఫోన్ : 96666 02670**

ఉండుండి ఆలోచన అకస్మాత్తుగా
అలా ఆ మెత్త మీద వాలింది..?
ఇన్ని ఏండ్లు గడిచిన ఆ రాత్రుల ఆలోచనలు
ఒక్కసారిగా మెత్తమీదకు ఉసిగొల్పినయ్
ఎన్నెన్ని బాధలు భరించిందో ఆ 'మెత్త'ని మనసు
అలసిన గురకల రోదలు
మత్తులో జోగి కార్చిన జొల్లు
పాపం.......!!
కునికిపాట్లకు మౌనపు జోలపాట
కలవరింపులకు, ఉలికిపాట్లకు సాక్షి



పగటి కలలకు ఎన్ని సార్లు పగలబడి నవ్వుకుందో?
కాంతపక్షి మెత్తని ఈకల కలగలుపుతో
ఈ తలభారాన్ని, నా తలబిరుసును కూడా
మౌనంగా భరించిన మౌని
సచ్చి సల్లబడినా తగలబడే రోజొచ్చినా
తల వదలని తలగడకు
ఏమని నా కృతజ్ఞత నిద్దును
ఇంకొక నిద్దుర రాత్రిని తప్ప...!!??

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# తెలుగు బైబిలు అనువాదాలు : చారిత్రక వర్ణనాత్మక భాషాంశాలు

**డా. ప్రత్తిపాటి మాథ్యు,** మైసూరు. ఫోన్ : 9482989241

**కీలక భావనలు :** లిపి, ముద్రణ, **తెలుగు బైబిలు అనువాదాల లిపి విశేషాలు, గుణింత విశేషాలు,** వర్ణ నిరూపణ, ప్రాచీన **ప్రయోగాలు.**

**తెలుగు లిపి :** "లిపి అంటే లేపం చేయబడేది. ప్రాచీన కాలంలో మొత్తం అక్షరాలకు ధ్వనులనో, స్వరాలనో వాడుక ఉండి ఉంటుంది. కనుక ఈ మాటలే వ్యుత్పత్తిని బట్టే వర్ణ శబ్దం పురాతనమని, దానిని లేపనం చేయడంవల్ల లిపి అయిందని భావించవచ్చు". (రామచంద్ర 1990:56) ఒక భాషలోని ధ్వనులకు గల దృశ్యరూపం లిపి. ఇది క్రీస్తు పూర్వం ఆరేదు శతాబ్దాలకు ముందే మనకు ప్రచారంలో ఉంది. బ్రాహ్మి లిపి మన దేశంలోని లిపులన్నిటికి మూలమని పరిశోధకుల అభిప్రాయం. ఈజిప్టు వారి చిత్రలిపి ప్రపంచంలోని లిపులన్నిటికీ మూలమనే వాదం కూడా ఉంది. "మనలిపి కూడా చిత్రలిపి నుండి రూపొందిందే". (రామచంద్ర: 1990:51) ఈ దక్షిణ బ్రాహ్మీ లిపినుంచే తెలుగు–కన్నడ లిపి, దక్షిణా పథంలోని లిపిలు, బర్మా, సయాం, జావా, సింహళంలోని లిపులు ఏర్పడినాయి. "దక్షిణ బ్రాహ్మీలిపి నుంచే తెలుగు లిపి ఆవిర్భవించింది". (రామచంద్ర: 1979:345). వేంగి చాళుక్యుల నాటి లిపి 11 – 12 శతాబ్దుల మధ్యకాలంలో కొంత, ఆ తర్వాత 200 సంవత్సరాలకు – రెడ్డిరాజులు, విజయనగర రాజుల కాలాలలో తెలుగు –కన్నడ లిపులుగా విడిపోయి మరికొంత మార్పుచెందింది. అయినప్పటికి, 1746లో రాసిన షూల్జి రచనలో (తొలి తెలుగు అచ్చు పుస్తకాలు) ఇంకా పాత లక్షణాలు (కన్నడ–తెలుగు పోలికలు) కనిపిస్తాయి. ఈ రెండు భాషల లిపుల మధ్య తేడాలు స్థిరపడి వేరువేరు లిపులుగా పరిణమించాయి.

**ముద్రణ :** మన దేశానికి ముద్రణ యంత్రాన్ని తీసుకొచ్చినది పోర్చుగీసువారు. భారతదేశపు ముద్రణ చరిత్ర ఆరంభమైంది వారితోనే. తెలుగులో అచ్చు అయిన తొలి పుస్తకం మోక్షానికి కొంచ్చుపొయ్యేదొవ 1746లో రెవరెండ్ బెంజమిన్ షూల్జి రచించి జర్మనీలోని హాలే నగరంలో ముద్రించటం జరిగింది. 1772 నాటికి ముద్రణ యంత్రం చెన్నపట్నం చేరుకుంది. 1807లో తొలి తెలుగు వ్యాకరణం ప్రచురింపబడింది. 1830 నుండి అనేక నగరాలలో ముద్రణ యంత్రాలు నెలకొల్పబడ్డాయి.

**తెలుగు బైబిలు అనువాదాలు: లిపి విశేషాలు**

**రాత పద్ధతి కంటె వేరుగా ఉండటం:** గుడి, ఎత్వం, ఏత్వం, ఒత్వం కుడివైపున ఇవ్వటం




గుడి : ఇంటికి OT(1)-59
చీకటి NT(2)-58
ఎత్వం : ఈ నీళ్ళుకంటే OT(1) - 1
ఒంటెలను OT(8,9)-39
ఏత్వం : అనినదేమంటే OT(1)-31
పొట్టేళ్ళకు OT(10)-45
ఒత్వం : యెగ్గుంటె OT(1)-56
'నో, నో' లకు 'మె, మో'లు రాయటం
నొ: మెప్పి OT(3)-51
నో: మోఖుదు (వ్యక్తి నామం) OT(1)-8, 12
'యొ'కు 'యౌ' రాయటం
మనిషి యొక్క
ఒ ఓ లకు మె మో లు రాయటం
వు కటి OT(1)-12
వూ తండ్రి OT(2)-39

**రేఫకు బదులుగా వలపలగిలక రాయటం :**

అర్థము OT(1)-21, 52, 61
కతుని NT(1)-6, 14

**తెలుగు సంఖ్యలు – అరబిక్ సంఖ్యలు :** తెలుగు బైబిలు అనువాదాల ఆరంభం నుండి పాత, కొత్త నిబంధనలో తెలుగు సంఖ్యలనే వాడారు. ఇవి 1881వ సంవత్సరంలో అరబిక్ సంఖ్యలుగా మారాయి.

లూకా సువార్త 1812 ౧౮౧౨ ఆదికాండము 1821 ౧౮౨౧

**తెలుగు బైబిలు అనువాదాలు : గుణింత** (Spelling) **విశేషాలు :** ఒక మాటను ఉచ్చారణ విధేయంగా రాయటం అనే దశ నుండి

ఒకానొక నిబద్ధమైన గుణింతంతో రాయటం అనే దశ భాషలో కొంత ప్రామాణికతను సూచిస్తుంది. లేఖన సంప్రదాయకం కంటె భిన్నమైన ఉచ్చారణ (వ్యావహారిక భాషా లక్షణం) కాల క్రమేణ భాషలో చోటు చేసుకుంటుంది. లేఖన సంప్రదాయాలలోకి కేవల వాగ్రూప లక్షణాలు – ఉచ్చారణ ప్రభావంవల్ల ప్రవేశిస్తాయి. అటువంటి ఉచ్చారణ ప్రభావం శాసన భాషలోనే మనకు ఎన్నో చోట్ల దర్శనమిస్తుంది. ఇటువంటివాటి వివరణలను బూదరాజు రాధాకృష్ణ (1964), కందప్పచెట్టి (1966), రంగనాథాచార్యులు (1987), వంటి భాషాశాస్త్ర విద్వాంసులు విపులంగా చర్చించారు.

**ప్రస్తుతం బైబిలులోని లేఖన పద్ధతులలో కనిపించే ఉచ్చారణ విధేయతా లక్షణాలు కొన్నింటి వివరణ :**

లేఖ్యాక్షర సంకోచం (Orthographic abbreviation)

అ) ఉచ్చారణ సంబంధమైన లేఖ్యాక్షర సంకోచం

తన్ను (తనను) OT(1)-11

ఆ) ఉచ్చారణతో సంబంధంలేని లేఖ్యాక్షర సంకోచం

తన్ను (తనువును) OT(1)-4

**మూర్ధన్య హల్లుమీద దంత మూలీయాలు రాయటం (ఇవి ఉచ్చారణలో మూర్ధన్యాలు)**

పట్నము (పట్టణము) OT(2)-37

పట్నమందు NT(1)-12

అనునాసికానికి ముందు పూర్ణానుస్వారం అదనంగా రాయటం

అరంణ్యము (అరణ్యము) NT(3)-17

చెస్తుంన్నాను (చేస్తున్నాను) NT(3)-41

వకారానికి ముందు పూర్ణానుస్వారం రాయటం

వాడుంవలె NT(2)-57

ద్విలిపి ప్రయోగం (use of digraph)

వాంఛ్య NT(1)-50

శాసనభాషలో కూడా "తాలవ్య చకారోచ్చారణను, శకారోచ్చారణను సూచించటానికి చ,స లకు 'య' కార సంకేతాన్ని చేర్చటం క్వాచిత్కంగా కనిపిస్తుంది". (రంగనాథాచార్యులు 1974:174).

**అర్ధానుస్వారం**

దీనికి ప్రత్యేక చిహ్నం తెలుగు బైబిలు అనువాదాలలో వాడలేదు. వాడుంవలె వాంఛ్య NT(2)-57

**పూర్ణబిందువు పూర్వక ద్విత్వ హల్లు ప్రయోగం :** అంత్తా నున్ను NT(1)-42, 55

పూర్ణబిందు పూర్వక హల్లును అద్విరుక్తంగా రాయటంకూడా కనిపిస్తుంది. వింటున్ను NT(1)-7

పూర్ణబిందు పూర్వక అనునాసిక ద్విత్వం రాయటం. మంమ్మును NT(3)-20 వున్న్నాను NT(3)-23

సంయుక్తాక్షరాలనడుమ ఒక అచ్చును చేర్చి ఉచ్చారణను సులభంచేసుకోవటం. కదరలా ఒమెరుదు (కెదొర్లాఒమెరు) T(1)-18

**ఒ–వ లకు వ, వొ రాయటం :** వకటిగా OT(1)-24' వొస్తాడు NT(2)-31' వొంటిని NT(2)-28

**ఎ–కి య రాయటం :** యక్కువ తక్కువ NT(1)-55

**పదాది అగ్రాచ్చులకు ముందు ఉచ్చారణ సౌలభ్యంకోసం యకారం చేర్చటం:** యిద్దరు NT(6)-36, యీ యిద్దరున్ను NT(1)-1

**పదాది ఓష్ఠ్యాచ్చులకు ముందు ఉచ్చారణ సౌలభ్యం కోసం వకారం చేర్చటం :** వుపకారం NT(3)-15 , వూదా NT(3)-38

శాసనాలలో కూడా "పదాదిలో తాలవ్యాచ్చులకు, ఓష్ఠ్యాచ్చులకు వరుసగా యకార పూర్వక తాలవ్యాచ్చులకు, వకార పూర్వక

ఓష్ఠ్యాచ్చులకు భేదకత్వం లేదు." అన్నారు రంగనాథాచార్యులు (1989: 175–176) గారు.

**చేకారానికి చాకారం రాయటం:** విచారాలచాతనున్ను NT(1)-19, వ్యాపారముల చాతనున్ను NT(3)-19

**సి కి శి రాయటం (తాలవ్యాచ్చు అయిన ఇకార ప్రభావం వల్ల):** తోలివేశి NT(3)-21 , ఆయత్తము చేశి, NT(3)-39 , బయటికి తొశి NT(1)-21

పదాది అకారానికి హకారం చేర్చటం: హాశ్చర్యపడినారు NT(1)-27 NT(3)-27

**పద మధ్య వ్యస్తంగా అచ్చులు రాయటం :** కనఆనీయుదు OT(1)-16 , శారాఇ OT(1)-18, కఈను OT(1)-5 , బిఎరశెబిఆ OT(1)-528

**కారోచ్చారణను సూచించటానికి యావత్తు ను వాడటం :** న్యారము NT(1)-46

**పద మధ్య వర్ణ లోపం జరగటం :** ఇ గొ (ఇదిగొ) OT(1)-38

**న ను ణ గా రాయటం :** ఎఫరొణుదు OT(1)-30 , కాణిక (కానుక) OT(1)-68

తెలుగు బైబిలు అనువాదాలలో కనిపిస్తున్న "పద మధ్య న,ణ లు: మూల ద్రావిడలి ణ కారం న కారంగా మారింది. ఈ మార్పు

క్రీ.శ. ఏడవ శతాబ్దిలో మొదలై తొమ్మిదవ శతాబ్ది నాటికి పూర్తయినట్లు తెలుస్తుంది. ........క్రీ.శ. తొమ్మిదవ శతాబ్ది నాటి శాసనంలో 'తన' శబ్దానికి బదులుగా 'తణ' (S11 10.639.11.825) అనే విలోమ లేఖనం కనిపిస్తుంది. ప్రాచీన ణ కారం లేఖనంలో క్రీ.శ. పదకొండో శతాబ్ది దాకా అక్కడక్కడ కనిపించినా (కొణం, పై. 647.30, 1097) ధ్వని పరిణామం తొమ్మిదో శతాబ్దికే పూర్తయిందనాలి". రాధాకృష్ణ 1989: 58-59).

అయితే 1821వ సంవత్సరంలో అచ్చయిన తెలుగు బైబిలు (పాతనిబంధన) లో ఈ విలోమ లేఖన పద్ధతి కనిపిస్తుంది.

**ణ ను న గా రాయటం :** నా మొగున్ని OT(1)-43

**పదమధ్య అచ్చు లోపం** (Syncope) : చేస్తినని OT(1)-26, రక్షిస్తిని OT(2)-73, వస్తివా OT(3)-43, వెరిస్తిని OT(1)-4

ఒక పదంలో మధ్య అచ్చు ఉచ్చారణా వేగం వల్లగానీ లోపించటాన్ని పదమధ్య అచ్చులోపం అంటారు. ఇది శాసన కాలం నుండి వస్తున్నది. "పూర్వయుగంలో కనిపించిన ఇస్తిమి. సమర్పిస్తిమి. చేస్తిమి వంటి రూపాలు ఈ యుగంలో స్థిరపడ్డాయి.

**ఫ కారాది పదం :** ఫరో OT(2)-60, పరో OT(3)-60 ఫ కారాది పదం అన్యదేశ్య నామ వాచకాలలో కనిపిస్తుంది.

**హకారం తెలుగు బైబిలు అనువాదాలలోనే అవ్య దేశ్యాల లో ఖ, హ లుగా కనిపిస్తుంది:** రిఖొబొతు OT(1)-13 రెహొబోతు OT(2)-13

**సంయుక్త వర్ణాలమధ్య అచ్చు రావటం :** అమరాఫెలుడు (<అమ్రఫెల్) OT(1)-18 అమ్రఫేల్) OT(1)-18 , అరెరెఖకు (<అర్యోక్) OT(1)-18

ఈ పద విశేషం మనకు శాసనాలలో కూడా కనిపిస్తుంది. "సంయుక్త వర్ణాలలో రెండో వర్ణం య కారం ఉంటే ఇ కారమున్నూ, తక్కినచోట్ల ఉకారమున్నూ ఈ యుగపు శాసనాలలో కనిపిస్తుంది. "య" కారం ముందు పరియంతము (S11 10:340.12.1253 : (పర్యంతము), సందియ (<సంధ్య) (పై. 5.192.2.1228) మొ.వి" (కందప్ప శెట్టి 1989: 112).

**వర్ణ విశేషాలు :** తెలుగు బైబిలు అనువాదాలలోని వర్ణ విశేషాలలో కొన్నింటి వివరణ :

**సంధ్యక్షరాలు :** ఐ ఔ అనే సంధ్యక్షరాలు తెలుగు బైబిలు అనువాదాలలో వాడబడినప్పటికీ వాటికి అయి అవు లతో పర్యాయ కనిపిస్తుంది.

**అయిశ్వర్యము** NT (3)-19, వ కటి ఐయెటట్టు OT (1), ఔచానున్న OT (1) -21 యేలాటి వాడవునో NT (5) -4

**హల్వర్ణ వ్యాప్తి :** తెలుగు బైబిలు అనువాదాలలో దేశ్య తద్భవ అన్యదేశ్య పదాలలోని హల్వర్ణ వ్యాప్తి ఈ విధంగా ఉంది. అ) హల్లులున్నీ అచ్చులమధ్య వస్తాయి. ఆ) పదాదిన ణ ళ తప్ప మిగిలిన హల్లులన్ని వస్తాయి. ఇ) వ్యక్తుల స్థలాలపేర్లలో మాత్రమే పదాంతంలో హల్వర్ణాలు వస్తాయి. లోత్ (వ్యక్తి నామం) OT (8) -17 , రహోబోతు నగర్ OT (8) -13, ఈ) అనుస్వారం

ఆయా వర్గాలకు చెందిన స్పర్శవర్ణాలకు ముందు వచ్చే అనునాసికాలు అదే వర్గానికి చెందినవి అయి ఉంటాయి. కనుక వీటిని ప్రత్యేక వర్ణాలుగా గ్రహించనక్కరలేదు. ఇవి ఒకే అనునాసికవర్ణానికి సవర్ణాలు మాత్రమే. లేఖన సంప్రదాయంలో కూడా వీటిని ప్రత్యేక లిపి సంకేతాలుగా కాక ఒకే ఒక సాముదాయిక సంకేతంతో సూచించటం జరిగింది. ఆ సంకేతానే అనుస్వారం లేక సున్న అని వ్యవహరిస్తారు. బైబిలు అనువాదాలలో ఇదే సంప్రదాయం పాటించబడింది. ఉ) శకటరేఫ . సాధురేఫకూ శకటరేఫకూ ఉచ్చారణలో భేదం లేకపోయినప్పటికీ, ప్రాచీన లేఖన పద్ధతిని అనుసరించి అందఱు OT (12) -11 , వెఱ్ఱి NT (6) -30 తెలుగు పదాలలోనూ, ఈ కింది ఒకేఒక అన్యదేశ్యంలోనూ శకటరేఫ వాడబడింది. గొమొఱ్ఱా OT (9) -25 గొమొఱ్రా OT (2) -25 ఊ) హ వర్ణం. 1) పదాదిన "హ" వర్ణం తెలుగు భాషలో రాదు. ఇది కన్నడ భాషకు సహజం తెలుగు బైబిలు అనువాదాలలో "హ" వర్ణం రెండు చోట్ల మాత్రమే పదాదిన కనిపిస్తుంది: హాశ్చర్య పడినారు NT (1) - 27

**2) అన్య దేశ్య నామవాచికంలో పదాదిన హ వర్ణం కనిపిస్తుంది** : హాగరు OT (3) -20 **3) అన్య దేశ్య నామవాచికంలో పదాంతంలో హ వర్ణం కనిపిస్తుంది :** అహొలీ బామాహ OT (1) -20 అన్య దేశ్య నామవాచికంలో పదాంతంలో హవర్ణం కనిపించని రూపాలు కూడా ఉన్నాయి:

ఒహొలీబామా OT (3) -53 పదాది సంయుక్త వర్ణాలు : పదాదిని క్ త్ ప్ బ్ వ్ లతో రేఫకు సంయుక్తత కనిపిస్తుంది : క్రింద OT (10)-42 త్రాగు NT(19)-40 ప్రొద్దెక్కినప్పుడు NT(4)-14 బ్రతికించారు OT(10)-73 వ్రాయబడిన NT(3)-40

**భాషాగత భేదాలు - వర్ణగత భేదాలు**

చారిత్రక కారణాల వల్ల - అంటే కాలక్రమేణా వచ్చే ఉచ్చారణ భేదాలవల్ల, ఇతరభాషల ప్రభావం వల్ల భాషలోని వర్ణాలలో మార్పులు సంభవిస్తాయి. ఇతర భాషల ప్రభావం రెండు విధాలుగా ఉండవచ్చు. అ) వ్యవహర్తలు ఇతర భాషలలో విద్యావంతులు కావటం, ఆ) ఇతరభాషావ్యవహర్తలలో సహవాస సంబంధాలు. తెలుగు బైబిలు అనువాదాలలోని వర్ణపద్ధతిలో చోటుచేసుకున్న మార్పులను కొన్నింటిని ఈ కింద ప్రదర్శించటం జరిగింది.

**హ్రస్వదీర్ఘాచ్చుల పర్యాయత (హ్రస్వాచ్చులకు బదులు దీర్ఘాచ్చులు రాయటం) అ/ఆ పదాది: ఆమ్ముతూనున్న**NT(1)-40

ఆలక్ష్యము NT(1)-25 **ఇ/ఈ పదాది :** నీబద్ధి కలవారిని NT(2)-13 ఇ/ఈ పదాంతం: తిరిగీ NT(3)-43

**ఉ/ఊ పదాది:** గూరించ్చి NT(1)-17.అచ్చుల గుణాల ఆధారంగా జరిగిన రూపాంతరత: అ/ఇ పదాది ప్రీతి దినమందున్ను NT(2)-38

**అ/ఇ పదమధ్య :** అడివి OT(2)-28 , మూగిది NT(1)-27 **అ/ఇ పదాంతం :** ఆడి OT(1)-44, పైని OT(2)-19

**ఆ/ఒ పదాది :** వొంటిని NT(2)-28 , వొస్తాడు NT(2)-31 **ఈ/ఇ పదాది:** ని ఇంటికి NT(2)-18 , నివు OT(1)-5

**ఈ/ఇ పదమధ్య:** కన్నిళ్ళచేత NT(2)-18 **ఈ/ఇ పదాంతం :** ఒనాతండ్రి OT(1)-39

**ఉ/ఇ పదమధ్య:** కూచిండెను OT(1)-22 , వెకటిఐయెటట్టు OT(1)-42 **ఉ/ఒ పదాది:** కొమారుడు NT(1)-31

**ఉ/ఒ పదమధ్య:** కొట్టుకొపొచుంది NT(2)-49, **ఎ/అ పదాది:** చంతకు NT(2)-16 ఏ/అ పదాది: చాయకండ్డి NT(1)-8

**ఏ/ఆ పదమధ్య :** భోంచాయబొయ్యేది NT(1)-39 **ఏ/ఈ పదాది:** నీనంత OT(1)-16 **ఏ/ఎ పదమధ్య:** అపెక్షను NT(1)-51

**ఏ/ఎ పదాంతం :** అప్పుడె NT(2)-39 నడిచె OT(1)-2 **ఏఏ/ఎఎ పదాది:** చెసెటందుకొరకు NT(2)-12 **ఏ–ఏ/ఎ–ఎ పదాది:**

చెశినదెమంట్టె NT(1)-41 **ఒ/అ పదమధ్య :** దిశిమల OT(1)-4 **ఓ/ఒ పదాది:** ఒ కొడుకా NT(2)-37 **ఓ/ఒ పదమధ్య:**

నీతొడుపుట్టిన OT(1)-72 **ఓ/ఒ పదాంతం:** వించాడొ NT(2)-25 అచ్చులకుబదులు హల్సమేతమైన అచ్చును రాయటం

**ఇ/యి పదాది:** యిద్దరు OT(2)-24 ఈ/యీ పదాది: యీ జీవము NT(2)-19 **ఉ/వు పదాది:** వుపాది NT(3)-15

**ఊ/వూ పదాది:** వూరికి NT(4)-10 ఏ/యే పదాది : యేకపుత్రవిషయమై NT(3)-23 **ఒ/వ పదాది :** వకడు NT(1)-35

**హల్లులలో మార్పులు (ఒకహల్లుకు బదులు మరొక హల్లు) : క/ఖ పదమధ్య** వఖటికి NT(3)-43 వఖడు NT(3)-38

**గ/ఘ పదమధ్య :** ఆరొఘంట్ట NT(1)-55 **చ/ఛ పదాది :** ఛెడ్డదైతే NT(3)-28 **ద/ధ పదమధ్య:** ఫంధెండుNT(3)-43

**ణ్ణి/న్ని పదాంతం:** కుమారుణ్ని NT(3)-43 మూగివాణ్ని NT(3)-27 న/ణ పదమధ్య: కాణిక OT(1)-66

**ప/ఫ పదాది:** ఫంధెండు NT(3)-43 **స/శ పదాంత:** తోలివేశి NT(3)-2

**సంధి విశేషాలు :** తెలుగు బైబిలు అనువాదాలలో సంధి కార్యం జరగని రూపాలు కూడా ఉన్నాయి. ఇవి ముఖ్యంగా తొలిదశలో వచ్చిన అనువాదాలలో కనిపిస్తున్నాయి. ఉదా : చెప్పకలడు NT(2)-39 తీసుకొపదకలడు NT(2)-30 తెలియపడి వుండ్డెను NT(3)-6

**పదాలు – పదబంధాలు : కృతక ప్రామాణిక రూపాలు వాడటం :** ఘూలి చాత NT(1)-17 ఛెడ్డదైతె NT(3)-28 పంధెండ్డు NT(1)-42

ఫండెండు NT(3)-14 భాగా NT(3)-18 హలంత పదాలు వాడటం: ఇస్రాయేల్ OT(1)-74 ఈజిప్ట్ OT(8)-64 ఏర్ OT(8)-57

తిదాల్ OT(8)-18 ఫీకోల్ OT(8)-28 రహొబోతునగర్ OT(8)-13 శాబత్ NT(11)-10

**ఈ హలంత పదాలు తెలుగు బైబిలు అనువాదాలలో ఎక్కువగా అన్యదేశ్య వ్యక్తి, స్థల దేశ్య నామాలలో కనిపిస్తాయి.**

**కొన్ని ప్రాచీన ప్రయోగాలు – వాటి రూపాంతరాలు :** కండ్లు NT(1)-75 కన్నులు OT(3)-75 కళ్ళు NT(8)-75

కూతుండ్లు OT(1)-24 కుమార్తె లు OT(2)-24 పండ్లు OT(1)-75 పంళ్లు OT(3)-75 పళ్లు OT(4)-75

వాండ్లు OT(1)-35 వారు OT(3)-35 వాళ్ళు OT(8)-35

**కొన్ని పదాలను ప్రత్యేకమైన అర్థాలలో వాడటం:** బొబ్బపెట్టిన (కేకలు పెట్టిన) NT(3)-23 మిధ్యాప వాదము(అన్యాయం) NT(2)-43

రాగాలు పెదుతు (కేకలు పెడుతూ) NT(2)-12. అరుదైన పదాలను ప్రయోగించటం : తొన్ను(కుష్టు) NT(2)-12

ముచ్చెనున్ను (చెప్పులు) NT(2)-51 **అ) అనువాదానికి అవసరమైనది పారిభాషిక పదాలు** : పస్కా NT(18)-50

మనుష్యకొమారుదు NT(19)-31 **ఆ) లక్ష్య భాషలో అనువాదకుల అవగాహనకు సంబంధించినవి:**

మిధ్యాపవాదం NT(18)-50 (అన్యాయం అనే అర్థంలో ప్రయోగించారు), బందుకట్టు OT(1)-28

బందుకట్టు అనే పదబంధం 'ఒట్టు'/ 'ప్రమాణం' అనే అర్థంలో వాడారు. కాని తెలుగు నిఘంటువులలో ఈ అర్థం మృగ్యం. వ్రతమనుష్యుడు OT(1)-67 ఇది 'పనివాడు' అనే అర్థంలో వాడబడింది. వ్రతం అనే పదానికి నోము అనేది ప్రసిద్ధమైన అర్థం. ఇది ఈ అర్థంలోనే జన వ్యవహారంలో వాడుకలో ఉంది. కాని ఈ పదానికి 'పని' 'కార్యం' అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఇంకా

తెలుగు బైబిలు అనువాదాలలో చారిత్రక భాషాంశాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ఈ వ్యాసంలో ప్రస్తావించటం జరిగింది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

అనంతరామశాస్త్రి, నేతి. 1982. శ్రీనాథ భాషా పరిశీలన. గుంటూరు: అరుణ పబ్లికేషన్స్.

ఆరుద్ర. 1990. సమగ్రాంధ్ర సాహిత్యం. తొమ్మిదవ సంపుటం. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.

కందప్పచెట్టి. ఎమ్. 1982. 'శాసనభాషా పరిణామం'. కృష్ణమూర్తి 1979లో పుటలు 103-172.

కృపాచారి, గుజ్జర్లమూడి. 1988. తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ. గుంటూరు: రచయిత.

కృష్ణమూర్తి, భద్రిరాజు (సం.) 1979. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ.

గోపాల కృష్ణయ్య, వడ్లమూడి. 1955. ధ్వని – లిపి పరిణామం. విజయవాడ: ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు.

చిన్నయ సూరి, పరవస్తు. బాలవ్యాకరణము.

జాన్‌రత్నము, బి. 1963. బైబిలు గ్రంథచరిత్ర. గుంటూరు: క్రైస్తవ మత విద్యా వ్మాయ బోర్డు. ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘం.

జోగి సోమయాజి, గంట. 1947. ఆంధ్ర భాషావికాసము. వాల్తేరు: మద్రాసు: ది క్రిష్టియన్ లిటరేచర్ సొసైటి ఫర్ ఇండియా.

జోసయా రామాంజులు, ఎం. 1952. బైబిల్ దొరికిన విధము. మద్రాసు: ది క్రిష్టియన్ లిటరేచర్ సొసైటీ ఫర్ ఇండియా.

దొణప్ప, తూమాటి. 1972. భాషాచారిత్రక వ్యాసావళి. హైదరాబాదు: అభినందన సమితి.

నారాయణరావు, చిలుకూరి. 1937. ఆంధ్ర భాషా చరిత్రము. వాల్తేరు: ఆంధ్ర విశ్వకలాపరిషత్.

పెద్దన, విన్నకోట. కావ్యాలంకార చూడామణి.

రంగనాథాచార్యులు, కె.కె. 1979. 'శాసనభాషా పరిణామం'. కృష్ణమూర్తి 1979లో. పుటలో 173-205.

రాధాకృష్ణ, బూదరాజు. 1979 ప్రాచీనాంధ్రం: 'శాసనభాషా పరిణామం'. కృష్ణమూర్తి 1979లో. పుటలు 52%-- 102.

రామచంద్ర, తిరుమల. 1990. మన లిపి పూర్వోత్తరాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

రామనరసింహం, పరిమి. 1977. 'మైసూరు తెలుగు'. అనంతరాగం. (సం.) ఆర్వీయస్. సుందరం, ఘట్టమరాజు

అశ్వత్థనారాయణ, శివలెంక శ్రీరామచంద్రమూర్తి. బెంగుళూరు: రాళ్ళపల్లి అభినందన సమితి.

రామారావు, చేకూరి. 1975 తెలుగు వాక్యం. హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ.

విద్యానాథుడు. ప్రతాపరుద్రీయము.

వీరభద్ర రావు, కొత్తపల్లి. 1963 సి.పి. బ్రౌన్. హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ.

శశికళ, పి. 1986 నాచనసోముని ఉత్తరహరివంశము – భాషానుశీలనము. (పి.ఎచ్.డి. సిద్ధాంత గ్రంథం, అముద్రితం) మద్రాసు

విశ్వవిద్యాలయం, మద్రాసు.

శ్రీహరి, రవ్వా. 1995 వాడుక తెలుగులో అపప్రయోగాలు. హైదరాబాదు: వరరుచి పబ్లికేషన్స్.

హనుమచ్ఛాస్త్రి, జానమద్ది, 1992. సి.పి. బ్రౌను చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడెమి.

**References :**

Barber, Charles. 1975. The Story of English Language. London: ELBS and PAN Books.

Baugh, Albert C. and Cable, Thomas. 1983. The History of English Language. London: Roulted and Kegan Paul.

Catford, J.C. 1965. A Linguistic Theory of Translation. London: Oxford University Press.

Clerk, John Williams. 1970. Early English: A Study of Old and Middle English. London: Tombridge Printers.

Crystal, David. 1987. The Cambridge Encyclopedia of Language. Cambridge: Cambridge University Press.

Historical Catalogue of Printed Christian Scriptures in the Languages of Indian sub-Continent. London.

****

# అయిలన్నకు అభినందనలు



అతడొక నిర్విరామ సాహితీ శ్రామికుడు
నిరంతర అధ్యయన సంపన్నుడు
అంచెలంచెలుగా ఎదుగుతున్న నిరాడంబరుడు
ఎదిగేకొద్దీ ఒదిగి ఉంటున్న నిగర్వి
నిజాయితీ ఆయన వ్యక్తిత్వం
నిబద్ధత ఆయన స్వభావం
పరిచయమైన ప్రతి ఒక్కరినీ
ఆత్మీయంగా పలుకరించే స్నేహశీలత
చిరునవ్వుతో అక్కున చేర్చుకునే ఆప్యాయత
విద్యార్థుల పాలిటి విజ్ఞాన కల్పవృక్షం
పరిశోధకులకు చక్కని పర్యవేక్షక పథ నిర్దేశం
సహచరుల మన్ననలు పొందుతున్న ఉత్తమ అధ్యాపకత్వం
తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో క్రియాశీల కార్యకర్త
సృజనాత్మక సాహిత్యంలో చురుకైన కావ్యకర్త
అంబేద్కర్‌ను అధ్యయనం చేస్తున్నాడు
మార్క్స్‌ఏంగెల్స్‌ను అవగాహన చేసుకుంటున్నాడు
గురజాడను అభిమానిస్తున్నాడు
శ్రీశ్రీని మననం చేస్తుంటాడు
జాషువాను ఔపోసన పట్టాడు
కుందుర్తిని ఆవాహన చేసుకున్నాడు
కాళోజీని ఆదరిస్తున్నాడు
దాశరథి సోదరులను గౌరవిస్తున్నాడు
అభ్యుదయ విప్లవ సాహిత్యాల సైనికుడు
దళిత సాహితీక్షేత్రంలో నిత్య కృషీవలుడు
బోధన, పరిశోధనల ఘనాపాటి
కవిత్వం, విమర్శ రంగాలలో సవ్యసాచి
తెలుగు శాఖాధ్యక్షుడిగా, డీన్‌గా, ప్రధానాచార్యుడిగా
బహుముఖీనమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న పరిపాలనా దక్షుడు
జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యాల
సముచిత సమన్వయ సాధకుడు
పదేళ్ళు పెద్దవాడినయినా
అతడ్ని నేను 'అయిలన్నా!' అని సంబోధిస్తాను
అతడూ నన్ను నోరారా 'అన్నా!' అని పిలుస్తాడు
కల్మషం లేని సాహితీ అనుబంధానికి అభివందనాలు
ఉద్యోగ విరమణ సందర్భంగా శుభాభినందనలు
(2024 ఫిబ్రవరి 29న ఆచార్య బన్న అయిలయ్యగారి
ఉద్యోగ విరమణ సందర్భంగా)

**ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**
ఫోన్ : 961 803 2390



బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-
అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.

(ప్రపంచ పదులు
- డా. సి. నారాయణ రెడ్డి)

# ఆచార్య భూమయ్య గారి 'భౌమ మార్గ విమర్శ'

**అరుణ ధూళిపాళ,** ఫోన్ : 87123 42323

(గత సంచిక తరువాతి భాగం)

**4. తెలంగాణా భావ విపంచిక – గోలకొండ కవుల సంచిక:**

**"నిజాం రాష్ట్రంలో ఆంధ్రకవులు పూజ్యము"** అని ముడుంబై రాఘవాచార్యులు ఒక వ్యాసంలో ప్రస్తావించిన విషయాన్ని జీర్ణించుకోలేక అది అబద్ధమని నిరూపించడానికి సురవరం ప్రతాపరెడ్డి గారు చేసిన కృషి అనితరసాధ్యం. దాంట్లో ఆయన సఫలీకృతులై అవమానించిన వారిని మారు మాట్లాడకుండా చేశారు. ఎంతగానో శ్రమించి 354 మంది కవుల కవిత్వాలను వారి వివరాలతో సహా 1934లో గోలకొండ కవుల సంచిక ప్రకటించారు. తిరిగి 66 సంవత్సరాల తర్వాత దాన్ని ఈ తరం వారికి పరిచయం చేయడానికి భూమయ్యగారు చేసిన ప్రయత్నం బహుధా ప్రశంసనీయం.

1300 ఫసలీ నుండి ఉండే కవులను ఆధునికులుగా నిర్ణయించి, కవులు, వారి జన్మస్థలము, కులము, గ్రామము, తాలూకా, జిల్లా, రచనలు, ముద్రితాలు, అముద్రితాలు, ఫోటోలు పంపుమని నియమాలను ఏర్పరచి వాటిని సేకరించారు ప్రతాపరెడ్డిగారు.

ఆ వివరాలను తెలుపుతున్న భూమయ్యగారు విద్యార్థి చేత **"354 మంది కవులు పంపిన కవితల్ని వచ్చినవి వచ్చినట్టుగానే అచ్చు వేసినారా సార్?"** అని అడిగిస్తారు. ఆయనే విద్యార్థి అని మనకు తెలిసిందే. ఇందులో చమత్కారం ఏంటంటే చదువుతున్న వారికి ఆ సందేహం వస్తుందని ముందుగానే ఊహించడమన్నమాట. ఆ ప్రమాదం కలుగకుండా ముందే ప్రశ్న వేయించుకుని సమాధానం చెప్పినట్టు వివరించడం వల్ల పాఠకులకు విషయాన్ని సులభంగా అవగాహన చేయించడమే. అందుకే ఆయన తమ రచనలో ప్రత్యేకతను సాధించారు. మన్ననలందు కున్నారు. విద్యార్థి ప్రశ్నకు సమాధానంగా –

**"ఒక పద్ధతంటూ లేకపోతే ఎట్లా? ఆ వచ్చిన కవితల్ని విషయాన్ని బట్టి పదకొండు విభాగాలు చేసినారు"** అని చెప్పి ఆ జాబితాను వివరంగా అర్థం చేయిస్తారు. ఈ ఒక్కటి చాలు సురవరం ప్రతాపరెడ్డి గారు సముద్రపు లోతుల్లోకి దిగి ముత్యాలను సేకరించినట్టు ఎంత సాహసం చేశారో? ప్రజల ముందు పరిచిన తెలంగాణా కవుల కవిత్వ సామ్రాజ్యమిది. అందుకే ఇది ఎంతో విశిష్టతను సాధించి ఆయనను అగ్రగణ్యుని చేసింది.

భూమయ్య గారు దీనిలో ఉన్న విషయ వివరణను బట్టి సులువుగా అర్థం చేయించేందుకు ఏడు భాగాలు చేశారు. 1. ఆధునిక పద్య తరంగిణి 2. తెలంగాణా మహోజ్జ్వల చరిత్ర 3. ఉద్యమ చైతన్యం 4. భావ విపంచిక 5. మహిళా చైతన్యం 6. శతావధానులు: కవి సార్వభౌములు: జంటకవులు 7. దాంపత్య కథాలహరి.

**"ఆధునిక పద్య తరంగిణి"** అనే భాగంలో "ప్రస్తావన" ప్రతాపరెడ్డిగారు ప్రకటించిన కవుల జాబితా, నియమాల ననుసరించి సమయానికి చేరని కవులను చేర్చకపోవడం వల్ల కలిగిన అసౌకర్యానికి మన్నించుమని, అపోహలు కూడదని వినయాన్ని ప్రకటించడం, చివరగా ఇందులోని భాగాలను గూర్చి రాసిన సీసపద్యం ఉంటుంది.

**"తెలంగాణా మహోజ్జ్వల చరిత్ర"** లో సురవరం వారి ప్రకటనకు ఆనందోన్ముఖులై వివిధ కవులు పంపిన పద్యాలు, వారి రచనా వైదుష్యము చెప్పబడింది.

**"ఉద్యమ చైతన్యం"** అన్న విభాగంలో పూర్వకాలపు తెలంగాణా వైభవము, తెలంగాణా కవులనే కాక ఇతర రాష్ట్ర కవుల గొప్పదనాన్ని ప్రశంసించి జాతీయతను చాటుకోవడం,



బ్రాహ్మణుల అప్పటి ఇప్పటి స్థితి గతులు, రైతులు, దళితులు, బాల వితంతువులు, మూఢ నమ్మకాలు వీటన్నిటిపైన కవుల రచనలు కనిపిస్తాయి.

**"భావ విపంచిక"** విభాగంలో ప్రణయము, ప్రకృతి,స్మృతి, భక్తి, దేశభక్తి వంటి విషయాలకు సంబంధించిన కవిత్వం ఉంటుంది.

**"మహిళా చైతన్యం"** అనే భాగంలో పదిమంది కవయిత్రుల రచనలు, వారి వివరాలు, వారు రచించిన స్తోత్రాలు, కవితా వైభవం చెప్పబడ్డాయి.

**"శతావధానులు, కవి సార్వభౌములు, జంట కవులు"** అనే ఈ ఆరవ భాగంలో ఆనాటికే తెలంగాణాలో ఎంత మంది మహనీయులు అస్వతంత్రపు బంధనాల్లో తెర మరుగున ఉండి పోయారో, వారి కలాల నుండి ఆవిష్కృతమైన రచనలు వెలికి రాకుండా గుప్తంగా ఉండిపోయాయో అర్థమవుతుంది.

**"దాంపత్య కథాలహరి"** అన్న చివరి భాగంలో కొన్ని కథలు ఇవ్వబడ్డాయి. అందులో కొన్ని శ్లోకాలతో ప్రారంభ మయ్యాయి. కొన్ని చంపూ పద్ధతిలో, కొన్ని నిర్వచనంగా, కొన్ని గీతమాలికలుగా కనిపిస్తాయి.

"నివురు గప్పిన నిప్పువలె నున్న ఇచ్చటి యాంధ్ర కవుల ప్రజ్ఞా పాండితీ విభవములను

ప్రచారము చేయుటయు, బయటి వారికీ విషయమున గల భ్రమను నివారించుటయు, పరమ కర్తవ్యముగా భావించి **"గోలకొండ కవుల సంచిక"** యను నామకరణముతో పుస్తకరూపమున ప్రత్యేక సంపుటముగా వెలువరుచుటకు నిశ్చయించుకొన్నారము" అని చెప్పడంలో సురవరం ప్రతాపరెడ్డిగారి ఉద్దేశ్యం సుస్పష్టం. దాన్ని నెరవేర్చుటకు ఆయన సలిపిన కృషి పుస్తక రూపంలో మనముందు నిరూపితమైంది. సహజంగా ఎవరి దృష్టికి అందని విషయాన్ని బయటకు తీసుకురావాలని ఆకాంక్షించే భూమయ్య గారు ఈ తరానికి అందించిన సరళమైన తెలంగాణా కవుల చరిత్ర ఇది.

**5. వేమన అనుభవ సారం :**

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు వారికి అందించిన ఆణిముత్యం వేమన. "మనవాడు" కానివాడు, "మనవాడి" గురించి తెలిపితే తప్ప 'మన' వేమన్నను తెలుసుకోలేని అజ్ఞానం "మనది". అవిప్పుడు తలచుకోవడం అనవసరమే అయినా వేమనను తలచుకున్న ప్రతీసారి బ్రౌన్ ను తలచుకోకుండా ఉండలేము. ఎందరో పరిశోధకాగ్రగణ్యులు వేమన పద్యాలను పరిశోధించి వేమన జీవితాన్ని తెలుగు వారికి అందించారు.

ఆచార్య భూమయ్యగారు రాసిన "వేమన అనుభవసారం" పేరులోనే ఈ కావ్యంలో వేమన అనుభవపూర్వకముగా రాసిన పద్య మధువును జుర్రుకోవడానికి పాఠకులను సంసిద్ధులను చేస్తున్నారని తేటతెల్లమవుతోంది. గురు శిష్య సంభాషణలో భాగంగా శిష్యుడు **"వేమనపై పిహెచ్ డి చేయాలనుంది"** అని తన కోరికను వ్యక్తం చేసినట్లుగా మొదలయిన కావ్యం,యోగ దిశగా సాగి తత్వాన్వేషణ చేయించి జీవిత తత్వాన్ని ఎరుకపరుస్తుంది. ఇందులో వేమన పద్య పాదాలను శీర్షికలుగా పెట్టి 15 విభాగాలుగా వేమన తాత్వికతను విపులతరం కావిస్తారు ఆచార్యులు.

వేమనను ఒక కవిగా కాకుండా యోగిగా చూడమంటారు భూమయ్యగారు. యోగులైన వారి తత్వం తెలియాలంటే యోగిగా మారాలి. అందుకోసం శిష్యునికి "ఒకయోగి ఆత్మకథ", "హిమాలయ యోగులు" వంటి పుస్తకాలు చదవమని చెప్తారు. యోగులందరూ ఒకే రకంగా ఉండరు. మనకున్న పరిమితమైన తెలివితోనో, పాండిత్యంతోనో వారిని అంచనా వేయడం సరికాదు. వారికున్న పరిధి చాలా విస్తృతమైనది. పంచేంద్రియాలకు, అరిషడ్వర్గాలకు అతీతులు. సూక్ష్మమైన అధ్యయనం అవసరం అని లోతైన రహస్యాన్ని విప్పి చెప్తారు. ఇలా శిష్యునికి వివరించడం వల్ల భూమయ్యగారు ఈ తత్వాన్ని గ్రహించి ఇటువంటి జ్ఞానసంపదనంతా తనలో నిక్షిప్తం చేసుకున్నారని వేరే చెప్పనవసరం లేదు.

**"గట్టు మీద నున్న కాన్పించు సర్వము/ తెలిసి తేటపడిన తెలియునెల్ల / లోక విషయములను లోని రహస్యముల్"** అన్నారు వేమన. గట్టు అంటే ఏదో పై స్థానము అని అర్థం కాదు. అది యోగస్థానము. యోగ సాధన చేయడం వల్ల యోగి అవుతారను కోవడం భ్రమ. యోగ సాధకుడు, యోగి వేరు వేరు. వేమన మాటల పరమార్థం అదే. ఆయన పద్యాలు అలా ఆత్మ దర్శనము నుండి వెలువడినవే. అందుకే ఆయన యోగి అయ్యారని వివరిస్తారు.

**"తనదు కర్మ చేత తాను లోకము లోన...."**
**"తనువు తనువటంచు తపియింత్రు జనులార...."**
**"కడగి వట్టి యాస కడ తేర నీయదు...."**
**"కాల ధర్మమెరిగి ..మేలుగాను శివుని మేల్కొని చూదరా"**

ఇటువంటి పాదాలన్నీ అశాశ్వతమైన దేహభ్రాంతిని వదిలి పరమాత్మను దర్శించే ఆత్మను తెలుసుకోమని సందేశమిస్తాయి. విషయ వాంఛా భోగలాలసుడుగా పరుగెత్తి, ఆ బంధనాల నుండి విముక్తుడై ఆత్మాన్వేషణలో తపించి సాక్షాత్కారం చేసుకున్న మహనీయుడు వేమన. ఆ అనుభవాలతో ప్రజలను ఉద్ధరింపబూనుకున్న పరమ పూజ్యుడు. ఆయన చెప్పిన ఆ సూత్రాన్ని వదలక పట్టుకోమని ఉద్బోధిస్తున్నారు భూమయ్య గారు.

"పరుల మోసపుచ్చి పర ధర్మ మార్జించి....."

"ధనము కూడ బెట్టి ధర్మంబు సేయక...."

మోసపుటాలోచనాలు మనిషిని దుష్టునిగా మారుస్తాయి. ధర్మవిదూరునిగా నిలబెడతాయి. అందుకే వాటి జోలికి వెళ్లక ధర్మమార్గాన నడువుమనే సందేశం వీటిల్లో కనిపిస్తుంది.

**"కులము ఘనము కాదు గుణమె ఘనమ్మురా"**
**"మతపు వేషధార్లు మహిమీద పదివేలు"**
**"అంతరంగమందు నపచారములు చేసి....."**
**"ఇతరులెరుగకున్న నీశ్వరుదెరుగడా..."**

మనిషికి ఉండవలసింది మానవత్వం. ఆ లక్షణం లేనివాడు మృగంతో సమానుడు. కులాన్ని బట్టి గుణం కాదు. గుణానికి కులంతో సంబంధం లేదు. కుల మతాలన్నీ మనిషి తన బలహీనతలకు, కోరికలకు కప్పుకుంటున్న ముసుగు. చేయవలసిన తప్పిదాలన్నీ చేసి మంచివాని లాగా నటించడం వల్ల ప్రయోజనం శూన్యం. ఇతరులు తెలుసుకోకున్నా కర్మసాక్షి భగవంతునికి తెలుసు కదా!

**"చేయబూను మనిషి చేతలన్నిటి జూడ**
**దైవమొండు గలడు ధరణి మీద".....**

అదే విధంగా "వినగ వలెను పెద్ద లనెడి వన్ని" అంటూ పెద్దవారు చెప్పిన మాటలు వినాలంటారు. అంటే ఆత్మను తెలుసుకున్న పెద్దలు చెప్పిన పద్ధతిని ఆచరించాలి. తత్వజ్ఞుడైన వేమన లాంటివారు ఏదో ప్రయోజనాన్ని ఆశించడం వల్లనో, కీర్తి ప్రతిష్ఠలకోసమో చెప్పరు. మాతృప్రేమతో మనను బాగుచేయడం కోసం కరుణ ఉప్పొంగి చెప్తారు. ఆచరించకపోవడం వల్ల నష్టం ఎవరికి? అని మనలను మనం ప్రశ్నించుకోవాలి.

**"చదువని వాడజ్ఞుండగు....చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ"** భాగవతంలో ప్రహ్లాదుని వివేకవంతుని చేయుటకు హిరణ్యకశిపుడు, చదవని వాడు అజ్ఞానంలో పడి ఉంటాడని అందుకే పెద్దల దగ్గరికి వెళ్లి చదువుకోమని నీతి బోధ చేసిన పోతన పద్యం. అలాగే వేమన కూడా చదువు యొక్క ప్రాముఖ్యతను తెలుపుతారు.

**"ఏమి చదివి ఏమి ఎరుక లేకుండిన......"**

**"ఎరుకమాలు చదువు లేటికో తెల్పరా.."** అని చెప్పిన వేమన వాక్కులను విశ్లేషిస్తూ... చదువ వలసింది పుస్తకాలు కాదని, హృదయ గ్రంథమని, హృదయంలోని ఆత్మను చదవడమే సరియైన చదువంటారు ఆచార్యులు. అంతేకాదు ముక్తిని పొందడానికి కావలసిన జ్ఞానమే అసలైన చదువు. చావు పుట్టుకల మర్మమెరిగినదే బ్రహ్మజ్ఞానం. దాన్ని సాధించమంటారు.

అలాంటి జ్ఞానం కలగాలంటే సరియైన గురువు లభించాలి.

**"ముక్తి దారి చూపు మూలము గురుడురా..."**

**"గురువు తానయినను హరుని తాజూపును...."**

**"విత్తనంబు గురువు విశ్వంబునకు నెల్ల..."**

ఆధ్యాత్మిక మార్గంలో సాధన చేయాలనుకునేవానికి సందేహాలు సంకెళ్లుగా మారుతాయి. ఆయా రహస్యాల ముడులను విప్పదీసి సందేహ నివృత్తి చేయగలిగేది గురువొక్కడే. అట్టి గురువును "అన్యథా శరణం నాస్తి" అంటూ శరణాగతి వేడాలి. అప్పుడే లోకాన్ని తెలుసుకోగలుగుతాడు. అని భూమయ్య గారు తమ అంతేవాసికి గురుముఖతః నేర్చుకునే విద్య వల్ల పరమానందం పొందుతావని వివరిస్తున్నారు.

**"ఉత్తమోత్తముండు తత్వజ్ఞుడిల మీద...."**
**"తన్ను తా దెలిసిన తానె పో బ్రహ్మము....."**
**"తనువు లోని ఆత్మ తత్త్వ మెఱుంగక...."**
**"ఆత్మలోని శివుని అనువుగా శోధించి....."**

ఇలా ఎన్నో విధాలుగా మనలో ఉన్న మనలను గ్రహించడమే కావలసిందని అనుభవపూర్వకంగా అభివ్యక్తీకరించారు వేమన. ఆ తత్వాన్నే తనదిగా చేసుకున్న భూమయ్య గారిని వేమన అందుకే ఆకర్షించాడు. వేమన పద్యంలో పదమో, వాక్యమో హృదయాన్ని కానీ, మెదడును కానీ కదిలించ గలిగితే ఎంతో ఆనందంగా భావిస్తానంటారు. ఆంతర్గతమైన ఆ 'నేను' లోనే జీవన సారమంతా ఇమిడి ఉంది.

ఈ కావ్యంలో చివరగా శిష్యునికి వేమన చెప్పిన అనుభవాలకు ఋషుల అనుభవాలతో సామ్యం తెలుపడానికి ఉపనిషద్వాక్యాలను ఉదాహరణలుగా చూపించారు భూమయ్య గారు. వీటిద్వారా ఆత్మనెరిగిన వారియొక్క భావం ఒక్కటే అని తెలుస్తుంది. ఆత్మబోధకుడు, తత్వజ్ఞాని అయిన వేమన ప్రజలకు మంచిమార్గాన్ని సూచించడానికి సరళ భాషలో పద్యరూపంలో నీతులను అందించాడు. ప్రజల నాడి ఎరిగినవాడు కాబట్టి ప్రజాకవి అయినాడు. భూమయ్య గారు పాఠకుల నాడి పట్టుకున్నవారు కనుకనే వెళ్లే మార్గంలో కంటకములను తొలగించి సులువైన త్రోవకు మార్గదర్శకులవుతారు.

**6. సౌందర్యలహరి- భావ మకరందం**

**"జీవుడే బ్రహ్మము, బ్రహ్మమే జీవుడు"** ఈ రెండింటికి తేడా లేదు. చుట్టూ కనిపించేదంతా మాయే. అవిద్య వల్ల మానవుడు ఆ మాయను తెలుసుకోలేక పోతున్నాడు. అని అద్వైత తత్వాన్ని బోధించిన శ్రీ శంకర భగవత్పాదులు సామాన్య జనుల జీవితాలకు




దిశానిర్దేశం చేసే ఎన్నో స్తోత్రాలు రచించారు. వాటిలో అత్యున్నతస్థానంలో ఉండేది సౌందర్య లహరి. ఇది స్తోత్రముగా కనిపిస్తున్నప్పటికీ మంత్ర, తంత్ర సిద్ధిని కలిగించునదై, ఛందోబద్ధమైన కావ్యంగా అక్షర రమ్యత కలిగి మహిమాన్వితమైన జగన్మాతను కట్టెదుట సాక్షాత్కరింపచేస్తుంది. మహా మహా పండితులెందరో ఇందలి విశేషాలను సవివరంగా రాశారు, రాస్తున్నారు.

అమిత కరుణామయి జగజ్జనని పట్ల అచంచల భక్తి తత్పరత కలిగిన వారు భూమయ్య గారు. ఆయన ఇంతకు మునుపే తమ హృదయ పేటిక నుండి **"వేయి నదుల వెలుగు", "వెలుగు నగల హంస"** అనే సువర్ణ కావ్యపుష్పాలను అమ్మవారి చరణకమలములకు సమర్పించు కున్నారు. శ్రీ శంకరుల "సౌందర్య లహరి"లో తన్మయులై ఆ భావ రాశిని సరళతరం చేయడానికి పూనుకున్నారు.

కేవలం భక్తి కాకుండా శంకరుల వారి కవితా పటుత్వాన్ని చెప్పడం ఇందులో ప్రధానమైన అంశం. తెలుగు సాహితీ ప్రియులకు ఆ కవితా సౌందర్యాన్ని విశదపరచడం కోసం భూమయ్యగారు ఈవిధంగా రాయడానికి పూనుకున్నారు. కవిత్వారాధకులు కాబట్టి శంకరాచార్యుల వారిని వేదాంతిగా కంటే కూడా

ప్రతిభావంతుడైన గొప్ప కవి అనే దృక్కోణంలో చూశారు. ప్రారంభంలోనే శిష్యునికి శంకరాచార్యుల సౌందర్యలహరిలోని కవితాశక్తి మీద దృష్టి పెట్టమని ప్రత్యేక సూచన చేస్తారు.

**"ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ......."** మన్మథుని పుష్పచాపానికున్న నారిని తుమ్మెదల వరుసగా, ఆయనకున్న రథాన్ని మలయమారుతంగా చెబుతూ అశరీరుడైన అనంగుడు ఈ స్థితిలో లోకాలను జయించడం అమ్మవారి కరుణ అంటారు. ఇందులోని శంకరుల కాల్పనికశక్తి అమోఘం.

మరోచోట **"కిరీటం వైరించం.....తవ పరిజనోక్తిర్విజయతే"** శంకరుడు తన దగ్గరికి వస్తున్నాడన్న చెలుల వార్తకు తొట్రుపాటుతో ఎదురేగడానికి బయలుదేరిన పార్వతీ దేవి వైభవాన్ని కంటి ముందు కన్పించే చిత్రంగా వర్ణిస్తారు శంకరులు. కావ్యం వర్ణనాత్మకం. అందుకే ఇందులో భక్తితో పాటు కావ్యగౌరవాన్ని కల్పించే శంకరుల వర్ణ వైచిత్రి అడుగడుగునా కనిపిస్తుంది.

ఆది గురువుల అపార కవితా వైదుష్యాన్ని, పదగుంభనాన్ని తెలుపుతూ సంభాషణాత్మక నాటకీయశైలితో హృదయాలను రంజింపచేయడానికి శంకరాచార్యుల కవితాపాటవానికి తమ ఆలోచనను, భక్తిని, సందర్భానుసారంగా ఇతర కావ్యముల అంశాలను సమన్వయిస్తూ ఆ ముగురమ్మల మూలపుటమ్మ తత్వాన్ని అందించే ప్రయత్నాన్ని తలకెత్తుకున్నారు.

**"శివశ్శక్త్యా యుక్తోయది భవతి........ కథ మకృత పుణ్యః ప్రభవతి"** సౌందర్యలహరిలోని ఈ మొదటి శ్లోకం లోనే పార్వతీదేవితో కూడి ఉన్నప్పుడే శివుడు సృష్టి కార్యం చేయగలుగుతాడని ఆమె మహిమ చెప్పబడింది. అందుకే హరిహర బ్రహ్మలు ఆమెను సేవిస్తారు.

ఎంతటి మహత్కార్యానికైనా ఆ అమ్మ అనుగ్రహం ఉండాలి. కాబట్టి **"నేనే కర్తను"** అనే అహంకారం వీడాలి. **"కర్త నేనను గర్వంపు కాల నాగు చేత కాటు బడితివేని చేటు వచ్చు"** నన్న పెద్దల మాటను ఉటంకిస్తూ ఈ శ్లోకంలో **"ప్రణంతుం, స్తోతుం"** అనే పదాలను గ్రహించి ఆ అమ్మవారిని స్తుతించి అనుగ్రహపాత్రులు కావాలంటారు భూమయ్యగారు.

**"సుధాసింధోర్మమధ్యే సురవిటపివాటీ పరివృతే......"**

ఈ శ్లోకంలో అమృతసింధువు మధ్యలో మణిద్వీపం, దానిచుట్టూ ఉన్న మరున్నగములు, చింతామణులతో కట్టబడిన భవనము మధ్యలో శివాకారంలో మంచె పైన శివుని పర్యంకంలో అమ్మవారు చిదానందలహరిగా మూర్తీభవించినట్లు శంకరులవారు వర్ణించారు.

**"రవి గాంచని చోట కవి గాంచును"** అన్నట్టు ఎక్కడో అమృతసాగరంలో ఉన్న అమ్మవారిని ఊహల్లో వెతుక్కుంటూ కేంద్రబిందువుగా ఉన్న అమ్మవారిని దర్శించడానికి ఆమె చుట్టూ అత్యద్భుత సౌందర్య రాశిని ప్రోది చేశారు. ఆయన కవి హృదయం ఆ సౌందర్యాన్ని అంతర్గత వీక్షణం చేసింది.

ఇది చూడగానే భూమయ్యగారి మనసు ఒక్కసారి వైకుంఠపురాన్ని దర్శించింది. "అల వైకుంఠ పురంబులో నగరిలో ఆ మూలసౌధంబు దాపల.....విహ్వల నాగేంద్రము పాహి పాహి యన కుయ్యాలించి సంరంభియై" అని పోతన శ్రీ మహాలక్ష్మిని, మహావిష్ణువును కనులారా గాంచి తరించిన పద్యాన్ని గుర్తుచేస్తారు. ఏక కాలంలో పార్వతీ పరమేశ్వరుల, లక్ష్మీ శ్రీహరుల రూపాలను మన మనస్సుల్లో ముద్రిస్తారు.

**"శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జాటాజూట మకుటాం..."**

**"కవీంద్రాణాం చేతః కమలవన బాలాతప రుచిం..."** అమ్మవారిని సేవించినంతనే కవితాశక్తి కాంతిపుంజమై కవిని చేరుతుంది. మంచిపటుత్వం కలిగిన, గంభీరమైన శృంగార రసభావ పూర్ణమైన కవితలను సహృదయ రంజకంగా, రసజ్ఞులను ఆనందంలో ముంచే కవిత్వం రాయగలుగుతాడు. నిజమే! శ్రీ శంకరుల వారి నుండి అద్భుత భావగాంభీర్యమై, అంతస్సూత్రమై, అనంత జ్ఞాన వాహినియై వెలువడిన రచనలన్నిటికీ ఆమె కరుణానిధి దొరకడమే కారణం కదా! అదేవిధంగా భూమయ్య గారి మదిలో మురిసి మెరిసిన వెలుగులే ఈ అక్షర ధవళకాంతులు. ఇది రాయడానికి ప్రేరణ ఆ జగన్మాత కరుణా కటాక్షమే.

**"శివః శక్తిః కామః క్షితి రథ రవిశ్శీత కిరణః ......'** ఈ శ్లోకంలో పదిహేను అక్షరాలు గల మంత్రం పంచదశాక్షరి గురించి చెప్పబడింది. అదే శ్రీవిద్యగా ప్రసిద్ధి పొందిన తంత్ర విద్య.

మనకు అదృష్టవశాత్తు ఒక గురువు తనంత తానుగా మంత్రోపదేశం చేయవచ్చు. అప్పుడే మనకు దాన్ని సిద్ధి చేసుకోగలం. శిష్యుడు సరియైన గురువును గుర్తించలేడు. ఆ శక్తి, అర్హత శిష్యునికి ఉండవు. సరియైన శిష్యుని వెతుక్కుంటూ గురువే వస్తాడు. అలాగే భగవంతుడు భక్తుని ఆర్తికి కరిగి భక్తుని చెంతకు వచ్చి చేరదీస్తాడు ఆ భక్త సులభుడు. మరి దానికి మనం చేయవలసింది ప్రార్థించడం, శరణాగతి వేడడమేనని భగవంతుని చేరే ఉపాయాన్ని భూమయ్యగారు వివరిస్తారు.

**"పురారాతే రంతః పురమసి...........అణి మాద్యాభి రమరాః"** అమ్మవారి మహత్తును తెలిపే మరో గొప్ప శ్లోకమిది. ఆ పరమేశ్వరి పాదసేవ లభించడం దుర్లభం. ఇంద్రాది దేవతలకే అది సిద్ధించక ఆ జగన్మాత భవన ద్వారం దగ్గర ఉన్నటువంటి అణిమాది అష్ట సిద్ధులను పొంది సంతృప్తి పడుతున్నారట.

భూమయ్యగారు శిష్యునికి ఈశ్లోకంలోని అమ్మవారి అఖండ మహిమను వర్ణిస్తూ....ఇంద్రాదులకే ఆమె చరణసేవ లభించనప్పుడు మనమెంత? కాబట్టి చెరగని భక్తితో నిరంతర సాధన చేయాలి. అత్యంత శ్రద్ధ ఉండాలి. భక్తిభావం రెట్టింపు అవుతూ ఉండాలి. నమ్మకం సడలకూడదు. సాధన మాత్రమే మనవంతు. ఫలితాన్నిచ్చేది ఆ జగన్మాతయే. "కర్మణ్యేవాధికారస్తే, మా ఫలేషు కదాచన" అని భగవద్గీత బోధను ఉదాహరిస్తారు. సాధన చేయడంలోనే ఆనందాన్ని,

తృప్తిని పొందితే ఫలితం మీద దృష్టి ఉండదనే ఉపదేశాన్నిస్తారు. అమ్మవారి నిరంతర స్మరణతో తన్మయులయ్యే ఆచార్యులవారి భక్తి ప్రపత్తులు ఇక్కడ వెల్లడి అవుతాయి.

**"కదా కాలే మాతః కథయ కలితాలక్తకరసం...........**

**వాణీ ముఖ కమల తాంబూలరసతామ్"**

"తల్లీ! లాక్షారసం కలిగిన నీ పాద జలాలను నేనెప్పుడు తాగగలను? నీ పాదజలం సరస్వతీ ముఖం నుండి వెల్వడు తాంబూలరసమై నన్ను చేరుతుంది? అని శంకరులు ప్రశ్నల రూపంగా వేడుకుంటున్నారు. ఆమె పాదోదకం కవితా రచనకు మూలమని ఆయన గ్రహించారు. ఆ వరాన్ని, శక్తిని, అమ్మ అనుగ్రహాన్ని పొందాలని దానికోసమై వేడుకోవాలని మనకు సూచిస్తారు ఆచార్యులు.

చిన్నతనం నుండీ లోకాతీత జ్ఞానాన్ని పొంది అద్వైతాన్ని గ్రహించ గలిగిన శంకరులే ఆ విధంగా కవిత్వ శక్తినివ్వమని ముల్లోకాధిదేవతను ప్రార్థిస్తే ఇంద్రియాశ్వములతో పరుగులు తీస్తూ కాలాన్ని వృధా చేస్తున్న మనం చేయాల్సినది ఎంత ఉండాలని ప్రశ్నించుకొని ముందుకు సాగాలంటారు భూమయ్యగారు.

**"ప్రదీపజ్వాలాభి ర్దివస కరనీరాజన విధిః...... జనని వాచాం స్తుతి రియమ్"** ఆది శంకరాచార్యులవారికి జగన్మాత పట్ల ఉన్న అపార వినయపూర్వక భక్తికి ఈ శ్లోకం తార్కాణం.

అమృతాంబుధిలో ఓలలాడించే సౌందర్యలహరిని విరచించి కూడా **"అమ్మా! నేను చేసిన స్తుతి దీపజ్వాలలతో సూర్యునికి నీరాజనం ఇచ్చినట్లు, చంద్ర కాంత శిలలతో చంద్రునికి అర్ఘ్యమిచ్చి నట్లు, సముద్ర జలాలతో సముద్రునికే తర్పణమిచ్చినట్లున్నది. ఇదంతా నీ అనుగ్రహమే"** అంటారు. అంటే ఈ కవిత్వ శక్తి ఆమె ఇచ్చినదే. దానితోనే ఆమెకు అక్షర నీరాజనం చేశానంటారు.

మాతృభావనతో అమ్మవారిని సేవించే వారికి కోరుకున్నవన్నీ చెంతకు చేరుతాయనడంలో సందేహం లేదనే నిస్సంశయాత్మక మార్గాన్ని సూచిస్తారు భూమయ్యగారు.

సౌందర్యలహరి లోని వంద శ్లోకాలను రోజుకు పది చొప్పున వివరించినట్లుగా పది రోజుల్లో దాన్ని పూర్తి చేసి శిష్యహిత హేతువుగా పాఠకులకు అందించి ధన్యులైనారు ఆచార్యులు. (సశేషం)

❖ ❖ ❖ ❖ ❖

# బుడ్డెద్దులు

ఎజ్జు మల్లయ్య, ఫోన్ : 96528 71915

భాషకు అందాన్ని సొగసునిచ్చే
శబ్ద అర్థాలంకారాల వలే
కొట్టంలో గాటికి కట్టేసిన
తెల్లెద్దు ఎర్రెద్దు మా ఇంటికి అలంకారాలు
ఏ ఆవుబిడ్డలో మా ఎద్దులు
భూమికి ఋణపడి పనిచేశాయి
పుట్టెడు వడ్లను బండికేస్తే
తొవ్వపొంటి పోటీపడి లాగేవి



నాయెద్దు నాయెద్దు అని
తమ్ముడు నేను మురిసిపోయేటోళ్ళం
జొన్న రొట్టెలు పెట్టి నన్ను తమ్ముణ్ణి సాకినట్లే
బుట్టి నిండా దానపెట్టి బుడ్డెద్దులను సాకిండు

రాముడు యుద్ధం గెలవడానికి
వానర సైన్యం తోడైనట్లుగా
నాలుగెకరాల భూమి దున్నడానికి
నాన్నకు బుడ్డెద్దులు తోడైనాయి
అపాయాన్ని ముందే పసిగట్టే జింకవలే
పంటలో వచ్చే నష్టాన్ని నాన్న పసిగట్టిండు
తీసుకున్న అప్పుకు వడ్డీ రెండింతలు
వసులు చేసే మోసాన్ని పసిగట్టిండు



పదవీవిరమణ చేసే ఉద్యోగిని
గౌరవంగా సన్మానించినట్లే
భూమికోసం పనిచేసిన బుడ్డెద్దులను
పదవీవిరమణ చేయించి సత్కరించాడు
కూతురు పెళ్లి చేసి పంపుతున్నప్పుడు
తల్లిదండ్రులు పట్టుకోని ఏడ్చినట్లే
సంతలో బుడ్డెద్దులను అమ్మినప్పుడు
గుండెలకద్దుకోని ఏడ్చాడు

ఒకటి కావాలంటే మరొకటి
వదులుకోవాలన్నట్లుగా
బిడ్డల చదువులు కావాలనుకుండు
నాలుగెకరాల భూమి అమ్ముకుండు
గుర్తింపు కోసం ఆధార్ కార్డు చూస్తున్నట్లు
పెళ్లి కోసం భూమి అడుగుతుంటే
అసలుకు రెండింతలు వడ్డీ
వసూలు చేసిన రోజులను
నాన్న నెమరు వేసుకుంటుండు
నాలుగెకరాల భూమిలో పారిన
తన రెక్కల కష్టాన్ని యాదిచేసుకుంటుండు
బిడ్డల జీవితాలే ముఖ్యమనుకున్న
మా నాన్న భూమిలేనివాడైండు

## ఆదిత్య హృదయ మహిమ

"ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్
జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్"

సర్వ మఙ్గల మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్
చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥

**4. జపమ్ :** ఇది వాక్కునకు సంబంధించి నిష్ఠతో చేయవలసిన ఉపాసన. మనస్సు, మాట, చేష్ట అని మూడు కరణాలు మానవునకు ఉన్నాయి. ఈ మూడూ ఒకేత్రాటి మీద నడపటాన్ని త్రికరణశుద్ధి అంటారు. అలా ఉండటం సత్పురుష లక్షణం. దానిని సముద్దీప్తం చేయటంలో అత్యధికంగా ఉపయోగపడేది జపం. జపం వలన రెండు ఫలితాలు ఉంటాయి. ఒకటి ధ్యేయవస్తువును వాక్కుద్వారా పట్టుకొని ప్రయోజనం పొందటం. రెండవది పనికిమాలిన, ప్రమాదకరములైన మాటలను పరిహరించగలగడం. దీనివలన పొందదలచిన ప్రయోజనం శీఘ్రంగా కలుగుతుంది. ఆదిత్య హృదయరూపమైన మంత్రాన్ని జపించి మహాప్రయోజనం పొందవయ్యా మహానుభావా! అని అగస్త్యుల వారి అభ్యర్థన.

శ్రీరాముడు గురువాక్యం మీద పరమశ్రద్ధ కలవాడు. దానిని వాల్మీకి మహర్షి 28,29వ శ్లోకాల రెండు పాదాలలో స్పష్టంగానే చెప్పారు.

ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్ (28,2వపాదం)

ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వేదం పరం హర్షమవాప్తమాన్ (29,1వపాదం)

మిక్కిలి ప్రీతినందినవాడై రాఘవుడు మనోబుద్ధ్యాదులను తన వశంలో నిలుపుకొని ఆదిత్యుని, శరీరచేష్టగా ధ్యాన దృష్టితో, చూచి ఈ మంత్రాన్ని జపించి పరమహర్షం పొందాడు. గురూపదేశాన్ని అన్యూనానతిరిక్తంగా ఆచరణలో పెట్టటం ఉత్తమ శిష్య లక్షణం. ఇది గీతలో అర్జునుడు అన్న "కరిష్యే వచనం తవ" అన్నమాటకు తాత్పర్యం వంటిది.

**5. నిత్యమ్ :** ఈ ఆదిత్య హృదయ మంత్ర సముదాయము దేశ కాలాదుల అవధులు లేనిది. నిత్యమంటే సత్యమైనది అనే అర్థం గ్రహించటం సముచితం. సత్యమంటే బ్రహ్మమునకు చెందిన ఒక లక్షణం. "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అని శ్రుతి.

(సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### శూన్యమూ శౌచమూ

మనకి ఎండా వానల నుండి రక్షణ కల్పించడానికి ఇల్లు కట్టుకుంటాం. కాని అన్ని వైపులా మూసుకుపోయిన ఇంట్లో ఎవ్వరూ ఉండలేరు. ఏ యింటికైనా కిటికీలు, తలుపులూ అవసరం. అవి లేకపోతే ఊపిరాడదు.

కిటికీలు, తలుపులు, ఖాళీ జాగాలు. అంటే ఇల్లంతా గోడలుంటే కుదరదు. కొన్ని ఖాళీ జాగాలూ ఉండాలన్నమాట. ఆ ఖాళీలలో కిటికీలనీ, తలుపులనీ పెట్టుకుంటాం. అంటే ఎవరైనా ఇంట్లో ఉండాలంటే ఖాళీ జాగా అత్యవసరమన్నమాట. ఈ ఖాళీల వల్లే ఇల్లు వాసయోగ్యమౌతుంది.

మనస్సునిండా కోర్కెలుంటే కిటికీలు, తలుపులూ లేని కట్టడం వలె ఉంటుంది. ఎప్పటి కప్పుడు మనస్సును ఖాళీ చేస్తుంటే మనం ఆరోగ్యంగా జీవించగలుగుతాం. ఏ పెట్టె అయినా ఉపయోగ పడాలంటే ఖాళీగా ఉండాలి కదా. దానిని ఏవేవో వస్తువులలో నింపేసుకుంటే వాడుకోలేం కదా. మనిషిని మనస్సుని బంధించకుండా ఉంటే దివ్యత్వమనే గాలి మనస్సులో స్వేచ్ఛగా వీస్తుంది.

శరీరం మలినమైనప్పుడు శుభ్రపరచుకొంటాం. శరీరం పరిశుభ్రమైన తరువాత ఎంతో హాయిగా ఉంటుంది. కాని సబ్బు తనంతట తాను శరీరాన్ని శుభ్రపరచలేదు. దేనినైనా శుభ్రపరచాలంటే, ముందుగా నీళ్ళుండాలి. ఆ తరువాతనే దేనితోనైనా తోమాలి. ఇట్లాగే కదా ఏదైనా పరిశుభ్రమయ్యేది. ఎండిపోయిన సబ్బు దేనినీ శుభ్రం చేయలేదు. దేనినైనా సబ్బుతో కడితిగే కొంత సబ్బు కూడా కరిగిపోతుంది ఆ మలినంతోపాటు.

ఎవరైనా మనస్సుని పరిశుభ్ర పరచుకోవాలంటే, జపాన్నో, ధ్యానాన్నో సబ్బుగా చేసుకోవాలి. అన్నిటికన్నా ముఖ్యమైనది నీరు. అనుగ్రహమనే నీరు. నీరొక్కటే చాలు. ఒక జలపాతం క్రింద నిలబడినప్పుడు, సబ్బుని వాడం. జలపాతం యొక్క బలం వల్ల మన శారీరక మాలిన్యమంతా బలవంతంగా, శీఘ్రంగా తుడిచిపెట్టుకు పోతుంది. ఏ యోగి సన్నిధిలోనో, ఏ ఋషి సన్నిధిలోనో ఉండటం జలపాతం క్రింద నిలబడటం వంటిదే. అటువంటి మహనీయుల యొక్క అనుగ్రహపాతం మానసిక మాలిన్యాన్ని మాపివేస్తుంది.

# సుప్రసన్న భక్తి కవిత్వం 'ప్రపత్తి తత్త్వం'

**దాసోజు జ్ఞానేశ్వరాచారి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 991 213 8152



తెలుగు సాహితీలోకంలో సుప్రసన్నగా ప్రసిద్ధులైన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య 1936 మార్చి 17న వరంగల్లు పట్టణంలో జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, వేంకటనృసింహాచార్య. వృత్తిపరంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా సుదీర్ఘకాలం సేవలందించి విశ్రాంతి పొందుతున్నారు. ప్రవృత్తి పరంగా కవి, విమర్శకులు, పరిశోధకులు. 1951నుండి కవిత్వం వెలువరిస్తున్నారు. దాశరథి, కుందుర్తి, సినారెలాంటి వారి కాలంలో యువకవి, విమర్శకుడు, పరిశోధకుడుగా పేరు గడించినవాడు. నేటివరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న వీరి సాహిత్యకృషి ఫలాలుగా 21 కావ్యాలు, 15 విమర్శనాగ్రంథాలు, రెండు కథలు, ఐదు రేడియో నాటికలు వెలువడ్డాయి. ఎనిమిదింటికి సంపాదకత్వం వహించారు. వీరి షష్టిపూర్తి సందర్భంగా **'ప్రసన్న శారద',** అసీతి సందర్భంగా **'సన్నుతి'** ప్రత్యేక సంచికలుగా ప్రసిద్ధ సాహితీవేత్తల వ్యాసాలతో వెలువడ్డాయి. **'చేతనావర్తం'** నిర్మించి, నడిపించడంలో వీరి పాత్ర ప్రధానమైనదిగా చెప్పొచ్చు.

సుప్రసన్న పద్యం, వచనం రెండు ప్రక్రియల్లో కవిత్వసృజన చేశారు. వీటిలో రెండింటిని పినతండ్రి సంపత్కుమారాచార్యతో కలిసి రాయగా, పందొమ్మిది కావ్యాలు స్వీయరచనలు. వీటిలో సుమారు ముప్పాతిక వంతు భక్తికవిత్వమే. జీవులన్నింటిలో పరమాత్మను దర్శించాలన్న ఆధ్యాత్మికత ద్వారానే సామరస్య సమాజం ఏర్పడి విశ్వశాంతిగా పరిణమిస్తుందన్న పూర్వ ఋషుల మార్గమే వీరి సాహిత్య సారాంశం. పితామహుల, మాతామహుల కుటుంబాలు ఆధ్యాత్మిక సాధన, సాహిత్యకృషి విశేషంగా సలిపినవి. ఈ నేపథ్యం సుప్రసన్న వ్యక్తిగత, సాహిత్య జీవితంపై ప్రభావాన్ని చూపింది. అలా వీరు ఆధ్యాత్మికవేత్తగా, భక్తకవిగా రూపొందారు. వీరి భక్తికవిత్వంలోని **'ప్రపత్తి తత్త్వం'**ను పరిశీలించడం ప్రస్తుత వ్యాసోద్దేశం.

"భక్తి" అన్న పదాన్ని భారతీయ సంప్రదాయంలో విరివిగా వాడుతుంటాం. మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి... ఇలా అనేకుల పట్ల భక్తిని, భక్తిమార్గాన్ని కలిగివుంటాం. హైందవ ధర్మం ప్రకారం చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ కామమోక్షాలకు అధిక ప్రాధాన్యముంది. మనిషి పుట్టినది మొదలు మరణించే వరకు జీవితం సమస్తం ఈ నాలుగుస్తంభాల పైననే ఆధారపడి వుంది. జనన మరణ చక్రంలో జీవి చేసిన కర్మలననుసరించి సుఖదుఃఖా లనుభవించడం సాధారణం. ఒక రకంగా జీవితం సుఖంలో కన్న దుఃఖంలోనే అధికభాగం మునిగి పోతుంది. దుఃఖానికి, పునర్జన్మ రాహిత్యానికి మోక్షమే పరిష్కారం. మోక్షమనగా సృష్టికర్తలోనే లీనమవడం. ఇది భక్తి, జ్ఞాన, కర్మయోగ మార్గాల ద్వారా సిద్ధిస్తుందన్నది గీతలో కృష్ణపరమాత్మ చెప్పినదే. సాధనానుభవం గల గురువుల బోధనా ఇదే. వీటిలో మరల 'భక్తియోగం' శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది.

### భక్తి నిర్వచనం

భగవంతుణ్ణి సేవించడమే భక్తి. 'భజ్' అను సంస్కృత ధాతువు నుండి పుట్టినదే 'భక్తి' అనే పదం. 'భజసేవాయామ్' అనగా భగవంతుణ్ణి అర్చనాదుల చేత ఆరాధించడం, సేవచేయడం భగవద్భక్తి. భగవంతుడి పట్ల ఆరాధన, సేవ, అవ్యాజమైన అనురాగం కలిగివున్నవాడు భక్తుడు. మనసా, వాచా, కర్మణా ఒక మనిషి 'భక్తి'ని తన స్వభావంగా కలిగివుండడమే 'భక్తితత్త్వం'.

**"భక్తిరస్యభజనం, తదిహాముత్రోపాధి నైరాశ్యే నాముష్మిన్ మన: కల్పమ్"** (భక్తి అనగా భగవంతుడి సేవ. ఇహపర సుఖాలను కోరుకోకుండా భగవంతుడి సేవలో ఐక్యమయ్యే విధంగా ఆ భక్తి ఉండాలి) అని గోపాల పూర్వతాపిన్యుపనిషత్తు పేర్కొంది. **"యాప్రీతి రవివేకానాం విషయేష్వన సాయినీత్వం అనుస్మరత సాయే హృదయాన్మాప సర్పతు"** (ప్రథమాంధ్రపురాణం) అనగా భగవంతునిపై నిరంతరం గాఢమైన ప్రేమను కలిగివుండడమే భక్తి. ఇంకా విష్ణుపురాణం ప్రకారం **"లౌకిక సుఖాలను ధార్మిక మార్గంలో అనుభవిస్తూ వాటిపై గల గాఢమైన ఇష్టాలను, ప్రేమను దేవుడిపైకి మరలించినపుడు 'భక్తి'** అవుతుంది. **"స్వాతస్మిన్ పరమ ప్రేమ రూపా"** అనగా భగవంతునిపైన ఉండే శ్రేష్ఠమైన ప్రేమయే భక్తి అని మహర్షి నారదుని నిర్వచనం. ఇలా పురాణేతిహాసాలు, ఉపనిషత్తులు, భగవద్భక్తులైన మహర్షులు, భాష్యకారులు చెప్పినదాని ప్రకారం భక్తి అనగా భగవంతుని పట్ల అచంచలమూ అకుంఠితమూ అయిన ఆరాధనాభావం, ప్రేమ కలిగి, ఇహపర సుఖాలను కోరుకోకుండా భగవంతుడిలో ఐక్యమయ్యే సాధనయే భక్తి అని తెలుస్తుంది.

భక్తి కవిత

కవియైన వాడు భక్తిభావంతో చెప్పిన కవిత్వం భక్తికవిత్వం. **"భగవంతుని పొందటం భక్తియోగం. అది సంగమం కావటానికి తోడ్పడే సాత్త్విక కళాసాధన భక్తికవిత. భక్తకవి అన్నప్పుడు భక్తుడు, కవి అయినవాడు లేదా భక్తుడైన కవి అని భావం. అలాగే భక్తి కవిత్వం అన్నప్పుడు భక్తి భావం, కవిత్వకళ ఉన్న కవిత్వమని అర్థం. భక్తి ప్రధానమైన కవిత్వం అని సాధారణంగా చెప్పుకొంటుంటాం".** (సుబ్రహ్మణ్యం జీవీ, సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు, పుట:135) ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు కవిత్వ రచనారంభం నుండి తన కవిత్వంలో భక్తికి ప్రాధాన్యమిచ్చారు. వారి సాహిత్య సృజనలో అధికభాగం భక్తికవిత్వమే. **"భక్తి కవిత్వరచనం కూడా కళాపరంగా సాధించే భక్తి, జ్ఞాన, కర్మల సమన్వయమే"** (సుబ్రహ్మణ్యం జీవీ, సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు పుట:136) అన్న మాట అక్షరాల సుప్రసన్నకు వర్తిస్తుంది.

జనన మరణ చక్రంలో చిక్కుకున్న మానవుడు సంసార చక్రంలో పడి ఒకేమారు బాహ్యాంతర చక్రాలలో పరిభ్రమిస్తాడు. **"ఈ పరిభ్రమణం వారు పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాలను బట్టి జరుగు తుంటుంది. ఈ సంసార చక్రభ్రమణం అనాది సిద్ధమైనది. అయినప్పటికీ అంతం లేనిది మాత్రం కాదు. భగవత్తత్త్వాన్ని భక్తితో, శేముషీవిభవంతో ఉపాసించి అవి కొఅవడినప్పుడు వాటితో పాటే ప్రపత్తి (శరణాగతి) యోగాన్ని అనుసంధించి భగవంతుని నిర్వ్యాజ కృపను పొందినప్పుడు జీవులే చక్రబంధం నుండి విముక్తి పొందగలరనీ ఉపనిషద్రహస్యాన్ని చాటుతున్నదీ కావ్యం"** (భాష్యాచార్య ఆరుట్ల, శ్రీనృసింహప్రపత్తి, సన్నుతి, పుట:219) జీవులు ముక్తిని పొందటంలో భక్తిప్రపత్తుల ప్రాధాన్యమే అధికం. పైగా ఇది సామాన్య భక్తులకు సైతం సాధ్యమగు సాధన. భక్తి సరేసరి. ప్రపత్తి కూడా తోడైతే జీవుడికి మోక్షమార్గం దగ్గరవుతుంది. దేవుడికి దగ్గర చేసే ప్రపత్తికి ఆరు అంగములు. వాటిని పూర్తిగా ఆచరించినపుడే ప్రపత్తి అనబడుతుంది. దాని ఫలితం దక్కుతుంది.

**"అనుకూల్యస్య సంకల్ప: ప్రాతికూల్యస్య వర్జనమ్**
**రక్షిష్యతీతి విశ్వాస:గోప్తృత్వవరణం తథా**
**ఆత్మనిక్షేప, కార్పణ్యే షడ్విధా శరణాగతి:**
**ఏవం మాం శరణం ప్రాప్య వీతశోక భయక్షమ:"**
(లక్ష్మీతంత్రం: 17-60, 61) (అహిర్బుధ్న్య సంహిత-37,28,29)

పై శ్లోకం ద్వారా ప్రపత్తి ఆరు విధాలుగా చెప్పబడింది. అవి 1.అనుకూల్యస్య సంకల్పం. 2. ప్రాతికూల్యస్య వర్జనమ్ 3.రక్షిష్యతీతి విశ్వాస: 4.గోప్తృత్వవరణం 5.ఆత్మనిక్షేపం 6.కార్పణ్యం. ఆచార్య సుప్రసన్న శ్రీ నృసింహ ప్రపత్తి కావ్యంలో ఈ ఆరు ప్రపత్తి విధానాలు కలవు.

**1.అనుకూల్యస్య సంకల్పం**

పరమాత్మకు, పరమాత్మ తత్త్వానికి అనుకూలమైన కర్మలను చేయు సంకల్పమే అనుకూల్యస్య సంకల్పంగా చెప్పవచ్చు. 93వ పద్యంలో

**"శంసా మార్గముల్ చరించిరి కులస్వాముల్ మిమ్ముంగొల్చి నిల్చిరి ర్వంశంబుల్ జీవనంబె తపమై వర్తించిరా త్రోవ ద్వా త్రింశద్బాహు నృసింహ! సాగినది ఇంతే చాలు...'** (శ్రీనృసింహ ప్రపత్తి, ప. 93) నని స్వామికి కవి విన్నవించుకుంటారు. కవిగారి కులస్వాములు అనగా తాతలు, తండ్రులు వేల్పుగొండ క్షేత్రంలోని శ్రీలక్ష్మీనృసింహుని స్తోత్ర (శంసామార్గ)ముల చేత కొల్చి, స్వామి భక్తిలో జీవితాన్ని తపస్సుగా కొనసాగించారట. దీనిద్వారా కవి ఇలు వేలుపుగా నిలుపుకొని కొలిచే మార్గాన్ని ఏర్పరచడం అనుకూల్యస్య సంకల్పమనే ప్రపత్తిని నిత్యార్చన, అక్షరార్చన ద్వారా అందించడం, దానిని ఈ కవిగారు అందుకొని కొనసాగించడంగా చెప్పవచ్చు. ఇదే విషయం మరో పద్యంలో మరింత స్పష్టమవుతుంది. అది –

**"తలలో నాలుకవంటి వాడవని నా దైవంబ నిన్భావనాం**
**చల రౌప్యద్యుతిగాగ నెంతు, కవితా చాంద్రీపయ:పూర ని**
**ర్మల శుభ్రద్యుతిగాగ నెంతు, సుమనోరమ్యాధ్వ మాలాకృతీ**
**ఇలవేల్పైతివి సర్వతోవనుడ వీవే నారసింహప్రభూ!" (ప.107)**

**2. ప్రాతికూల్యస్య వర్జనం**

పరమాత్మకు ప్రతికూలము (వ్యతిరేకము) లైనవి ఏవీ చేయకుండా ఉండుట. అనగా కర్మలతో పాటు భావన కూడా. అన్నింటికన్నా భక్తిభావనయే ప్రధానమైనది కదా! ప్రధానంగా ఎంతటివారైనా ఇంద్రియ లౌల్యానికి లోనుకావటం చేతనే పతనమవుతారు. భక్తులకు, సాధకులకు ఇంద్రియనిగ్రహం అత్యావశ్యకం. ఇంద్రియ పరమైన వాసనలు, ఆకర్షణలే పతనహేతువులు. విశ్వామిత్రుని అంతటివాడే ఇంద్రియనిగ్రహం కోల్పోయి సాధించిన తపశ్శక్తిని కోల్పోవటం తెలిసిన విషయమే. అలాంటిది, సామాన్య మానవుల పరిస్థితి చెప్పగలమా! అందుకే భగవంతునికి దూరం చేసే ఇంద్రియాది దుష్కర్మలను వర్జించాలి. కవిగారు తనలోని వాసనలను సంహరింపుమని స్వామివారిని –

**అణుమాయామల కామ్యదోషముల ధ్యానాధిష్ఠతన్ త్రోసివే**
**యను యత్నంబొనరింప వాసనల సంహారంబు గావింప...**
(ప:89) గా ప్రణుతి చేస్తున్నారు.

**3. రక్షిష్యతీతి విశ్వాసం**

భక్తుడు, భగవంతుడు తనను తప్పక రక్షిస్తాడన్న సంపూర్ణ విశ్వాసాన్ని కలిగివుండడం. నృసింహావతార విశేషమే భక్తుడైన ప్రహ్లాదుణ్ణి రక్షించడం దానిని ఉదాహరణగా గ్రహించవచ్చు.

ఆర్థికంగా, సామాజికంగా మనిషి ఎంత ఉన్నతస్థితిలో ఉ

న్నప్పటికీ చెప్పలేని సమస్యలు ఎన్నో ఉంటాయి. వాటిని దాటడం కొన్నిసార్లు మానవ మాత్రులకు సాధ్యం కాకపోవచ్చు. అలాంటి పరిస్థితులలో భక్తులైన వారు తమను రక్షించమని భగవంతునితో మొరపెట్టుకోవటం తెలిసిందే. ఈ కావ్యంలో అనేకచోట్ల కవి భగవంతుడు తనను రక్షిస్తాడన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తారు.

1. దీనరక్షణ, కృపావార్ధీ! (ప:2)

2. కృపాణహస్త, శ్రితపోషా! (ప:3)

3. నన్నొక్కప్పుడునైన వీడవు (ప:4)

4. మీ యనుగ్రహము సంపాదించినన్ చాలు విద్యాదీప్తుల్ ప్రసరించు (ప:36)

5. నీవె దిక్కు సమాశ్రయించితిని తండ్రీ! (ప:79)

6. నమ్మికతో నుంటిమి నీవె దిక్కనుచు (ప:109) ఇలా కవి పదం పదంలో స్వామిపై విశ్వాసం ప్రకటిస్తున్నారు.

**4. గోప్తృత్వవరణం**

భక్తుడు తన రక్షణను భగవంతునికి అర్పించటం అనగా కాపాడేవాడిగా భగవంతుడినే వరించుట గోప్తృత్వవరణం. భగవంతుణ్ణి ఎంతగా ఆరాధించినా, ఎంత నమ్మకమున్నా భక్తునికి తన కష్టాలు తీరడంలో ఆలస్యం కావటంతో ఒక్కోసారి మనసు చలించి ఆతని ఉనికిని అనుమానించవచ్చు. ఈ భావం ఎంతోమంది ప్రసిద్ధ భక్తులు వెలువరించిన సందర్భాలు కోకొల్లలు. రామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న ఎంతటి రామభక్తుడో తెలిసిన విషయమే. అలాంటివాడే తనపై నింద తొలగిపోయే సమయం ఆలస్యం కావటంతో **"ఉన్నాడో లేడో యాపన్న రక్షకుడు ఎన్నాళ్ళు వేడిన కన్నులకగపడడు..."** అని కంచర్ల గోపన్న రాముణ్ణి నిందాస్తుతి చేయటం, అసలు తానున్నాడో లేడో అన్న సంశయాన్ని వెలిబుచ్చటం ఎరిగిందే.

పోతన భాగవతంలో గజేంద్రుని ద్వారా ఇలాంటి అనుమానాన్నే వ్యక్తంచేస్తాడు. ఆ ప్రసిద్ధ పద్యం **"కలదందురు దీనుల యెడ / కలదందురు పరమయోగి గణముల పాలన్ /గలదందురు దిశలను/ కలదు కలండనెడువాడు కలడో! లేడో!"** (పోతన, భాగవతం, అష్టమ స్కంధం, ప:86) మొదట గజేంద్రుడు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో మొసలితో పోరాడతాడు. క్రమేణా శక్తి సన్నగిల్లుతున్నప్పుడు దేవుడు జ్ఞాపకం వస్తాడు. తలుస్తాడు. దైవసహాయం ఆలస్యమవుతున్నకొద్దీ **'ధైర్యంబు విలోలంబ...'** (పోతన, భాగవతం, అష్టమ స్కంధం, ప:90) మయి మనసు చలిస్తుంది. పరిమిత శక్తి గల జీవునికిది సహజం. కాని అంతలోనే తేరుకొని **'...నీవే తప్ప నిత:పరంబెరుగ మన్నింపదగున్ దీనునిన్ / రావే! యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!'** (భా.అ.స్కం.90) అనడమూ చూస్తాం. ఇదే భావాన్ని అనగా **'దైవమే నాకు రక్ష–అన్యథా శరణం నాస్తి'** అని కవి సుప్రసన్నగారు ఈ కావ్యంలో పలు సందర్భాలలో వెలిబుచ్చుతారు. వాటిలో కొన్ని.



1.నీవే దిక్కయితివి (ప:11)

2.నేవె కావవలెనయ్య (ప:37)

3.నీవే దిక్కు సమాశ్రయించితిని (ప:79)

4.నీవు వినా మరేమి గతి (ప:100)

**5. ఆత్మనిక్షేపం**

ఆత్మనిక్షేప ప్రపత్తి యనగా భక్తుడు తనకు తాను సంపూర్ణంగా పరమాత్మకు అర్పించుకొనటమే. ఇలా సమర్పించుకున్న వారిలో ఆదిశేషుడు ప్రథముడు. తన శరీరాన్ని, శక్తితోపాటు ప్రాణములను స్వామికి సమర్పించినవాడు. ఈ వృత్తాంతాన్ని ఈ ఒక్క పద్యంలో చక్కగా విశదపరిచారు.

**గొడుగై శయ్యయు, పద్మపీఠమయి నీకున్ ప్రాంశుకంబౌచు, నీ అడుగుల్ మోపగ పాదుయుగ్మమయి, క్షీరాంభోధి యోగాధి రూ ఢుడవౌ నీకగు లెంకయై యొదుగ లేడో ఆదిశేషుండు..(ప. 52)**

ఆదిశేషుడు రామావతారంలో లక్ష్మణుడుగా అవతరించినట్లు తెలిసినదే. **"లక్ష్మణుడు ఆదిశేషుని అవతారం అవడం వల్ల విష్ణువు అవతారమైన శ్రీరామునితో జీవితాంతం కలిసి పయనించాడు"**. (పూర్వగాథాలహరి, పుట.223) సుఖదుఃఖాలలో, కష్టనష్టాలలో సోదరరూపంలోని శ్రీమహావిష్ణువు అవతారమైన రాముని వెంట కలిసి సంచరించాడు. ఆతని సర్వసమర్పణ జీవితాన్ని వర్ణించడమంటే కవి ఆ భావనలోనున్న వాడనియే కదా అర్థం. కావున ఆచార్య సుప్రసన్న గారి లోని ఆత్మనిక్షేప ప్రపత్తికి ఇదొక ఉదాహరణ. ఇంకా **"ప్రహ్లాదుని భావించుట కూడా ఆత్మనిక్షేప ప్రక్రియకు బలమును చేకూర్చుటకే"**. (కోదండ రామాచార్యులు.కె, సన్నుతి, పుట:223)

**6. కార్పణ్యం**

భక్తుడు భగవంతునికి తన దైన్యమును విన్నవించుకొనుట కార్పణ్యమనబడుతుంది. **"రక్షాపంజర ఉగ్గపట్టుకొని నా**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

**ప్రాణంబులన్ నీ దయా / భిక్షార్థంబుగ చెంతజేరితిని...”**(ప:86) ప్రపంచంలో మానవులకు కష్టములనేకములు. అవి ఎప్పుడూ ఏ రూపంలో వెంటాడుతాయో చెప్పలేం. కొన్ని కొన్నిసార్లు ప్రాణాల మీదకూ తెస్తాయి. అప్పుడు ఆస్తికులైన వారు దీనంగా భగవంతుడి సహాయాన్నర్థిస్తారు. ఈ కవి కూడా ప్రాణాలను ఉగ్గబట్టుకొని నీ దయను భిక్షగా కోరి నీ చెంత చేరానని అనడంలో దైన్యమే కనిపిస్తుంది. అలాగే 103వ పద్యంలో **“పుట్టు దీనులము, చీకటులె మా జన్మంబులన్నిండె...”** అంటారు. కవియొక్క దీనత్వ ప్రకటనకు ఇంకా ఈ పద్యాలు పతాకస్థాయిగా నిల్చినాయనవచ్చు.

**“ఆరాధింపను వీలులేని కృతక వ్యాపారమౌబుద్ధియున్**
**ఆరాధింపగ చేర్చలేని ఉపచారానేక సామగ్రితో**
**శ్రీరమ్యాక్షర జాతవేద నృహరీ, చెక్కిళ్ళపై జారు క**
**న్నీరే నీ పరితోర్చగా గొనుము తండ్రీ నారసింహప్రభూ!”**
**(ప:114)**

కవి వస్తురూపంలో కోరికలతో అర్చన చేయటం కృతక వ్యాపారబుద్ధి, అలా నేను ఉపచార సామగ్రితో పూజచేయలేనని, పైపై ఆడంబరాల ప్రదర్శన కాక నిన్ను దర్శించు వేళ చెక్కిళ్ళపై జారే ఆనందబాష్పాలనే పరితోర్చగా గొనుమంటున్నాడు. ప్రధానంగా భక్తులు తమశక్తి కొలది భగవంతునికి షోడశోపచార లేదా పంచోపచార పూజలు చేస్తారు. కొండంత దేవునికి కొండంత పత్రితో పూజించలేమన్నది తెలుగువారి భక్తిలోకంలో ప్రసిద్ధమైన సామ్యత. సత్యభామ ఎన్ని వజ్రవైడూర్యాది సంపదలచేత తూచినా తూగని కృష్ణుడు రుక్మిణి నిండుభక్తిచేత కేవలం ఒక్క తులసిదళం చేత తన సొంతం చేసుకుంది. మొసలినోటికి చిక్కిన గజేంద్రుడు దీనంగా మొరపెట్టుకున్న భక్తికి శ్రీమహావిష్ణువే దిగివచ్చాడు. ఈ భావనాస్థితిని కవిగారు **‘చెక్కిళ్ళపై జారు కన్నీరే నీ పరితోర్చగా గొనుము (ప:114), దిక్కేది శుగ్వ్రాతంబేర్చుచునున్నదోయి ప్రభు! నీవై చేదుకో’** (ప:115) అని వ్యక్తపరచడం దీనత్వంలోని స్థాయిని ఇంతకు మించి వ్యక్తం చేయటం అక్షరాలలో సాధ్యం కాదేమో! ఇలా భక్త కవియైన సుప్రసన్నలోని ప్రపత్తి తత్త్వం శ్రీనృసింహప్రపత్తి కావ్యంలో అక్షరాక్షరంలో కనిపిస్తుంది.

❖ ❖ ❖ ❖ ❖

# భక్తవశంకరా! హరా!!

**అమరవాది రాజశేఖర శర్మ**
**గజ్వేల్, ఫోన్ : 98489 96559**

బహుళోపచారాలు భక్తితో నర్పించి
పూజలన్ జేసెడి పుణ్యులందు
విగ్రహాలను గని విధ్వంసములు జేయు
పాషాణ హృదిగల పాపులందు
తనకున్న దానిలో తనరుగా పరులకు
దానంబు గావించు దాతలందు
పరుల సంపదలను ఫలహారమొనరించి
వెరుపెరుగని బకాసురులయందు
నీవుగలవందురే శివా ! నీ అనుజ్ఞ
లేక చీమైనకుట్టదే ! లోకమందు
మంచి దారిలో మము నడిపించవేల
ఓర్పుకైనను హద్దొకటుండబోదె

పంచామృతాలేల పన్నీటి సొదయేల
సలిలాభిషేకాలు సలుపచాలు
చందన జవ్వాజి సౌగంధికములేల
భస్మరేఖలు దిద్దు పగిది చాలు



సంపెంగ చామంతి చంపకాలవియేల
మారేడు దళమిడు మనసు చాలు
హాటక ప్రతిమలనార్చించుతలపేల
గుండ్రాయిలో శివుని కొలవచాలు
ద్వైతభావము విడనాడి దాంతుడగుచు
భక్తి పంచాక్షరీ మంత్ర పఠన సేయ
కాశికా విశ్వనాథుడే కరుణ జూపి
ఇహపరంబుల సుఖముల నిచ్చుగాదె

అభిషేకముల్ జేసి అలరించ పనియేల
తలపైన జాహ్నవే నిలిచి లేదె
భస్మ రేఖలు దీర్చి భజియింపగానేల
కాటి బూడిద నీకు గలిగి లేదె
కర్పూర దీపాల నర్పింపగా నేల
కంటిలో రగిలిన మంట లేదె
పంచ భక్ష్యాల నర్పించగా పనియేల
అన్నపూర్ణమ్మ నిన్నంటి లేదె
వేద మంత్రాలు భజనలవేల తండ్రి
నిత్య యోగ సమాధిలో నిలుతు వీవె
మనసునొక్కటి నీదివ్య మందిరముగ
మలచుకొందును నిలుమయ్య మన్మథారి

# సరస్వతీ ! నమస్తుభ్యం !!

**ఆచార్య శ్రీవత్స**, తిరుపతి, ఫోన్ : 90003 24024

**సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి ।**
**విద్యారంభం కరిస్యామి సిద్ధిర్భవతు మే సదా ॥**
**పద్మపత్ర విశాలాక్షీ పద్మకేసర వర్ణినీ ।**
**నిత్యం పద్మాలయాం దేవీ సామాం పాతు సరస్వతీ ॥**

వివిధ రూపాలు దాలుస్తూ భక్తకోటికి కోరిన వరాలనిచ్చే చదువులతల్లీ! ఓ సరస్వతీదేవీ! చదువు ప్రారంభించుచున్న నాకు ఎల్లప్పుడూ జయం కలుగజేయి. మంచి జ్ఞానశక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను.

నిత్యమూ పద్మాలయందు నివసించుచూ పద్మం వలె విశాలమైన కన్నులు, పద్మకేసరాల వంటి రంగు కల్గిన ఓ సరస్వతీదేవీ! నన్ను రక్షించు" అని చదువుల తల్లి శ్రీ సరస్వతీదేవిని ప్రార్థిస్తాం. అందువల్ల విద్య అభివృద్ధి చెందుతుందని నమ్మకం. అటువంటి విద్యాభ్యాసానికి ప్రారంభం అక్షరాభ్యాసం. అక్షరాలను దిద్దడంతో విద్యాభ్యాసాన్ని ప్రారంభిస్తాం. అక్షరం అంటే క్షయం (నాశనం) లేనిది అని అర్థం. మనం సంపాదించే సంపదల్లో ఏదైనా నశిస్తుంది కానీ అక్షర సంపద, విద్యాసంపద మాత్రం నశించదు. అటువంటి అక్షరాలకు అధిదేవత, విద్యలరాణి, పుస్తకపాణిని, జ్ఞాన ప్రదాయిని అయినా శ్రీ సరస్వతీదేవి జన్మదినం, మాఘశుక్ల పంచమి. దీనికే 'శ్రీపంచమి' అనీ, 'వసంత పంచమి' అనీ 'మదన పంచమి' అని పిలుస్తుంటారు. మాఘమాసం అయిదవరోజు వచ్చే పండుగకనుక దీన్ని 'శ్రీపంచమి' అనీ, వసంతమాసం తొలిరోజుల్లో వచ్చే పండుగ కనుక దీన్ని 'వసంత పంచమి' అని అంటారు.

**"ఏ సతి లావు లేక నరులెవ్వరు నోరు మెదల్పలేరు ప**
**ద్మాసన వాసుదేవ నిటలాక్షులు లోనుగ ఆ త్రివిష్టపా**
**వాసులు పుట్టు పేరు చెలువంబును నేరికి దాపరట్టి వా**
**ణీ సతి మన్ముఖాబ్జమున నిల్చి విశేషవరంబు లీవుతన్"**

ఏ తల్లి శక్తి లేనిదే బ్రహ్మాది దేవతలు మరియు ఇంద్రాది దేవతలు కూడా నోరు మెదల్పలేరో ఆ శక్తి స్వరూపిణియైన వాగ్దేవిని ప్రార్థిస్తున్నాను అని అనంతామాత్యుడు చెప్పాడు కదా!

మానవ జీవితంలో ముఖ్యమైనది 'వాక్కు' కదా! వాక్కు అంటే శబ్దశక్తి. ఎవరినీ నొప్పించకుండా చెప్పదలచుకున్న విషయాన్ని చక్కని మాటలతో చెప్పటమే శబ్దశక్తి ఉపాసన. కనుక మాటతోనే మానవుడు మాన్యుడౌతాడు. మాటతీరు మనస్సుకు అద్దం పడుతుంది. మానవుని సంస్కారాన్ని తెలియజేస్తుంది. కనుకనే మాట ప్రభావం మహోదాత్త మైంది. అంతేకాక బ్రహ్మ ఉపాస్నైనా వెనక్కి తీసుకోవచ్చునేమో కాని,



పెదవి దాటిన మాటను వెనక్కి తీసుకోలేము. ఎందుచేతనంటే **"పెదవి దాటితే పృథ్వి దాటుతుంది"** కనుక. మనం మాట్లాడే ముందు జాగ్రత్తగా ఆలోచన చెయ్యాలి. మధురంగా మాట్లాడాలి. అంచేత మాటతీరును మధురతరం చేసి, జీవనసరళిని ఆనందమయం చేసి, మనశ్శాంతిని ఇచ్చే మహాశక్తి వాగ్దేవి, చదువులతల్లి సరస్వతీదేవి. అందుకే **"ప్రణోదేవీ సరస్వతీ"** అన్నది శ్రుతి.

అకారాది వర్ణాలచే ఏర్పడే పదాలు, మాటలు, పద సముదాయ వాక్యాలు, గద్య, పద్య రూప కవిత – వీటన్నింటి రూపాల్లో ఏ దేవి విలసిల్లుతుందో ఆమెయే సరస్వతీదేవి. శ్రుతులు (వేదాలు) స్మృతులు (ధర్మశాస్త్రాలు) సరస్వతీదేవి మహిమను కొనియాడుచున్నవని, సంగీత స్వర మహితమైన సరస్వతి అధిక మనోహారియై పూజలందు కొంటున్నదని **"సరస్వతీ శ్రుతి మహతీ మహీయతామ్"** అని ఎన్నో విశేష అర్థాల్ని ఇమిడ్చి ఒక చిన్నవాక్యంలో చెప్పాడు వాగ్దేవి వరప్రసాదుడు మహాకవి కాళిదాసుడు.

తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లతామర పువ్వుపై కూర్చుని, తెల్లహంస నెక్కి ఊరేగే సుందరి ఈ బ్రాహ్మీమయ సుందరి, నాదానికి – స్వరానికి – వేదానికి – మాటకు సంబంధముంది. కనుకనే సరస్వతిని బ్రహ్మదేవుని భార్యగా కొనియాడారు. నాదబ్రహ్మ, వాగ్దేవి జతకట్టడం ఎంత అందంగా ఉందో అంత ఔచిత్యంగా ఉంటుంది. సరస్వతికి చదువుల మీద, జ్ఞానం మీద మాట మీద, సారస్వతం మీద, కళల మీదల విశేషమైన ఆధిపత్యం ఉంది. అందుకే సరస్వతీదేవి చదువుల తల్లి సారస్వత వాహిని, సాంస్కృతిక రూపిణి, కళాభారతిగా పూజలందుకుంటోంది. నిత్యం బ్రహ్మను అనుసరించి ముందుకు సాగేది కనుక బ్రహ్మచారిణి అని, బ్రహ్మను వివాహం చేసుకుంది

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 (38) హైదరాబాద్ ఫిబ్రవరి : 2024



కనుక బ్రాహ్మీ అని అన్నారు. 'మాట' రావాలంటే మనిషికి స్వరపేటిక ఉండాలి కదా? స్వరంలో ఉండే ధ్వనే నాదం. అదే బ్రహ్మ. అందుకే బ్రహ్మను నాదబ్రహ్మ అన్నారు. ఆమె రస స్వరూపిణి కనుక సరస్వతి అయింది. రసం అంటే నీరు. నీరు జ్ఞానానికి సంకేతం. సరం అంటే ప్రవాహం. ఝరి అంటే అర్థం. మాట ప్రవాహగతిని సాగిపోవడానికి కారణం సరస్వతి దానికి అధిష్ఠాన దేవత కావడమే కారణం. జ్ఞానం పరిశుద్ధమైనది కనుక తెలుపు వర్ణమని ఋషులు నిర్ణయించారు. సరస్వతి కూడా తెల్లని వర్ణంలో ఉంటుంది. ఆమె ధరించే వస్త్రాలు తెల్లని తెలుపు. ఆమె తెల్లని పద్మంపై కూర్చుని ఉంటుంది. ఆమె వాహనం హంస తెల్లని రంగులో ఉంటుంది. హంస ముందు పాలను ఉంచితే పాలను త్రాగి నీటిని వదలివేస్తుంది. అంటే జ్ఞానాన్ని మాత్రమే గ్రహిస్తుంది.

అన్న ప్రదాయిని బుద్ధి శక్తుల్ని రక్షించే మాతగా సరస్వతి సాక్షాత్కరించింది. వ్యక్తమయ్యేది వాక్కు. వాక్కే సర్వానికి కారణం. "వాగ్భూషణమే భూషణమ్". మానవ జగతికి మంచి మాటే అలంకారము. ఆ వాక్కుని దేవతగా ఉపాసించి, వాక్సంపదని సాధించాలి. జ్ఞానం వాక్సంపద సరస్వతీ ఆరాధనతో సిద్ధిస్తాయి. వాక్సంపద ప్రదాయిని కనుక ఈమె వాగ్దేవి అయ్యింది.

'శ్వేత పద్మవాసిని' కనుక 'శారద' నామంతో కొలవబడుతోంది. విద్య ద్వారా సంపద సంపాదించాలన్నా కీర్తి ప్రతిష్ఠలు పొందాలన్నా, సంపాదించినా సంపదను సద్వినియోగపరచాలన్నా అవసరమైంది బుద్ధిశక్తి. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. ఈమె శివానుజగా శివశక్తిగా భాసిల్లుతోంది. వాక్కుల శక్తి కనుక **'వాగేశ్వరీ, వాగ్వాదినీ, మహా సరస్వతీ, సిద్ధ సరస్వతీ, నీల సరస్వతి, ధారణ సరస్వతీ, పరా సరస్వతీ, బాలా సరస్వతీ'** – ఇలా అనేక నామాలతో పిలువబడుతోంది. జ్ఞానప్రదాయినిగా, ధన ప్రదాయినిగా, శారదాదేవిని వేదం ఉపాసించింది.

**పురాణ ప్రవచనం :**

శ్రీ బ్రహ్మ వైవర్త పురాణంలో వ్యాసులవారు సరస్వతీ కవచం, స్తోత్రం రచించారు. వీటి వైశిష్ట్యాన్ని బ్రహ్మదేవుడు భృగు మహర్షికి వివరించాడు.

"వత్సా! భృగు మహర్షీ! సమస్త కోరికల్ని తీర్చే సరస్వతీ కవచం విను. ఇది వేదాల్లో చెప్పబడిన సారవంతమైంది. వేదాల చేత నిత్యం పూజింపబడుతోంది. చెవులకింపైనది. కల్పవృక్షం వలె సర్వ కోరికల్ని తీరుస్తుంది. ఈ కవచం అమృతమంత్ర సమూహాలతో కూడుకుని యుంది. పైగా అతి రహస్యమైంది.

ఈ కవచాన్ని జపించి, ధరించి బృహస్పతి బుద్ధిమంతుడయ్యాడు. శుక్రుడు సమస్త దైత్యదానవులకు 'గురువు' అయ్యాడు. వాల్మీకి ముని కవిశ్రేష్ఠుడయ్యాడు. స్వాయంభువ మనువు సర్వపూజ్యుడయ్యాడు. కణాదుడు, గౌతముడు, కణ్వుడు, పాణిని, శాకటాయనుడు, కాత్యాయనుడు శాస్త్రాల్ని రచించారు. కృష్ణద్వైపాయనుడైన వ్యాసుడు వేదాల్ని విభజించి సమస్త పురాణాల్ని రచించాడు.

శాతాతపుడు, సంవర్తుడు, వసిష్ఠుడు, పరాశరుడు, యాజ్ఞవల్క్య మహర్షి ధర్మగ్రంథాల్ని రచించారు. ఋష్యశృంగుడు, భరద్వాజముని, ఆస్తీక మహర్షి, దేవలుడు, జైగీషవ్యుడు, జాబాలి మహర్షి అందరిచేత గౌరవింపబడుతున్నారు.

ఈ సరస్వతీ కవచానికి బ్రహ్మదేవుడు ఋషి, బృహస్పతి ఛందస్సు, శ్రీకృష్ణపరమాత్మ దేవత.

**"యా కుందేందు తుసార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా**
**యా వీణా వరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా**
**యా బ్రహ్మాచ్యుత శంక ప్రభృతిభి: దేవై స్సదా పూజితా**
**సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా"**

ఎవరైతే మల్లెలు, చంద్రుడు, మంచు ముత్యాలహారంగా ఉండి, తెల్లని వస్త్రంతో కూడుకొని ఉన్నదో, ఎవరైతే వీణ యొక్క శ్రేష్ఠమైన దండంచేత ప్రకాశించుచున్న చేతులు కలదో, ఎవరైతే తెల్లని తామరపువ్వుపై కూర్చున్నదో, ఎవరైతే బ్రహ్మ, విష్ణు, శంకరుడు మున్నగు దేవతల చేత పూజింపబడుచున్నదో ఆ సరస్వతి భగవతి నాలో ఉన్నటువంటి జడత్వాన్ని (అజ్ఞానాన్ని) నశింపచేసి, నన్ను రక్షించుగాక!

తర్వాత ఈశ్వరార్చన కళాశీలుడు అగు శ్రీనాథ కవి సార్వభౌముడు నిరంతర శారదోపాసనా సంసక్త చిత్తుడు. అతని హృదయ పీఠముపై ప్రతిష్ఠమైంది 'శారదాదేవి' అని పేర్కొనక తప్పదు. 'శృంగార నైషధ' మందలి సరస్వతీ స్తుతి ఆపాతమధురం, ఆలోచనామృతం.

**సింహాసనము చారుసిత పుండరీకంబు**
**చెలికత్తె జిలువారు పలుకు జిలుక**



**శృంగార కుసుమందు చిన్ని చుక్కల రాజు**
**పసిడి కిన్నెర వీణ పలుకు తోడు**
**నలువ నెమ్మోముదమ్ములు కేళి గృహములు**
**తళుకుటద్దంబు సత్కవుల మనసు**
**వేదాది విద్యలు విహరణ స్థలములు**
**చక్కని రాయంచ యెక్కిరింత**
**యెపుడు నే దేవి కాదేవి యిందుకుంద**
**చంద్ర చందన మందార సార వర్ణ**
**శారదాదేవి మామక స్వాంత వీధి**
**నిందు వేడుక విహరించు చుందు గాత!**

**(శృంగార నైషధం 1-5)**

వికసిత పుండరీకము సింహాసనముగాను జిలిబిలి పలుకులొలుకు చిలుక చెలికత్తెగాను చిన్ని చుక్కల చంద్రుడు శృంగార కుసుమము గాను ధరించి, పసిడి కిన్నెర వీణ పలుకులను సైదోడు గాను, సత్కవుల మనస్సులనే చెక్కుటద్దములుగా ధరించి, చతుర్ముఖుని చతురాననములను కేళీ గృహములుగాను రాయంచనెక్కి వేదాది విద్యలనే యుద్యానవనముల విహరించును. ఇందు కుంద చంద్ర చందన మందార సారవర్ణ శారదాదేవి తన మనోవీధి నిందు వేడుక విహరించుగాక అని శ్రీనాథుడు కీర్తించాడు. అంటే నాకు అఖండ విద్యా ప్రతిభా కవనములను అనుగ్రహించుగాక! అని భావము

తర్వాత సహజ పాండిత్యుడు, ఆంధ్ర మహాభాగవత భవ్య ఫలప్రదాత, మందార మకరంద మాధురీ సముపేత శబ్ద విధాతయైన బమ్మెర పోతనామాత్యులు ఆంధ్ర వాఙ్మయంలో పేరెన్నికగన్న సుకవి. సాక్షాత్తు 'కవితా సరస్వతి' కాటుక కన్నీళ్ళు తుడిచి, లాలించి, బుజ్జగించిన మహాభక్తుడు.

పోతన్న భాగవతాన్ని ఎక్కడ నరాంకితం చేస్తాడోనని భయపడ్డ చదువులమ్మ అతనికి సాక్షాత్కరించింది. అప్పుడు పోతన ఇలా సరస్వతీదేవిని సముదాయించాడు.

**కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో**
**కైటభ దైత్యమర్దనుని గాదిలి కోడల! యోమదంబ! యో**
**హాటక గర్భురాణి! నిను నా కంటికిం గొనిపోయి యల్లక**
**ర్ణాట కిరాట కీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!"**

అంటూ ఆ సరస్వతిని ఓదార్చాడు. సంస్కృతాంధ్ర వాఙ్మయాల్లో ఏ కవికీ దక్కని ఇటువంటి మహద్భాగ్యం ఒక్క పోతన్నగారికే దక్కింది. ఆ తల్లి పోతన్న గారిననుగ్రహించినట్లు ఏ కవినీ అనుగ్రహించలేదంటే అతిశయోక్తి కాదేమో!

అంతేకాక ఆధ్యాత్మిక ప్రపంచంలో విహరించే పోతన ఈ లౌకికత్వాన్ని ఎలా నిరసించాడో గమనిద్దాం.

**ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు కొన్ని పుచ్చుకొని చొక్కి, శరీరము వాసి, కాలు చే**
**సమ్మెట వ్రేటులంబడక సమ్మతితో హరికిచ్చి చెప్పెనీ!**
**బమ్మెర పోతరాజొకడు భాగతంబు జగద్ధితంబుగన్"**

తాను రాసిన భాగవతాన్ని రామాంకితం చేస్తాను గానీ, నరాంకితం చేయనని ప్రతిజ్ఞ చేసిన మహాజ్ఞానశీలి. ఆ సరస్వతీదేవి అనుగ్రహానికై పోతన ఎలా పరితపిస్తాడో కదా! భక్తి సామ్రాజ్యానికి తానే చక్రవర్తియై 'భారతి'ని ఇలా స్తుతించాడు.

**"శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా**
**హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం**
**దార సుధాపయోధి సిత తామర సామరవాహినీ వుభా**
**కారత నొప్పు నిన్ను మది గానక నెన్నడు గల్గు భారతీ!"**

ఈవిధంగా పోతనగారు తనివిదీరా ఆ సరస్వతీదేవిని స్తుతించాడు. శ్రీపంచమిని విద్యారంభ దినంగా బ్రహ్మవైవర్త పురాణం పేర్కొంది. ఈరోజు సరస్వతీదేవిని భక్తిశ్రద్ధలతో 'కాణ్వశాఖ'లో చెప్పబడిన విధి ప్రకారం ధ్యానిస్తారు. సరస్వతీ మంత్రాన్ని జపించి, కవచాన్ని పఠిస్తారు. ఈ సరస్వతీ మంత్రాన్ని జపించలేకపోయినా పై చెప్పిన పోతనగారి పద్యాలనైనా ఈరోజు పారాయణ చేసినా చాలు. ఆ తల్లి అనుగ్రహం కలుగుతుంది. ప్రాచీన సాహిత్యంలో ప్రతి కవి ఆ వాగ్దేవిని భక్తితో ధ్యానించి ఆరాధించి కావ్యాలను వెలువరించారు. కానీ ఈనాడు ఈ సంప్రదాయం కనబడడం తగ్గిపోతుంది.



# తెలుగు సినిమాకు పాటలు రాసిన మహిళామణులు

కె. నవీన్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఫోన్ : 95733 94617

పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగు నేల మీద అడుగు పెట్టిన సినిమా అనేది ప్రారంభం నుండి అందరికీ అందుబాటులో ఉన్నా, లేకున్నా సినిమాపాట మాత్రం ప్రతి ఇంటి తలుపు తట్టింది. ఈ సినిమా పాటకు ఉన్న ఒక గొప్ప గుణం సౌలభ్యం. వి.ఎ.కె. రంగారావు గారి మాటల్లో చెప్పాలంటే **"దారిన పోయే దానయ్యను సైతం గానయ్యను చేసే సౌలభ్యం సినిమా పాటకు ఉంది."** గత శతాబ్ద కాలంలో ఎక్కువ వంతు భారతీయులు చేత అత్యధికంగా ఆరాధించబడే, అభినందించబడే కళ సినిమాయే. అందువల్ల పాట యొక్క ప్రవాహం, ప్రభావం వేగవంతమయ్యాయి.

అంతటి ప్రభావం, ప్రాముఖ్యం ఉన్న సినిమా పాట రాయడం అంత సులభమేమి కాదు. సినిమా పాట అనేది విలక్షణమైన ప్రక్రియ. సాధారణంగా ఒక పాట నిర్దిష్ట సంగీతానికి, లయకు లోబడి సాగుతుంది. కానీ సినిమా పాటకు సన్నివేశం, సందర్భం, కథాగమనం వంటి అదనపు పరిమితులుంటాయి. **"పాటల్లో సినిమా పాట ప్రత్యేకం. చాలా మంది అజ్ఞానులు అనుకున్నంత సులభం కాదు సినిమా పాట రాయడం"** అంటారు శ్రీశ్రీ. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారంతటివారే **"ఇది మనకి అబ్బని విద్య. పాట రాయడానికి ప్రత్యేక ప్రతిభ కావాలి. సినిమా పాట రాయడానికి అంతకు మించి అదేదో కావాలి. అది అందరికీ ఉండదు"** అని అన్నారంటే సినిమా పాట ఎంతటి సంక్లిష్టతతో కూడుకున్న ప్రక్రియనో అర్థం చేసుకోవచ్చు. అందుకేనేమో 90 సం.ల తెలుగు సినిమా చరిత్రలో గేయ రచయితల సంఖ్య దాదాపు 200-300 కి మించలేదు. అయితే అందులో మహిళలను మాత్రం వేళ్ళ మీద లెక్కేయాల్సిందే.

తెలుగు సినిమాలో మొదట కథారచయితలు, మాటలు రచయితలే పాటల మీద కూడా చేయి చేసుకున్నప్పటికీ రాను రాను ప్రత్యేకించి పాటల రచయితలు ఆ పగ్గాలను అందుకున్నారు.అయితే అలా పాటలు రాసిన స్త్రీలు మాత్రం చాలా తక్కువ సంఖ్యలో కనిపిస్తారు. అందుకు ఆనాటి సామాజిక పరిస్థితులు, సినీ పరిశ్రమ పట్ల చిన్నచూపు, సినిమా కళాకారుల పట్ల ఏవగింపు వంటివి కారణాలై ఉండవచ్చు. మొదట్లో నటనా రంగంలో కూడా స్త్రీ పాత్రలను సైతం పురుషులే ధరించేవారు అన్న విషయం మరువకూడదు. అలాంటి పరిస్థితుల్లో కూడా సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టి పాటలు రాసిన మహిళలూ లేకపోలేరు. వీరిలో తొలితరం మహిళల నుండి ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా నా పరిశీలనకు వచ్చిన సినీగేయ రచయిత్రులను, వారి పాటలను కాలక్రమంగా పరిచయం చేయడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**తొలి తెలుగు సినీ గేయ రచయిత్రి :**

తెలుగు సినిమాకు పాటలు రాసిన మహిళలను గూర్చి చర్చిస్తున్నప్పుడు ప్రథమంగా ఉద్భవించే ప్రశ్న **"తెలుగు సినిమాకు పాట రాసిన మొదటి మహిళ ఎవరు?"** అని. తెలుగు సినిమాకి పాట రాసిన మొదటి వ్యక్తి ఎవరనే విషయమై పరిశోధనలు, నిరూపణలు ఉన్నాయి. డా. పైడిపాల సత్యనారాయణ రెడ్డి గారు తొలిసారిగా తన **"తెలుగు సినిమా పాట చరిత్ర, తెలుగు సినీ గేయకవుల చరిత్ర"** పుస్తకాలలో చందాల కేశవదాసు గారిని తొలి తెలుగు సినీగేయ రచయిత గా పేర్కొన్నారు. కానీ తెలుగు సినిమాకు పాట రాసిన మొదటి మహిళ ఎవరనేది ఇంతవరకూ పరిశోధకు లెవరూ తేల్చలేదు.

ప్రముఖ సినీగేయకవి భువనచంద్ర గారు **కౌముది** అనే web magazine వారి 133 వ ప్రచురణ అయిన కలుసుకుందాం-తెలుసుకుందాం, అరుదైన వ్యక్తులు అనే పుస్తకం(పుట 3)లో కొంపెల్ల విశ్వం గారి గూర్చి వ్యాసం రాస్తూ, విశ్వం గారి భార్య జ్యోతిర్మయి గారే తెలుగు సినిమాల్లో మొట్ట మొదటి మహిళా గేయ రచయిత్రి అని పేర్కొన్నారు. జ్యోతిర్మయి గారు 1981 లో వచ్చిన ఓ అమ్మకథ సినిమాలో మొదటి పాట రాసారు. కానీ, అంతకుముందే 1954లో విడుదలైన బాలానందం చిత్రం (మూడు ఉపచిత్రాల సమాహారం)లో న్యాపతి కామేశ్వరి గారు ఒక పాట రాసినట్టుగా వికీపీడియా చెప్తుంది. పైడిపాల గారు కూడా తన తెలుగు సినిమా పాట చరిత్ర పుస్తకం (పుట 388)లో న్యాపతి కామేశ్వరి గారు బాలానందం చిత్రానికి పాట రాసినట్టుగా పేర్కొన్నారు. రేడియో అక్కయ్యగా పేరొందిన కామేశ్వరి గారు ఆంధ్ర బాలానందం సంఘం వ్యవస్థాపనతో సంబంధం కలిగి ఉండడం, వారి అధ్వర్యంలో నే బాలానందం సినిమా రావడం అనేవి పై విషయాన్ని బలపరిచే అంశాలు. ఆ సినిమాలో కామేశ్వరి గారు రాసిన పాట ఏదనేది స్పష్టంగా తెలియకపోయినప్పటికీ, పై ఆధారాలను బట్టి న్యాపతి కామేశ్వరి గారే తొలి తెలుగు సినీగేయ రచయిత్రి అని ఊహిస్తున్నాను. ఈ విషయాన్ని నిరూపించడానికి ఇంకా లోతైన పరిశోధన జరగాల్సి ఉన్నది.

**కె.జి. వసంతాదేవి :**

1966లో సుజాత చిత్ర బ్యానర్ పై విడుదలైన విజయశంఖం సినిమాకి కె.జి.వసంతాదేవి గారు **"దారి కాచి వేచినానురా, రేయి పగలు చూచినానురా"** అనే ప్రణయ గీతాన్ని అందించారు. కనకమేడల, శంకరంబాడి సుందరాచారి వంటి కవులతో కలిసి

వసంతాదేవి గారు ఈ చిత్రానికి పాట రాయడం ఆ నాటికి చాలా గొప్ప విషయం. కె.వి.నందన్‌రావు దర్శకత్వం వహించిన ఈ సినిమాకి బొడ్డు గోపాలం గారు సంగీతం అందించారు.

**వీరమాచనేని సరోజిని :**

ఈమె బుర్రకథ కళాకారిణి. చలనచిత్ర దర్శకుడు వీరమాచనేని మధుసూదనరావు గారి భార్య. తానే స్వయంగా నిర్మించిన చిన్నారి పాపలు చిత్రానికి **"ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాల ఊగాలి ఊగాలి"** అనే లాలి పాటను రాసారు సరోజిని. 1968లో విడుదలైన ఈ సినిమాకి సుప్రసిద్ధ నటి సావిత్రి దర్శకత్వం వహించగా ప్రముఖ గాయని పి.లీల సంగీతం అందించారు. ఈ సినిమాకి నిర్మాణం, దర్శకత్వం, నేపథ్యగాయకులు, ఇతర సాంకేతిక సిబ్బంది అందరూ మహిళలే కావడం చేత పూర్తిగా మహిళలతో తీసిన చిత్రంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది.

**రోహిణి దేవి / రోహిణి చక్రవర్తి :**

ప్రముఖ సంగీత దర్శక, గాయకుడు చక్రవర్తి గారి భార్య శ్రీమతి రోహిణి దేవి. ఈమె 1971 లో విడుదలైన తల్లీకూతుళ్లు చిత్రంలో **"సిగ్గులేని మామయ్య రామచిలుకా/ పైట చెంగు లాగాడు రామచిలుకా"** అనే పాటతో పాటు 1983లో చిరంజీవి హీరోగా వచ్చిన పల్లెటూరి మొనగాడు సినిమాకి **"గుండెగది ఖాళీ, ఉండి పోతావా"** అనే పాటను కూడా రాసారు. ఈమె రాసిన ఈ రెండు సినిమాలకి సంగీత దర్శకులు చక్రవర్తి గారే కావడం విశేషం.

**ఝాన్సీ :**

1980లో విడుదలైన నీతిగా చచ్చి బతుకు సినిమా కోసం ఝాన్సీ గారు రాబిన్‌చంద్ర సంగీతంలో **"వింటావా నా వ్యథ, కాదిది హరికథ"** అనే చక్కటి భావగీతాన్ని రాసారు.

**జ్యోతిర్మయి :**

వేటూరి శిష్య సమానురాలిగా సినిమా రంగంలో ప్రవేశించిన మరో గేయరచయిత్రి జ్యోతిర్మయి. ఈవిడ ప్రముఖ గేయరచయిత కొంపెల్ల విశ్వం గారి భార్య. 1981లో విడుదలైన ఓ అమ్మకథ సినిమాతో సినీరంగ ప్రవేశం చేసారు. జ్యోతిర్మయి అనేది విశ్వం గారి కలం పేరని ఒక వాదన ఉన్నా ఆ సినిమా టైటిల్ కార్డ్స్‌లో "శ్రీమతి జ్యోతిర్మయి" అని చాలా స్పష్టంగా రాయబడింది. కాబట్టి అది నిర్హేతుక వాదన అని తెలుస్తుంది. ఈ సినిమాకి గాను ఎస్.పి.బాలు గారి సంగీతంలో **"అలుమగల బంధానికి మేలుకొలుపు"** అనే చక్కటి పాటతో సినీరంగ ప్రవేశం చేసారు జ్యోతిర్మయి. ఈ పాటని ప్రముఖ గాయని జానకి ఆలపించారు. దీనితోపాటు రాధాకళ్యాణం (1981) సినిమాలో **"చేతికి గాజుల్లా"** అనే పాటని, మూడు ముళ్లు(1983) సినిమాలో **"లేత చలిగాలులు"** పాటని, పెళ్లి చూపులు (1983) సినిమాకి **"చిటికెలో చిలుకలా కథ చెబుతాను"** పాట, చిరంజీవి తొలి చిత్రం దేవాంతకుడు (1984)లో "ఆకేసి పీటేసి ముంగిట్లో ముగ్గేసి" వంటి ప్రణయ గీతాలను రచించారు. ఆ కాలంలో కొంత స్థిరంగా రాణించిన మహిళా రచయిత గా ఈమెను పేర్కొనవచ్చు.

విజయలక్ష్మి:-

1982లో విడుదలైన విప్లవ శంఖం చిత్రంలో విజయలక్ష్మి గారు "కులం కులం అని కుచ్చితాలు పెంచుకోకు" అనే సంఘసంస్కరణ గీతాన్ని రాసారు. మాదాల రంగారావు నిర్మించిన ఈ చిత్రానికి బీరం మస్తాన్ రావు దర్శకులు గా ఉన్నారు.

రాణి పులోమజాదేవి:

2007లో బుల్లెబ్బాయి సినిమాతో సినీరంగ ప్రస్థానం ప్రారంభించిన రాణి పులోమజాదేవి గారు కేవలం 8 ఏళ్ళ కాలంలోనే 60 సినిమాలకు పైగా పాటలు రాసారు. లలిత గీతాలతో కలుపుకొని మొత్తం 789 పాటలు రాసిన ఈమె, అత్యధిక పాటలు రాసిన మహిళా రచయిత్రి గా గిన్నీస్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఐస్‌క్రీం, జెంటిల్మెన్, శ్రీనుగాడు, జాదూగాళ్ళు, వంటి హిట్ సినిమాలు ఈమె ఖాతాలో ఉన్నాయి. తన మొదటి చిత్రంలోనే సింగిల్‌కార్డ్ రాయడం ఒక విశేషం అయితే పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్ర పోషించిన జెంటిల్మెన్ సినిమాలో ఇంగ్లీష్ డ్యూయెట్ ను కూడా రాయడం వీరి ప్రతిభకు గీటురాయి.

శ్రేష్ఠ:

2012లో ఒక రొమాంటిక్ క్రైమ్ కథ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన శ్రేష్ఠ తన మొదటి సినిమాకే అన్ని పాటలు రాసే అవకాశం చేజిక్కించుకుంది. ఈమె స్వస్థలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. కాబట్టి ఈమెనే తొలి తెలంగాణ సినీగేయ రచయిత్రి గా పలువురు పరిశోధకులు పేర్కొంటున్నారు. అర్జున్ రెడ్డి, పెళ్ళి చూపులు, కో అంటే కోటి, కొరియర్ బాయ్ కళ్యాణ్, దొరసాని, యుద్ధం శరణం, హలో, అభిమన్యుడు, ప్రెషర్ కుక్కర్ మొదలగు 20 కి పైగా సినిమాల్లో పాటలు రాసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అర్జున్ రెడ్డి లో ఈమె రాసిన "మధురమే ఈ క్షణం" అనే పాట చాలా పెద్ద హిట్టయ్యింది. ఈ పాట తర్వాత సినీ పరిశ్రమలో శ్రేష్ఠ ఓ వెలుగు వెలిగింది. ఇదే సినిమాలో "గుండెలోన పొంగుతున్న" అనే మరో పాటను రాయడమే కాకుండా స్వయంగా తానే స్వరపర్చడం విశేషం

పింగళి చైతన్య:-

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య గారి మునిమనవరాలు పింగళి చైతన్య. ఈమె 2017 లో తాను కోరైటర్ గా పనిచేసిన ఫిదా సినిమాలో "ఊసుపోదు ఊరుకోదు" పాట ద్వారా గేయరచయిత్రి గా పరిచయం అయ్యారు. ఈ ఒక్క పాటతోనే లిరిసిస్ట్ గా విశేష జనాదరణ సంపాదించారు. ఇదే సినిమాలో "ఫిదా

ఫిదా” అనే టైటిల్ సాంగ్ తో పాటు నేలటికెట్టు, లవ్‌స్టోరీ, మసూద వంటి పలు చిత్రాలకు సాహిత్యం అందించారు. ఈమె రాసిన చిట్టగాంగ్ విప్లవ వనితలు కథాసంపుటికి గాను 2016 లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం వరించింది.

వీరితో పాటు రమాదేవి – మాయ (2014), కిరణ్మయి – మిస్సింగ్ (2006), కొండముది అనురాధ – పవన్ సుబ్బలక్ష్మి ప్రేమించుకున్నారట (2014), పి.సూర్యకుమారి – స్టూడెంట్ పవర్ (2018), చల్లా భాగ్యలక్ష్మి – ఒక్కడొచ్చాడు (2016), అమరావతి అమ్మాయి (2017), పెళ్ళిరోజు(2017) మొదలగు వారు ఇటీవల సినిమాలకు పాటలు రాస్తున్నారు. ఇప్పుడిప్పుడే అవకాశాలను అందిపుచ్చుకుని చాలామంది యువ రచయిత్రులు పురుషులతో పోటీపడి సినీ పరిశ్రమలో రాణిస్తున్నారు. అందులో లక్ష్మీ ప్రియాంక, కదలి చెప్పుకోదగ్గవారు. ఇప్పటికే లక్ష్మీ ప్రియాంక – సప్తగిరి LLB, గౌతమి, అమీర్‌పేట్ టు అమెరికా వంటి పలు సినిమాలకు రాయగా, కదలి – ముగ్గురు మొనగాళ్లు, మై ఇండియన్ బాయ్‌ఫ్రెండ్, Mr.కింగ్ సినిమాలకి రాసింది.

ఇదంతా కేవలం నా పరిమిత పరిశీలనలో తెలియవచ్చిన సమాచారం మాత్రమే. 1980 దశకంలో ప్రణవి, సీతాదేవి వంటి మరికొన్ని పేర్లు కనిపిస్తున్నా సరైన ఆధారాలు లేని కారణంగా ఇక్కడ పేర్కొనలేదు. ఈ అంశంపై విస్తృతస్థాయి పరిశోధన గనక జరిగినట్లయితే తెలుగు సినీగేయ రచయిత్రుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. తెలుగు సినిమాకి పాట రాసిన మొదటి వ్యక్తి చందాల కేశవదాసు గారు అని చెప్పటానికి పరిశోధనలు, నిరూపణలు ఉన్నప్పటికీ మొదటి మహిళ ఎవరనేది ఎవరూ పట్టించుకోలేదు. ఈ రంగంలో మహిళలు చాలా తక్కువ ఉన్నారు అనే కారణం చేత వారి మీద పరిశోధన పూర్తిగా విస్మరించబడింది. తెలుగు సినిమాకి పాటలు రాసిన మహిళలు చాలా తక్కువ మందే ఉన్నపటికీ మొత్తానికే లేకపోలేరు. కాబట్టి ఉన్న కొద్దిమందిని అయినా వెలుగులోకి తీసుకొచ్చి వారి కృషిని రికార్డు చేయవలసిన అవసరం ఉంది. అందుకు అకడమిక్ స్థాయిలో పరిశోధన జరగడానికి విశ్వవిద్యాలయాలు పూనుకోవాలి.

**ఆధార గ్రంథాలు :**

1. డా.పైడిపాల, తెలుగు సినిమా పాట చరిత్ర. బెంగళూరు: సునయన పబ్లికేషన్స్, 2011
2. భువనచంద్ర, కలుసుకుందాం– తెలుసుకుందాం అరుదైన వ్యక్తులు. కౌముది 133 వ ప్రచురణలు, అంతర్జాల పత్రిక, 2013
3. కొల్లూరి భాస్కరరావు, ఘంటసాల గళామృతం బ్లాగు. 2009
4. సాక్షి దినపత్రిక, 27 జూలై 2013
5. ఆంధ్రజ్యోతి దిన పత్రిక, 22 సెప్టెంబర్ 2013
6. BBC NEWS తెలుగు, 8 మార్చి 2021
7. Indiancine.ma వెబ్‌సైట్
8. డా. మంగు రాజా, rajamusikbank.com వెబ్‌సైట్
9. moviegq.com వెబ్‌సైట్
10. wikipedia.org (వికీపీడియా) వెబ్‌సైట్
11. ఆంధ్రజ్యోతి దినపత్రిక, 25 డిసెంబర్, 2016
12. telugu.com వెబ్ సైట్
13. ఈనాడు దినపత్రిక, 10 సెప్టెంబర్ 2017



**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం ‘శిలాక్షరం’.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 43 హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు-2

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

చాలామంది కొన్ని సార్లు ఊహించని సమస్యల్లో ఇరుక్కుంటారు. వారి చుట్టూ శత్రువులు కమ్ముకుని భయానికి గురిచేస్తారు. అప్పుడు రక్షించే వారు కనిపించకుంటే ఉన్న శత్రువులలోనే ఒకరిని హితునిగా మలచుకుని సహాయం పొందాల్సి వస్తుంది. సహకరించడానికి అంగీకరించాలంటే ఎదుటి వారికి కూడా వీరితో ఏదో అవసరం ఉండాలి. అంటే వారు కూడా ఏదో సమస్యల్లో ఉన్నవారై ఉండాలి. అయితేనే వారు ఇంకొకరికి సహకరించడానికి, స్నేహానికి అంగీకరిస్తారు. ఇదంతా అవసరానుకూల స్వార్థపూరిత స్నేహ సహకారాలే కాని నిజమైనవి కావు. కాబట్టి అటువంటి వారిని ఎంత వరకు నమ్మాలి, వారితో ఎంత జాగ్రత్తగా వుండాలి అనేది బాగా ఆలోచించాల్సిన విషయం. ఇలాంటి విషయాన్ని ధర్మరాజు భీష్ముడిని ప్రశ్నగా అడిగాడు.



**1వ ప్రశ్న. "బలవంతులైన శత్రువులు ఎక్కువ సంఖ్యలో మీదికి వస్తే బలహీనుడు తనను తాను ఎలా రక్షించుకోవాలి"** (శాంతి. 3.202)

ఈ ప్రశ్నకు భీష్ముడు **'మూషిక మార్జాలంబుల సంవాదం'** వినిపిస్తాడు. ఈ సంవాదం పశుపక్ష్యాదుల సంభాషణాత్మక కథ అయినప్పటికీ చక్కని నీతిని అందిస్తుంది.

అడవిలో ఒక మర్రిచెట్టుకింద వేటగాడు ఉచ్చుపెట్టిపోయాడు. అతడి పేరు పరిఘుడు. ఆ చెట్టు ప్రాంతంలో ఉన్న పిల్లి ఉచ్చులో పడింది. దాని పేరు పలితుడు. అది చూసి కలుగులో నుంచి ఎలుక మేతకోసం స్వేచ్ఛగా బయటకు వచ్చింది. ఎలుక పేరు రోమశుడు. అంతలోనే అక్కడకు చేరుకున్న చంద్రకుడు అనే గుడ్లగూబ, హలికుడు అనే ముంగిసలను ఆ ఎలుక చూసింది. అవి ఎలుకను చూసాయి. వాటినుంచి రక్షించుకోవడానికి ఎలుక పిల్లిని సమీపించింది. అది చూసి ముంగిస, గుడ్లగూబలు వెనుదిరిగి పోయాయి. ఇప్పుడు ఉచ్చులో ఉన్న పిల్లి, పిల్లిని ఆశ్రయించిన ఎలుక ఒకదానికొటి అత్యంత తెలివితో రక్షించుకోవల్సి వచ్చింది.

ఎలుక, పిల్లి, గుడ్లగూబ, ముంగిస ఒకరికొకరు శత్రువులు. ఇక్కడ ఎలుకకు మాత్రం ముగ్గురు శత్రువులు. ఈ ముగ్గురి నుండి రక్షించబడాలంటే వారిలో ఒకరే రక్షించాలి. కాని వేరే అవకాశం లేదు. అందుకని శత్రువులలో కూడా ఆపదలో ఉన్నవారిని ఆశ్రయించాలని నిర్ణయించుకుంది. పిల్లి దగ్గరకు వెళ్లింది. అది చిక్కుకున్న ఉరులను తెగకొరికి, విముక్తుడిని చేస్తా అని పలికింది. ఎలుకకు ముంగిస, గుడ్లగూబ వల్ల ఉన్న అపాయాన్ని, భయాన్ని కూడా చెప్పింది. పిల్లి అంగీకరించింది. తనను చూస్తే ముంగిస, గుడ్లగూబ భయపడి తనదగ్గరకు కూడా రావు అని చెప్పింది. రెండింటి మధ్య సంధి కుదిరింది. రెండింటి ప్రాణహాని తీరిందని అనుకున్నాయి. వెంటనే ఏమి ఆలోచించకుండా ఎలుక వచ్చి పిల్లి పొదిగిట్లో కూర్చుంది. అది చూసిన ముంగిస, గుడ్లగూబలు వాటి తోవన అవే వెళ్ళిపోయాయి. అవి తిరిగిపోవడం చూసి ఎలుక సంతోషించింది. వల(ఉచ్చు)ను వెంటనే గబగబ కొరకకుండా జాప్యం చేస్తూ మెల్లగా కొరుకుతుంది. ఈ విషయాన్ని గమనించిన పిల్లి ఎలుకను "నా వలన ప్రయోజనం పొందిన నీవు ఉరులను తెగ కొరకకుండా జాప్యం చేయడం తగుతుందా?" అని ప్రశ్నించింది. దానికి ఎలుక "నీకు ఆపదను కలిగిస్తానా? కీడు తలపెట్టడం మంచిపని కాదు. నా భయం కొద్దీ నిన్ను నేను నమ్మలేక ఉరులను తెంపలేక పోతున్నాను. మనస్సులో తప్పు పట్టవద్దు. వేటగాడిని చూడగానే ఉరులను తెగకొరుకుతాను" అని తెలివిగా సమాధానం ఇచ్చింది.

అంతేకాదు **"ప్రబలుఁడైన యతనితో వెరవున సంధి యొనర్చియుఁ గరంబు నమ్మమియ నీతిగాఁగొంద్రు బుధుల్"** (శాంతి. 3.214) బలవంతుడైన వాడితో ఉపాయంగా పొత్తు పెట్టుకున్నప్పటికీ, అతడిమీద ఎక్కువ నమ్మకం ఉంచుకొనడటం నీతి కాదంటారు తెలిసినవాళ్ళు అంటూ గొప్ప నీతి వాక్యం కూడా చెప్పింది. వేటకాడిని చూడగానే తెగ కొరుకుతాను. అప్పుడు నీవు చెట్టుమీదకు, నేను కలుగులోకి వెళ్ధాము. ఇదే చేయవలసిన పని అంటూ **"...ముచితకాలభావ్యమైన యత్నవిధి గదా సమగ్ర ఫలత్వంబు నొందు..."** (శాంతి. 3.217) అని ఎలుక తెలుపుతుంది. అంతలో వేటకాడు వచ్చాడు. అతడు రావడం చూసి ఎలుక వేగంగా ఉచ్చును గబగబ కొరికివేసింది. పిల్లి చెట్టుమీదికి, ఎలుక కలుగులోనికి పరుగెత్తుకు పోయాయి. తదనంతరం చక్కని ఆపద్ధర్మ వాక్యాలతో పిల్లి ఎలుకల మధ్య సందేశాత్మక సంభాషణ జరుగుతుంది.

**"మేలు చేసి, తగిన స్నేహితుడిని సంపాదించుకున్నాక, వారి మంచిగుణాల సుఖం అనుభవించకుండా విడిగా ఉండడం నీతిమంతుల లక్షణం కాదు. నన్ను నమ్మావు. నాకు మేలు చేసావు. ఇప్పుడు భయపడడం, నమ్మకపోవడం మంచిది కాదు. నాతో కలిసి ఉండు. బలవంతులైన నా చుట్టాలూ, నేను నీకు సాయం చేస్తాం. కలిసి మెలిసి వుందాం"** అని పిల్లి అంటుంది.

పిల్లిని నమ్మలేని ఎలుక ఇలా అంటుంది. "**బలవద్రిపులు ప్రయోజనములకై లోఁబడుట గల్గు...**" (శాంతి.3.229) బలవంతులైన పగవాళ్లు వారి స్వార్థం కొద్ది లోబడుతారు. కాబట్టి తనకన్న బలవంతులైన పగవారిని అంత తొందరగా నమ్మి మోసపోగూడదు. ఇక్కడ 'బలవంతులు' అనేది శరీర బలం మాత్రమే కాదు. ధన బలం, అధికార బలం, కొన్ని సార్లు కులబలం కూడా కావచ్చు. వీరు వారి స్వార్థం కోసం కిందివారితో స్నేహం చేస్తారు. వారి ప్రయోజనం నెరవేరగానే మూర్ఖంగా ప్రవర్తిస్తారు అనేది చాలా వరకు నిజం.

"**అరియెడ మిత్రభావ మొక యప్పుడు కార్యము పొంటెఁగల్గిన / స్వైరవునఁబాముఁ బట్టునెడ నిక్కము నమ్మక దాని వాతికిం / గరము దొలంగఁజేయునరు...**" (శాంతి.3.230) శత్రువు ఎప్పుడు ఎలా ఉంటాడో తెలియదు. అవసరాన్ని బట్టి మిత్రునిగా కనిపిస్తాడు. కాని నమ్మడం మంచిది కాదు అంటూ చక్కని ఉదాహరణ ఇస్తాడు. పాములను పట్టేవాడు దానిని పట్టిన వెంటనే నమ్మక దాని నోటిలో చేయిపెట్టి విషపు కోరలను తొలగించే వాడి వలే ఉండాలి అనేది ప్రత్యేకాంశం. ఈ విషయాన్ని చిలకమర్తి గయోపాఖ్యానంలో గమనించవచ్చు.

"**ఆత్మలాభ పరాయణులగుచు నరులు**
**ప్రాణమిత్రులవలెనె గన్పట్టుచుందు**
**రవసరము దీఱ నందరు నడగుచుంద్రు;**
**నిజహితుఁడు లేఁడవనిలో నిశ్చితంబు.**" (మరువరాని మాటలు. పు.392)

వీరు ఏకంగా నిజమైన స్నేహితులే ఈ లోకంలో లేరని నిశ్చయిస్తున్నారు. అలాంటప్పుడు ఆపద సమయంలో కొంతసేపు ఆత్మీయంగా అనిపించగానే మిత్రుడనుకొని నమ్మడం మూర్ఖత్వమే అవుతుంది.

**"విను! నీ కామిష మేను; నీ యెడఁ గడున్ విశ్వాసముం బూని చే**
**రిన నీ చిత్త మొకప్పుడుద్గతవికారీభూతమై దుర్వినో**
**దనహింసారుచి నొందు; నీ సుతసుహృద్బంధుప్రజంబేని మున్**
**ననుఁగన్నన్‌సహియింప దాత్మఁగరుణ; న్నన్నింపుమిట్లుండెదన్."**
(శాంతి.3.231)

ఇక్కడ ఎలుక తెలివితేటలవల్ల ఆపద్ధర్మంగా పాటించవల్సిన అంశాలు కనిపిస్తాయి. ఎలుక పిల్లికి మాంసాహారం. పిల్లిని అంతగా నమ్ముకుంటే మనసు ఎప్పుడైనా మారవచ్చు. తినాలనే కోరిక కలిగితే కలుగవచ్చు. అందుకే ఉచ్చు తెంచిన తదనంతరం ఎలుక పిల్లితో స్నేహానికి అంగీకరించదు. మనసు మారడం అనేది అన్ని ప్రాణులలో జరిగే పరిణామమే. తనకు ఏ సుఖాన్ని పొందే అవకాశం ఉన్న తనకంటే కిందివారిపై అఘాయిత్యం చేయడానికి కూడా వెనుకాడరు. దానిని దృష్టిలో పెట్టుకుని తనకంటే బలవంతులతో నడచుకోవాలి. ఈ విషయాన్ని మరో పద్యంలో...

"**బలవంతుఁడైన శత్రుని**
**వలనఁ బ్రయోజనము గలిగి వలను కలిమిఁదాఁ**
**గలిసియు నది గడచనఁగాఁ**
**దొలఁగ వలయు; నమ్మెనేనిఁదుదిఁ గీడొలయున్.**"
(శాంతి.3.238)

బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేసినా ఆ అవసరం తీరగానే అతడి స్నేహాన్ని వదలుకోవాలి. ఒకవేళ నమ్మితే చివరకు ఆపద కొని తెచ్చుకోక తప్పదు అనే శుక్రవాక్యాలను తెలియజేస్తుంది.

"**నమ్మఁదగనివారి నమ్మక యున్నది**
**తగిన వారినైనఁ దద్ద నమ్మి**
**యుండఁ దగదు; తన్ను నొరులు నమ్మెడు నట్ల**
**యుండి యొరుల నమ్మకునికి నీతి.**" (శాంతి.3.239)

నమ్మని వాళ్ళను నమ్మనేకూడదు. నమ్మినవాళ్ళను కూడా ఎంత వరకు నమ్మాలో అంతే నమ్మాలి. ఇతరులు తనను నమ్మేటట్లు నడుచుకుంటూనే తాను వాళ్ళను నమ్మకపోవడం నీతి అంటుంది.

ఏ ప్రయత్నమైనా సరైన సమయంలోనే చేయాలి. అప్పుడే అది సత్ఫలితానిస్తుంది. ఎంతటి ఆపద సమయం సంభవించినప్పటికీ ఎదుటి వారిని చూసి ముందడుగు వేయాలి. శత్రువులు చుట్టు పొంచి ఉన్నప్పుడు వారిలోనే మన అవసరం ఉన్నవారితో స్నేహం ఏర్పరచుకోవాలి. ఆ ఒక్కరితో లొంగిపోవాలి. కాని ఆ స్నేహాన్ని కొంతకాలం వరకే నమ్మాలి. ఎంతటి వారిలోనైనా వంచన గుణాలుంటాయి. వాటిని పసిగట్టి తగినరీతిలో ఉండడం ప్రధానం. ముఖ్యంగా తనకంటే బలవంతునితో తగు జాగ్రత్తగా మెదలడం ఉచితం. బలవంతులు ఆపదలో ఉన్నపుడు తనకంటే బలహీనుల సహాయ సహకారాలు తీసుకోవడానికి వెనుకాడరు. అంతమాత్రాన బలహీనులు దానికి పొంగిపోయి, అది గొప్పగా భావించి వారిని పూర్తి స్థాయిలో నమ్మకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి చక్కని సందేశాలను ఈ సమాధానం అందిస్తుంది.

మూలభారతం ఈ ఘట్టంలో ఇంకా కొన్ని నీతి వాక్యాలు అదనంగా కనిపిస్తాయి. ప్రత్యేకించి మిత్ర శత్రులకు సంబంధించినవి. **"అర్థయుక్త్యా హి జాయంతే పితా మాతా సుతస్తథా..."** (శ్రీమహాభారతము, శాంతిపర్వము, అధ్యా-138.శ్లో-143) తల్లి, తండ్రి, కొడుకు మొదలుకొని ఎవరైన ప్రయోజనాన్ని బట్టే సన్నిహితులవుతారు. శత్రువని ఎవరూ ఉండరు. అట్లాగే మిత్రువులూ అని ఉండరు. అందరు అవసర నిమిత్తమే ఏర్పడతారు అని తేల్చి

చెప్తుంది. **"నాస్తి జాతు రిపుర్నామ మిత్రం నామ న విద్యతే । / సామర్థ్య యోగాజ్జాయంతే మిత్రాణి రిపవస్తథా ॥"** (శ్రీమహాభారతము, శాంతిపర్వము, అధ్యా-138. శ్లో-138). మిత్రులను తెలుసుకోవాలి. శత్రువులను కనిపెట్టాలి. శత్రురూపంలో మిత్రులుంటారు. మిత్రరూపంలో శత్రువులుంటారు. కొంతకాలం అయ్యేసరికీ మిత్రువులు శత్రువులు కావచ్చు, శత్రువులు మిత్రులు కావచ్చు. వంటి విలువైన వాక్యాలను మూలంలో గమనించవచ్చు.

❖ ❖ ❖ ❖ ❖

ఎవరికైనా, ఎప్పుడైనా అధికబలం కలిగినవారు శత్రువుంటే ఆ సమయంలో కొంత అణిగి మణిగి ఉండాలి. ఏ బలం అయినా, ఎవరికీ శాశ్వతం కాదు. ఏదైనా కొంతకాలమే. బలహీనులు వారి బలాన్ని ఎదుటి వారి బలాన్ని అంచన వేసుకుని కూడా విర్రవీగడం మూర్ఖత్వం. ఎక్కడ తగ్గాలో తెలియని వారు సమస్యల పాలవుతారు. ఇలాంటి అంశానికి సంబంధించినదే ఒకటి ధర్మరాజు ప్రశ్న ఉంది.

**ప్రశ్న 2. "శత్రురాజు అధికబలం గలవాడైతే, అల్పబలం గల రాజు ఆపదల నుండి ఎట్లా గట్టెక్కగలుగుతాడు?"** (శాంతి. 3. 85).

దానికి సమాధానంగా భీష్ముడు **'సముద్ర సరిత్సంవాదం'** చెప్తాడు. నదులకు సముద్రానికి మధ్య ఈ సంవాదం జరుగుతుంది.

ఇందులో సముద్రం **"మీరు మంచి ఉరవడితో పొంగిపొర్లి పారేటప్పుడు మీ గట్లమీది చెట్లు కూలిపడిపోతుంటాయి కదా! మరి నదుల మధ్యలో ఉండే ప్రబ్బలిచెట్లు పడిపోవేమిటి? అవి మిమ్మల్ని ఏమైనా సంతృప్తి పరిచాయా ఏమి?"** అని నదులను సరదాగా ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నకు గంగానది సమాధానం తెలుపుతుంది.

నది గట్లమీద ఉన్న చెట్లు నది ప్రవహిస్తున్నపుడు వాటి బింకం సడలనీయకుండ నిలబడుతాయి. అందువల్ల అవి నీటి వేగాన్ని తట్టుకోక నిట్టనిలువున వేర్లతో పాటు పెకిలించబడి కూలిపోతాయి. అదే ప్రబ్బలి చెట్లు నది మధ్యలో ఉన్నప్పటికి నదుల వేగాన్ని బట్టి వంగి ఉంటాయి. ఉధృతి తగ్గగానే తిరిగి నిలబడుతాయని నది తెలుపుతుంది. అదేవిధంగా...

**"అరి నృపాలు పెంపు నాత్మీయ శక్తియు**
**నెఱింగి మూర్ఖవృత్తి నెదురుపడక**
**యుచిత వృత్తి నతని యుద్ధతి మేవడి**
**గడపి హీన బలుఁడు సెడక నిలుచు."** (శాంతి. 3. 90)

ఆపద సమయంలో బలహీనుడైన రాజు తన బలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ అంచనా వేసుకోవాలి. పగవాడి మిడిసిపాటును యుక్తిగా దాటవేయాలి. అపుడే ఆ రాజు ఎలాంటి చెరుపూ లేకుండా నిలబడగలుగుతాడు అనే విషయం పై పద్యం వల్ల తెలుస్తుంది. ఈ విషయాన్ని భగవద్గీతలో గమనించవచ్చు. **"యావదేతాన్నిరీక్షేఽహం యోద్ధు కామానవస్థితాన్..."** (భగవద్గీత. 1. 22) శత్రువులతో తలపడుటకు ముందు వారి బలాబలాలను గమనించుకోవాలి. ఇలా గమనించుకోవడం ఉత్తముల లక్షణం. అందుకే అర్జునుడు రెండు సేనల మధ్య రథాన్ని నిలుపుమంటాడు. మన బలాన్ని ఎదుటి వారి బలాన్ని అంచన వేసుకున్న తర్వాతే మనం దేనికైన సిద్ధం కావాలి. ఈ విషయం లోక వ్యవహారంలో కూడా **'కయ్యము, వియ్యము, నెయ్యము సమానులతోనే చేయాలి'** అనే మాట ప్రచారంలో ఉంది. అంటే ఇక్కడ మనకంటే అధికులతో ఏ విషయంలోను తలపడడం మంచిది కాదని గమనించాలి. అదే ఆపత్కాల ఆలోచన ధర్మం. ఆపద సంభవించిన సమయంలో అణిగి, మణిగి ఉండడమే ధర్మంగా కనిపిస్తుంది. అందరికీ తెలిసిన వేమన పద్యం **"అనువుగాని చోట నధికుల మనరాదు..."** అన్నట్లు సమయానుకూలంగా మసలుకోవడం మానవ కర్తవ్యంగా గమనించవచ్చు. అట్లాగే భర్తృహరి నీతి శతక అనువాద పద్యం **"ఒకచో నేలను పవ్వళించు..."** వాక్యంతో ప్రారంభమయ్యే పద్యం లక్ష్య సాధనకోసం తనను తాను మలచుకున్న విషయం గుర్తుకు వస్తుంది. ఈ విషయం అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికి రాజులకు, సామాన్య మానవులకు అందరికి ఉపయోగకర అంశం.

ఎదుటివారి సామర్థ్యాన్ని అంచనా వేసి తనకంటే బలవంతుల ముందు తలవంచుకోవడం మంచిది. దీనికి పై కథలో వంగిన తుంగ గడ్డి ఆదర్శం. నిండుగా పారినపుడు ఎంతగా వంగుతుందో నీరు తగ్గిన కొలది తల ఎత్తుకు నిలబడతుంది. చివరకు ఆ నీరు ప్రవాహం (బలం) తగ్గిన తర్వాత తన వేర్లను అడ్డంగా ఉంచి ఆ నీరును పారకుండా కూడా చేస్తుంది. సామర్థ్యం తెలుసుకుని తగ్గుతున్నారంటే అవకాశం ఎదురుచూస్తున్నారు, వెతుక్కుంటున్నారని అర్థం. **"సారాసారం బలం వీర్యమ్ ఆత్మనో ద్విషతశ్చ యః । / జానన్విచరతి ప్రాజ్ఞః న స యాతి పరాభవమ్ ॥"** (శ్రీమహాభారతము, శాంతిపర్వము, అధ్య-113, శ్లో-13) అనే శ్లోకంలో తెలియజేసినట్లు శత్రువు, తన సారాన్ని - అసారాన్ని, బలాన్ని - పరాక్రమాన్ని గుర్తించి నడుచుకునే ప్రాజ్ఞుడు పరాభవాన్ని పొందదు.

**ఆధార గ్రంథాలు :**

1. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

2. రామకృష్ణమూర్తి తిప్పాభట్ల. శ్రీనివాసులు సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

3. హనుమంతరాయ శర్మ బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

4. అప్పలస్వామి పురిపండా. **'వ్యావహారికాంధ్ర మహాభారతం'** (శాంతి పర్వము). 1976. రాజమండ్రి : ప్రాచీన గ్రంథావళి.

5. లక్ష్మీనారాయణ గంగిశెట్టి. **'భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు'** 1986. హైదరాబాద్ : తెలుగు విశ్వవిద్యాలయం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal


# పద్యమనోహరం - 41

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448




పద్యము భారతీహృదయ పద్మము, వాఙ్మయదివ్యసద్మమున్
పద్యము తెల్గువాని రసవాద్యము, సంస్కృతివైభవాల వై
శద్యము, హృద్యమాద్యము, స్వజాతికి నర్పితమైన స్వాదు నై
వేద్యము, సర్వదా విబుధ వేద్యము, దండము పద్యవిద్యకున్

తెలుగు పద్యం చిరంజీవి. శతాబ్దాలు గడచినా కొత్తకొత్త ప్రక్రియలు తెలుగు సాహిత్య ప్రపంచంలో వచ్చాయి. వస్తున్నాయి. వచ్చినంత వేగంగా మాయమైపోతున్నాయి కూడా. కాని పద్యప్రక్రియ మాత్రం కాలనుగుణమైన మార్పులను తనలో పొదిగించుకొని నేటికీ కొనసాగి వస్తూనే ఉంది.

అవధానాల్లో పద్యమే ప్రధానం. సుప్రసిద్ధ శతావధాని డా.జి.ఎం.రామశర్మ ఒకానొక అవధానంలో పద్యప్రాముఖ్యాన్ని గురించి, పద్య ప్రాభవాన్ని గురించి ఈ పద్యం చెప్పారు.

“పద్యమనేది సాక్షాత్తూ ఆ చదువుల తల్లి సరస్వతీ మాత హృదయ పద్మమే నన్నారు. అది వాఙ్మయం యొక్క నిత్య నివాస గృహము. అంతేకాదు తెలుగు వాళ్ళు వినిపించే రసభరిత వాద్యవిశేషము, మనం సంస్కృతీవైభవాన్ని విశదపరచే గొప్ప ప్రక్రియావిశేషము.

ఆద్యంతము హృద్యమైన ఈ పద్యమనే అంశం తమ స్వీయ అస్తిత్వాన్ని తెలుపుకునే విషయానికే సమర్పింపబడిన పవిత్రమైన నైవేద్యము. పండితులందరికీ మిక్కిలి గౌరవప్రదమైన ప్రక్రియ. అందుకే ఈ పద్య విద్యకు నమస్కారము.” అంటూ పద్య ప్రశంసచేసిన శతావధాని మాటలు అక్షరరాక్షర సత్యాలే.

“గాసట బీసటే చదివి గాథలు త్రవ్వ” కాలాన్ని గడుపుకుంటున్న తెలుగు వారికి ఒక మహా రచనకు శ్రీకారం చుట్టిన నన్నయ భాట్టారకులవారు ఏసుముహూర్తంలో దీన్ని “పద్యవిద్య” అన్నారో గాని, నిజంగానే పద్యరచన ఒక ప్రత్యేకమైన విద్యయే నన్నది నిస్సందేహంగా గొప్ప సత్యమే.

‘విద్య’కు ఎప్పుడూ కాలదోషం పట్టదు. విద్యను ఎంతగా తొలగించుకోవాలన్నా తొలగిపోదు. పైగా ఆ ప్రయత్నాలనన్నింటినీ అధిగమించి అదొక శాశ్వత సత్యమై నిలుస్తుంది. ఇప్పుడు పద్యప్రక్రియ సాహిత్య ప్రపంచంలో తిరుగులేని మహోన్నత సత్యమై ప్రకాశిస్తుంది. అందుకే డా. రామశర్మ ఇది వాగ్దేవి హృదయమన్నారు. ఇదే సాహిత్యానికి స్థిరనివాసమన్నారు. ఇది తెలుగు మాధుర్యాన్ని గొప్ప వాద్యంగా పేర్కొన్నారు. మన సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే ప్రక్రియని అవధాని అభిప్రాయపడ్డారు. అన్ని విధాల గౌరవింప బడుతున్న ఈ ప్రక్రియ నేటికీ సజీవంగా ప్రవహిస్తూ ప్రజల్ని అలరిస్తూనే ఉంది.

అవధానాల్లో, కవిసమ్మేళనాల్లో, కావ్యాల్లో ప్రతిభామూర్తులైన కవుల గళాల్లో నుండి పలుకుతున్న పద్య నిజంగానే సంగీతం. హృదయాలను పులకింపచేసున్న ఈ పద్యాన్నే తమమార్గంగా ఎన్నుకొన్న నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, పోతన, శ్రీనాథాది కవులు, ఆధునకులైన విశ్వనాథ రాయప్రోలు, దేవులపల్లి, వానమామలై వంటివారు తమ తమ ప్రత్యేక రీతుల్లో పద్యాన్ని నడిపించి పద్యానికే కొత్త నడకలు నేర్పగలిగారు. నాటినుంచి నేటివరకు అందరు కవులు రాసింది అదే పద్యమే, అవే నియమాలే, కాని ఎవరిశైలి వారిది. ఎవరి ప్రతిభ వారిది. అన్ని కాలాలకు అనుగుణమైన ‘పద్యం’ సార్వకాలికమై స్వజాతికి అర్పితమైన నైవేద్యమన్న శతావధాని డా. గౌరీభట్ల మెట్రామశర్మ మాట అక్షర సత్యమే.


# శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం ‘శిలాక్షరం’.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# తెలంగాణ అమర్‌నాథ్ ... సలేశ్వరం (యాత్ర)

ఏ. ప్రవీణ్ కుమార్ బోళ్ళ, ఫోన్ : 99894 75899



గత మూడు సంవత్సరముల నుండి వెళ్లాలనుకున్నా, కోవిడ్ సమయంలో వరుసగా రెండు సంవత్సరాలు జాతర జరగలేదు. పోయిన సంవత్సరం జాతరకి కేవలం నల్లమల చుట్టుపక్కల ప్రాంతాల వారిని మాత్రమే అనుమతించారు. ఈసారి ఎలాగైనా వెళ్ళాలనే పట్టుదలతో పొద్దున్నే ఇంటి నుండి బయలుదేరి ఎంజీబీఎస్ లో అమ్రాబాద్ బస్సు ఎక్కేవరకి జాతరకి వెళ్తాననే నమ్మకం లేకుండే. ఇది మూడోసారి తెలంగాణ అమర్నాథ్ యాత్ర సలేశ్వర జాతర వెళ్లడం.

సురేష్‌కి ఫోన్ చేసి ఇప్పుడే ఎంజీబీఎస్ నుండి స్టార్ట్ అయినా అని చెబితే నువ్వు ఇంటికి వచ్చేసరికి పదకొండు అవుతదని చెప్పి, మా ట్రిప్ ప్లాన్ చెప్పిండు. నోముల సురేష్ గౌడ్ నాకు మంచి స్నేహితుడు. సురేష్ వల్లనే నాకు నల్లమలతో విడదీయలేని బంధం ఏర్పడింది. నల్లమల లోని వింతలు విశేషాలు అద్భుతాలు అన్నీ నాకు పూసగుచ్చినట్లు చెప్పేవాడు. అంతే కాదు నల్లమల లోని ఎన్నో ప్రాంతాలకు నన్ను తీసుకెళ్లి నాకు నల్లమలకు మధ్య విడదీయలేని బంధాన్ని ఏర్పరిచాడు. నేను ఫోన్లో మాట్లాడుతుండగా విన్న నా పక్కన కూర్చున్నతను నాతో, **"మీరు సలేశ్వరం వెళుతున్నారా?"** అని అడిగాడు. అవునని చెప్పాక తను మొదటిసారి వెళ్తున్నాడని తన స్నేహితులు చివరి నిమిషంలో తప్పుకున్నా కూడా ఎలాగైనా సలేశ్వరం వెళ్లాలనే కోరికతో తను ఒక్కడే వస్తున్నాడని చెప్పాడు. నా వద్ద జాతరకు సంబంధించిన వివరాలన్నీ తెలుసుకొని, **"మిమ్మల్ని కలిసాక సలేశ్వరం వెళ్లాలన్న కోరిక ఇంకా పెరిగింది"** అని చెప్పాడు.

నేను మెల్లగా ఏవేవో ఆలోచనల్లోకి వెళ్ళిపోయాను. దశాబ్దం క్రితం అశోక్ నగర్ లో సురేష్ మొదటిసారి కలిసినప్పటినుండి ఇప్పటివరకు మా ప్రయాణమంతా ఆలోచనల్లో పొరలు పొరలుగా గుర్తుకొచ్చాయి. మొదటినుండి సురేష్ నాతో **"ప్రవీణ్ నువ్వు మా నల్లమలకి రావాలి"** అనేవాడు. అనడం మాత్రమే కాదు, కొన్నేండ్ల క్రితం సలేశ్వర జాతర సందర్భంగానే నన్ను వరకోలు ప్రవీణ్‌ను వాళ్ళింటికి తీసుకెళ్లాడు. మొదటిసారి వెళ్ళినప్పుడు బైక్ పైన అమ్రాబాద్ మన్ననూర్ చుట్టుపక్కల అడవినంతా తిరిగాము. ఆ తర్వాత కాలంలో వెళ్ళినప్పుడు కూడా ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం, ఆక్టోపస్ వ్యూ పాయింట్, ఫరహాబాద్, శ్రీశైలం పవర్ ప్రాజెక్ట్ ఇలా చాలా ప్రాంతాలు తిప్పి చూపించాడు. నాకు నల్లమల ఎప్పుడూ బోర్ కొట్టదు. చూసినా కొద్దీ, కొత్త కొత్త అందాలు అనుభూతులు మిగిలిపోతూనే ఉంటాయి. ఆలోచనలో గిరగిరా తిరుగుతుండగానే నల్లమల బఫర్ ఏరియా వచ్చేసింది డిండి ప్రాజెక్టును ఎప్పుడు దాటామో కూడా చూడలేదు. అచ్చంపేట నుండి అమ్రాబాద్ వైపు వెళుతుంటే రంగాపూర్ గ్రామం వచ్చింది. అక్కడే ప్రసిద్ధ ఉమా మహేశ్వరం ఉంటుంది. శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా పిలువబడే ఉమామహేశ్వరం నల్లమల ముఖద్వారంగా ఉంటూ ఒక కొండ పైన దట్టమైన చెట్ల మధ్యన అందమైన ప్రదేశంలో ఉంది. ఉమామహేశ్వర కొండపైన నిరంతరం నీటి ఊట ప్రకృతి పర్యాటకులను కనువిందు చేస్తుంది. బస్సులో ఇంకొంచెం ముందుకు వెళ్ళగానే ఘాట్ రోడ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఘాట్లు ఎక్కుతుండగానే మొదటగా కొండ చివర్లో మనకు **"గ్రేట్ వాల్ ఆఫ్ తెలంగాణ"** గా పిలువబడే ప్రతాపరుద్ర కోటకు చుట్టూ నిర్మించిన గోడ కనిపిస్తుంది. ఈ గోడ సుమారు 120 కిలోమీటర్లు ఉన్నట్లు చెబుతుంటారు. క్రీ.శ. 8వ శతాబ్దంలో ఈ కోట నిర్మాణం ప్రారంభమై 13వ శతాబ్దంలో పూర్తయినట్లు ఆధారాలున్నాయి. ఒకప్పుడు ప్రతాపరుద్ర కోట చుట్టూ శత్రుదుర్భేద్యంగా ఉన్న ఈ గోడ ప్రస్తుతం శిథిలావస్థలో ఉండి అక్కడక్కడ ఆనవాళ్లు మాత్రమే మిగిలున్నాయి. "గ్రేట్ వాల్ ఆఫ్ తెలంగాణ" గా పిలువబడే ఈ నిర్మాణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. అలా ఇంకాస్త ముందుకు వెళ్లి మన్ననూర్ దాటి అమ్రాబాద్ లో దిగాను. నేను ఇంటికి వెళ్లేసరికి సురేష్ నాకోసం వేచిచూస్తున్నడు. నేను వెళ్లేసరికే వదిన (సురేష్ భార్య) వంట వండి తయారుగా ఉంచింది. ఇద్దరు పిల్లలతో కొద్దిసేపు ఆడుకొని, తిన్న వెంటనే బైక్ పైన సలేశ్వరం బయల్దేరాము.

అమ్రాబాద్ నుండి శ్రీశైలం వెళ్లే దారిలో ఫర్హాబాద్ చెక్ పోస్ట్ సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శ్రీశైలం వెళ్లే యాత్రికులకు ఫర్హాబాద్ చెక్ పోస్ట్ వద్ద పులిబొమ్మ కనిపిస్తుంది. అక్కడినుండి కుడివైపు దట్టమైన అడవిలో మట్టిరోడ్డులో సుమారు 15 కిలోమీటర్లు రాంపూర్ పెంట వరకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అది గొప్ప అనుభూతిని

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024



మిగిల్చే ప్రయాణం. కేవలం సలేశ్వరం జాతర సమయంలో తప్ప మళ్ళీ ఆ అడివిలోకి ఎవరినీ వెళ్ళనివ్వరు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సఫారీ రైడ్ ని ప్రారంభించి ఇక్కడినుండే నిర్వహిస్తుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో సలేశ్వరం ప్రాంతమంతా పులులు సంచరించేందుకు ఇష్టపడే కీలకమైన ప్రాంతం అవడంతో ఈ మట్టి రోడ్డులో ప్రయాణం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. అయితే జాతర సమయంలో రద్దీగా ఉండటం వల్ల కొంత ధైర్యంగానే వెళ్ళవచ్చు.

ఆ దారిలో ప్రయాణం చేస్తూ మధ్య మధ్యలో ఆగుతూ అడవి అందాలను మొబైల్ కెమెరాలో బంధిస్తూ, ఆస్వాదిస్తూ వెళుతున్నాం. ఒక ప్రాంతంలో పసుపు పచ్చ రంగులో కట్టిపరుచుకుని విశాలమైన మైదాన ప్రాంతం కనువిందు చేసింది. అక్కడ అడవిలో కొద్ది దూరం లోపలికి వెళ్లాలని అనిపించినా, పులులకు ఆహారం ఇవ్వడం ఇష్టం లేక ఆలోచన విరమించుకున్నాను. సురేష్ బైక్ నడుపుతూ నల్లమల అడవి గురించి చెబుతూ ఉంటే నేను వెనక కూర్చోని కళ్ళతో చెవులతో ఆస్వాదిస్తున్నాను. సురేష్ కు నల్లమల పైన ఎంతో అభిమానం. ఆ ప్రాంతంమంతా అవగాహన ఉన్నవాడు. అక్కడ చెంచు పెంటలను కలియతిరిగాడు. తను కోనేరు స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తుంటాడు కోనేరు సంస్థ చెంచులకి ఎన్నో రకాల సేవలను అందిస్తుంది. దానిలో పనిచేయడం వల్ల సురేష్‌కు చెంచులతో దగ్గరి పరిచయాలున్నాయి. దట్టమైన అడవి లోపల ఉన్న ఏదైనా చెంచు పెంటలో రెండు రోజులు నివసించాలని, చెంచుల జీవితాన్ని దగ్గరుండి గమనించి అడవికి చెంచులకి ఉన్న అనుబంధాన్ని పదిమందితో పంచుకోవాలని నాలో ఎప్పటినుండో ఉన్న కోరిక. ఆ విషయం సురేష్ కి కూడా చెబితే అతి త్వరలోనే నీ కోరిక నెరవేరుతుందని హామీ ఇచ్చాడు.

వేల వాహనాలు ఆ మట్టి రోడ్డులో వెళ్లడం వల్ల మట్టి మొత్తం పిండిలా తయారయ్యింది. కార్ లో వెళ్లే వాళ్లకి పెద్దగా ఇబ్బంది కాదుకానీ బైకులపై ఆటోలలో వెళ్లేవాళ్ల పరిస్థితి మరీ దారుణం. చివరి వరకు వెళ్లేసరికి మనుషులందరూ ఎర్రగా మారిపోతున్నరు. అక్కడి ఎర్ర మట్టి మనల్ని తనలో కలిపేసుకుంటుంది. దసరా పండక్కి గిర్ని వద్ద పిండి పెట్టే వాళ్ళు ఎలా తెల్లగా మారిపోతారో, అలాగే సలేశ్వరం బేస్ క్యాంపు చేరే సరికి యాత్రికులందరూ ఎర్రగా మెరిసిపోతారు. వెళ్లే దారిలో సురేష్ నాకు బౌరాపూర్ పెంటకు వెళ్లేదారి చూపించాడు. అక్కడ శివరాత్రికి జాతర అద్భుతంగా జరుగుతుందట. ఎక్కడెక్కడి నుండో భక్తులు శివరాత్రికి శ్రీశైలం వస్తే, శ్రీశైలం పక్కనే ఉన్న అక్కడివారు మాత్రం బౌరాపూర్ జాతరకి వెళుతుంటారట. వెంటనే అయితే వచ్చే శివరాత్రికి నాకోసం రెడీగా ఉండు అని చెప్పిన. అలాగే ముందుకు వెళ్లి రాంపూర్ పెంట కు చేరుకున్నాం. అక్కడ వేల వాహనాలు పార్కింగ్ చేసి ఉన్నాయి. వాహనాలన్నీ అక్కడ ఆపి మరో రెండు కిలోమీటర్లు ఆటోలో 20 రూపాయలు ఇచ్చి బేస్ క్యాప్ కి చేరుకునేలా పోలీసులు ఏర్పాటు చేశారు. కానీ అక్కడికి వచ్చిన వేల మందికి ఆటోలు సరిపోక అందరూ నడుచుకుంటూ బేస్ క్యాంపు వరకు వెళ్తున్నారు. అక్కడే ఒక పోలీస్ ఎదురుగా వచ్చి సురేష్‌తో మాట్లాడాడు. మాకు తాగడానికి వాటర్ బాటిల్ ఇచ్చి మరీ మా బైక్ ను బేస్ క్యాంప్‌కు తీసుకెళ్లి పోలీస్ క్యాంప్ టెంట్ వెనక పార్కింగ్ చేసుకోమని చెప్పాడు. పోనూ రానూ నాలుగు కిలోమీటర్లు నడపడం తప్పిందని సంబరపడ్డాను. ఆ పోలీస్ సురేష్‌కి తమ్ముడు అవుతాడని అని చెప్పాడు.

బేస్ క్యాంప్ వద్ద బైక్ పార్కింగ్ చేసి డట్రెక్కింగ్ మొదలు పెట్టాము. అక్కడ యాత్రికులకు కనీస అవసరాలు అన్ని అందుబాటులో ఉన్నాయి. కొన్ని సంఘాల వాళ్ళు అక్కడ టెంట్లు వేసుకుని జాతరకి వచ్చిన యాత్రికులందరికీ అన్నదానం నిర్వహిస్తూ ఉంటారు. బేస్ క్యాంపు నుండి సుమారు 6 కిలోమీటర్లు నడిస్తే లింగమయ్య కొలువైన కుహ, జలపాతం వద్దకు చేరుకుంటాం. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి తర్వాత వచ్చే చైత్ర శుద్ధ పౌర్ణమికి సలేశ్వర జాతర జరుగుతుంది. కోవిడ్‌కి ముందు జాతర ఐదు రోజులు జరుగు తుండేది, ఇప్పుడు కేవలం మూడు రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల ప్రతీ సంవత్సరం యాత్రికులు పెరిగిపోతూనే ఉన్నారు. ఒకప్పుడు ఇక్కడికి కేవలం చుట్టుపక్కల ప్రాంతాల వారు మరియు కర్ణాటక మహారాష్ట్ర నుండి కొద్దిమంది మాత్రమే వచ్చేవారని ఇప్పుడు లక్షల మందిలో యాత్రికులు వస్తున్నారని కొంతమంది స్థానిక యాత్రికులు మాట్లాడు కుంటుండగా విన్నాను. మేము వెళ్లడానికి ముందు రోజు ముగ్గురు యాత్రికులు తొక్కిసలాటలో మరణించారు. ఆ విషయం ఇంట్లో తెలిస్తే నన్ను వెళ్ళనివ్వరని తెలియకుండా జాగ్రత్తపడ్డాను. కానీ అక్కడ పరిస్థితి ముందు రోజులా లేదు కొద్దిగా యాత్రికులు తగ్గారని సురేష్ చెప్పాడు. ముగ్గురు మరణించడం వల్ల చాలా మంది యాత్రికులు భయంతో వెనక్కి వెళ్లారని తెలిసింది. పులుల రక్షిత ప్రాంతం అవడం వల్ల జాతరను ఐదు రోజుల నుండి మూడు రోజులకు కుదించామని ఫారెస్ట్ అధికారులు

చెప్పారు. అలా జాతర జరిగే రోజులు కుదించడం వల్లే యాత్రికుల రద్దీ పెరిగి యత్రికులు మరణిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఏది ఏమైనా ఇలాంటి అద్భుతమైన జాతరలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం. యాత్రికులకు సహకరించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని నా వ్యక్తిగత అభిప్రాయం. అడవికి మనుషులకి మధ్య అనుబంధం పెరగాలంటే ఇలాంటి సందర్భాలను ఉప యోగించుకుని ప్రకృతిని మరింత ప్రేమించేటట్టు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

అలా మెల్లిమెల్లిగా ముందుకు కర్ర సహాయంతో నడుస్తూ సగం దూరం వరకు చేరాము. సలేశ్వరం జాతర జరిగే ఏప్రిల్ నెలలో నల్లమల అడివంతా ఆకురాల్చి ఉంటుంది. నల్లమల పచ్చగా ఉన్నప్పుడు ఎంత అందంగా ఉంటుందో ఇలా ఆకులన్నీ రాలిన చెట్లతో అందాలను ఆరబోస్తున్నపుడు మరింత అందంగా కనిపిస్తుంది. ముఖ్యంగా జాతర సమయంలోనే రాత్రుల్లో వెన్నెల వెలుతురుల్లో మరో ప్రపంచంలోకి మనల్ని లాక్కొని వెళుతుంది. మనం లోయలోకి నడిచే దారంతా బండరాళ్ళతో అత్యంత కష్టంగా ఉంటుంది. నడిచే దారి వెంటన ఎడమవైపున అత్యంత లోతైన లోయలు ఉంటాయి. పొరపాటున కాలుజారితే 300 మీటర్ల లోతైన లోయల్లోకి పడిపోతాం. ఇంకాస్త ముందుకు వెళ్లేసరికి పైనుండి నీటి ఊటలు పడుతూ ఉన్నాయి. మా వెంట తెచ్చుకున్న రాగి జావా, మంచినీళ్లు ఎప్పుడో అయిపోయాయి. అక్కడి నీటి ఊటల్లోని నీళ్లు కొబ్బరి నీళ్లలా చాలా తియ్యగా ఉంటాయి. వాటిని కడుపు నిండా తాగి కొన్ని నీళ్ళని మా బాటిల్‌లలో నింపుకున్నాము. నల్లమలలు ఎన్నో ఔషధ మొక్కల గుండా ప్రయాణిస్తూ వచ్చే ఆ నీళ్లు ఎంతో ఆరోగ్యకరమైనవని చెబుతుంటారు. చివరగా గుహ ప్రాంతం వద్దకి చేరగానే చాలా రద్దీగా ఉంది. అయినా ఓపికగా రెండు గంటలు లైన్లో నిలబడ్డాం. అక్కడినుండి పారే నీటి ప్రవాహం వెంబడి కొంత దూరం, అడుగు వెడల్పు మాత్రమే ఉంటుంది. అడుగులో అడిగేసుకుంటూ ఒక్కొక్కరుగా నడవాలి. జారిపడితే పక్కనే ఉన్న నీటి గుండంలోకి పడిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం అక్కడ కాంక్రీట్ నిర్మాణం చేపట్టి ప్రమాదాన్ని కొత్త తగ్గించారు. అలా అడుగులో అడుగేస్తూ లోయలోకి ప్రవేశించాక ఒక అద్భుత ప్రపంచంలోకి వెళ్ళామా అన్న అనుభూతి కలిగి, అప్పటివరకు పడ్డ శ్రమనంతా మర్చిపోతాము. ఎడమవైపున కొంత ఎత్తు ప్రాంతంలో లింగం ఉంటుంది. లింగానికి ఎదురుగా 300 మీటర్ల ఎత్తు నుండి పడుతూ జలపాతం ఉంటుంది. సరిగ్గా మధ్యలో లోతైన గుండం ఉంటుంది. మనం గుహలోకి ప్రవేశించగానే మన పైన నీటి చుక్కలు పడుతూనే ఉంటాయి. తక్కువ మొత్తం చాలా చల్లగా ఉంటుంది. ఏప్రిల్ నెలలో కూడా చలితో వణికిపోతాము. జలపాతంలో తడుస్తూ ఆ మధ్యలోని గుండాన్ని దాటుతూ లింగమయ్య దర్శనం చేసుకున్నాక బయటికి



వచ్చే మార్గం మరొకటి ఉంటుంది. యాత్రికులు వెళ్లేటప్పుడు **"వస్తున్నాం వస్తున్నాం లింగమయ్య"** అని, తిరిగి వచ్చేటప్పుడు **"పోయాస్తాం పోయాస్తాం లింగమయ్య"** అని అరుస్తూ ఉంటారు. సలేశ్వరం గుహలో ఇక్ష్వాకుల, విష్ణుకుండినుల కాలంనాటి చారిత్రక ఆధారాలు లభించాయి. ఆ గుహలో ఛత్రపతి శివాజీ కూడా కొన్ని రోజులు నివసించినట్లు ఆధారాలు లభించాయి. చెంచులే పూజారులుగా నిర్వహించబడుతున్న సలేశ్వర క్షేత్రానికి, ప్రతీ పౌర్ణమి రాత్రిలో పక్కనే ఉన్న శ్రీశైలం నుండి సాక్షాత్తు మల్లికార్జునుడు భ్రమరాంబలే విహారానికి వస్తారని, పండు వెన్నెల్లోని నల్లమల అందాలని ఆస్వాదించి వెళతారని చెంచుల నమ్మకం.

❖ ❖ ❖ ❖ ❖


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# నెమలి కన్నులు – అలంకారిక రచనకు వన్నెలు

ఆచార్య పగడాల చంద్రశేఖర్, హైదరాబాద్. ఫోన్ : 9490 803 523

వర్తమాన తెలుగు రచయితల్లో ఆచార్య 'దార్ల' వెంకటేశ్వర రావు తనదైన సాహితీ వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వారు అనేక సాహితీ ప్రక్రియలను స్పృశిస్తూ, తనదైన ముద్రను నిలుపుకుంటున్నారు.

దార్ల వ్యక్తిగతంగా స్నేహశీలి, ఆత్మీయులు, పరోపకారి, శక్తివంచన లేకుండా అందరికీ సహాయపడతారు. నాకు వారితో సాహితీ సంబంధమేకాక, వ్యక్తిగత స్నేహబంధాలు కూడా విస్తృతంగా, బలీయంగా ఉన్నాయి. వీటికి ఇది సందర్భం కాదు.

దార్ల గతంలో తన ఆత్మకథను చదివి భాషాపరమైన సూచనలు ఇవ్వమని నన్ను కోరారు. వారికి నా పట్లగల నమ్మకానికి కృతజ్ఞతలు. నాకు తోచిన, సమంజసమనిపించిన సలహాలను తెలిపాను. ***'అందులో కొన్నిటిని తీసుకున్నాను'*** అని వారు అన్నారు. ముగించాను. అంత మాత్రాన సంపాదకుడనడం సమంజసమా!?

కావ్యం ఉపదేశం, ఆనందం ఇవ్వాలని లాక్షణికుల అభిప్రాయం. ఈ రెండు అంశాలు దార్ల నెమలి కన్నులులో ఉన్నాయి. ***'నెమలి కన్నులు***" లో వివిధ విభాగాలు లేదా అధ్యాయాలున్నాయి. ఇవి తన జీవన కాలంలోని సమాజానికి అద్దం పడుతుంది.

**1.నెమలి కన్నులు ఉపదేశం :** దార్ల తన ఆత్మకథ ద్వారా ఉపదేశాత్మక సందేశాలను వినిపిస్తున్నారు. స్థాలీపులాత్మకంగా చూద్దాం.

**1.1.సమాజంపై తిరుగుబాటు :** దార్ల ఆత్మకథలో ప్రతిబింబిస్తున్నాయి. దార్ల ఆత్మకథ సమకాలీన సమాజానికి అద్దం పడుతోంది. దళితుల దీనగాథను, ప్రత్యేకించి తన కుటుంబంలో తండ్రి, తాను, కుటుంబీకులు, తన వర్గంవారు, గ్రామీణులు ఎదుర్కొన్న కష్టాలను పూసకుచ్చినట్లు, కళ్లకు కట్టినట్లుదృశ్యకావ్యంగా మలిచారు. సమాజంలోని అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నల వర్షం కురిపించారు, తన ధిక్కార స్వరం వినిపించారు. దళితుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని మేలుకొలుతున్నారు. సమాజంలోని ఆచారాలపై తిరుగుబాటుచేసి, సమాజాన్ని మేల్కొలపడానికి సమాజాన్ని అప్రమత్తం చేశారు దార్ల. ***'తీర్థం చూడ్డానికి డబ్బులెందుకు?'*** అని ప్రశ్నించారు.

**1.2. సమసమాజ స్థాపన భావన :** సమాజం స్వార్థపూరితం, తాను మాత్రమే బాగుండాలనే చింతన ఎక్కువ మందిలో కనిపిస్తుంది. అంతేకాక ఆత్మ ప్రశంస, పరనింద సాగుతోంది.అయితే దేవుణ్ణి కోరుకున్నప్పుడు కూడా దార్ల అందరు బాగుండాలని ఆశిస్తున్నారు.

***'దేవుణ్ణి మనం కోరుకునేటప్పుడు మనకోసమే మనం దేవుణ్ణి అడక్కూడదు.***

***మన చుట్టుప్రక్కల వాళ్ళంతా బాగుండాలి,***

***అందరితో మనం బాగా ఉండేమనస్తత్వాన్ని మనకివ్వాలి'*** అని సమభావాన్ని ప్రబోధించారు.

ఈ విధంగా నెమలి కన్నులు ఉపదేశాత్మకంగా సాగుతుంది.

**1.3. తన జాతి ఔన్నత్యాన్ని ప్రశంసించడం :** ప్రతి మనిషి పుట్టుక, తల్లిదండ్రులు కాకతాళీయమే. అయితే పూర్వజన్మ సుకృతమని భావిస్తారు కొందరు. ఏది ఏమైనా తన పుట్టుక స్థితిగతులను ప్రతిఒక్కరు గర్వపడాలి, ఔన్యత్యాన్ని ప్రశంసించాలి. ఈ నేపథ్యంలో దార్ల తన జాతి ఔన్నత్యాన్ని ఇలా వర్ణించారు. వాటికి దగ్గర్లో ఒక నక్షత్రం ఉంటుంది. దాని పేరు ఆరంజ్యోతి (అరుంధతి) అని మా అమ్మ చెప్పేది. ***"ఆ ఆరంజోతి మనింటి పిల్లే ... అలా నక్షత్రంగా మారిపోయింది."*** అని మా అమ్మ అనగానే మాకు ఆశ్చర్యమనిపించేది అని తన మూలాల ఔన్నత్యాన్ని వెల్లడించారు. ***(వాయుకుడుం అంటే...!)***

**2. నెమలి కన్నుల – భాషాసౌందర్యం, ద్రాక్షారస సదృశం :** ఏ రచన అయినా పఠనీయంగా ఉంది, పఠనాసక్తి కలిగిస్తుంది అంటే ప్రధానంగా రెండు అంశాలను పేర్కొనవచ్చు. అవి – 1.భావజాలం, 2. భాషా ప్రయోగం. మొదటి అంశం – పాఠకులు లేదా శ్రోతలు తమకు అనుకూలమైన, ఇష్టమైన భావజాలంతోకూడిన విషయాన్ని ఆసక్తిగా చదువుతారు, వింటారు. రెండవ అంశం – ఆయా భావాలను తెలపటానికి సరైన పదజాలాన్ని ప్రయోగించాలి. ఆ పదజాలం సమకాలీనమై, దాదాపుగా సార్వజనీనమై ఉండాలి. అప్పుడే పాఠకులు, శ్రోతలు ఆసక్తిగా చదువుతారు, వింటారు. అయితే పఠనీయత అనేది వస్తువుతోపాటు సంభాషణ, శబ్దకౌశలం, క్లుప్తత, మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది.

దార్ల తన ఆత్మకథను తనదైన శైలిలో రచించారు. అది అభినందనీయం, ప్రశంసనీయం. దార్ల ఆత్మకథ పఠనాసక్తి కలిగి, చదవడం ప్రారంభిస్తే ఏక బిగిన ముగుస్తుంది. ఇక భాషా విషయానికి వస్తే, రచన దాదాపుగా ఆధునిక ప్రమాణ తెలుగులో సాగింది. అంటే నేటి ప్రమాణ వార్తాపత్రికలు, దూరదర్శన్ భాషను పాటించారు. అయితే సామాజిక మాధ్యమాలు కాదు సుమా. దార్ల కలం నుండి అక్కడక్కడ వైయక్తిక భాష, మాండలిక భాష, రచనలో ఆలంకారిక శైలి కూడా చోటుచేసుకుంది. దార్ల ఆత్మకథ దాదాపుగా వచన కవితలాగా సాగింది. వారి రచనలో సాధారణ తెలుగు పాఠకునికి అర్థంకాని పదంలేదు. పదాలన్నీ వాచ్యార్థంలోనే ఉన్నాయి. అభిదా లక్షణాన్ని తెలుపుతున్నాయి. అన్ని పదాలు సులభంగా అర్థమవుతాయి.

**2.1.శీర్షిక రచన :** దార్ల తన ఆత్మకథలోని అయా విభాగాలకు పేర్లు పెట్టడంలో చాలా జాగ్రత్త పడ్డారు. అందుకు నిత్యవ్యవహారం లోని పదాలనే ఎన్నుకున్నారు. కొన్ని శీర్షికలను చూద్దాం– ***మా ఊరి పేరు అగ్రహారం!, కోనసీమ ప్రేమ కౌగిలిలో మా పూరు, పప్పు సార్!, జుట్టు కటింగ్ – చెంబు ఇస్త్రీ, నేనూ ఓ సైకిల్ కి ఓనరైయ్యాను! మూగవేదనల పేగు బంధం***, మొదలైనవి.

**2.2.ఆలంకారిక రచన :** "దార్ల ఆత్మకథ" వచన కవితగా సాగిపోతుందనుకున్నాం. దార్ల రచన అలంకారాల పొదరిల్లు. అందులో వివిధ రకాల ఉపమానకుసుమాలు పుష్పిస్తాయి. దానికోసం తన కళ్లెదురుగా ఉన్నవాటినే ఎన్నుకుంటారు. దీనికోసం అనునిత్యం తన వ్యవహారంలోని, సమకాలిక జనవ్యవహారంలోని పదజాలాన్ని, అలంకారాలను ప్రయోగించారు. ఉపమాన, ఉత్ప్రేక్షకోసం తన పరిసరాలనే ఎంచుకున్నారు.

***మా ఊరిపేరు చెయ్యేరు అగ్రహారం అని చెప్పాను కదా! / సాగర సంగమం కోసం వేగంగా ఉరికొస్తున్నట్లు ప్రవహించే గౌతమీ గోదావరినదిని / కుండలేశ్వరం మీదుగా చెలికత్తెలెవరో రహస్యంగా తీసుకెళ్తున్నట్లుండే ఆ మండలం ...*** (మా ఊరిపేరు). పాఠకునికి సుబోధకంగా ఉంది, ఇది భావకవితను తలపిస్తోంది.

*'నేను స్కూల్ కి నడిచి వెళ్ళినప్పుడల్లా*
***రోడ్లు నాతో మాట్లాడేవి.***
***నేను రోడ్లుతో మాట్లాడేవాణ్ణి"*** *(నేను ఓ సైకిల్ కి ఓనరైయ్యాను).* ఇందులో రోడ్లను మానవీకరించారించారు. బాల్యంలో దార్ల, రోడ్లు మాట్లాడుకున్నారు. కవి (సృజనాత్మక రచయిత) కదా, సాధ్యమే.

***"ఆ గట్టునుండే ముళ్లన్నీ***
***నీ అడుగుల కింద మెత్తని పువ్వుల్లా మారిపోయేవి***
***నువ్వేమీ వాటిని గమనించేవాడివి కాదు***
***ఆ తెల్లని పువ్వుల బుగ్గలప్పుడప్పుడూ సిగ్గుతో ఎర్రబడేవి"*** (నీకు తృప్తిగా తినిపించాలనుంది).

తండ్రి బాధను అక్షరీకరించారు. తండ్రి అడుగుల కింది ముళ్ళపువ్వుల్లా మారిపోయాయని ఊహించారు. ఏ కొడుకుకైనా తండ్రి పట్ల గల ప్రేమాప్యాయతలు ఇలాంటి భావనే కలుగుతుంది కదా. అంతేకాక ***"ఆ తెల్లని పువ్వుల బుగ్గలెప్పుడూ సిగ్గుతో ఎర్రబడేవి."*** అని చక్కగా భావించారు.

**ఉపమాలంకారం :**

*"నువ్వక్కడి నుండి వెనెక్కివెళ్ళు...!*
***ఆ మాట***
***నాలేత ఆకులాంటి గుండెల్నెవరో***
***చీల్చేస్తున్నట్లనిపించింది."*** ***(నువ్వక్కడి నుండి వెనెక్కివెళ్ళు...!)*** గుండెను లేత ఆకుతో ఉపమించారు.

***మాకు ఇంటర్వెల్ బెల్ కొట్టినప్పుడు, కిలకిలమంటూ మా పిల్లలంతా పంజరంలోని చిలుకల్లా ఉరుక్కొంటూ బయటకొచ్చే వాళ్ళం." (మూగవేదనల పేగు బంధం).*** పిల్లలను పంజరంలోని చిలుకలతో ఉపమించారు. మా పెద్దన్నయ్య ఓ హిట్లర్! పెద్దన్నను హిట్లరుతో పోలిక.



**ఉల్లేఖాలంకారం:**

***"నిజమే.. బాల్యం ఓ చలమ లాంటిదే!***
***బాల్యం ఓ సముద్రం లాంటిదే!***
***బాల్యం ఓ ఆకాశం లాంటిది.."*** అని బాల్యాన్ని పరిపరి విధాలుగా ఊహించారు. ఇలా చెప్పడం ఉల్లేఖాలంకారం అంటాం.

**2.3. ప్రాచీన సాహిత్య ప్రభావం :** దార్ల తెలుగు సాహిత్యాన్ని ఔపోశన పట్టారు. ప్రాచీన సాహిత్య ప్రభావానికి గురికాని రచయితలుండరంటే అతిశయోక్తి కాదు. దీనికి దార్ల అతీతుడు కాదనుకుంటాను.

***"ఇంకాస్త సేపు అలాగే ఆ సూర్యోదయాన్ని చూస్తుంటే, ఆ చెట్ల మధ్యలోనుండి సన్నని వెలుగు ... అది కోత కోసిన పంట పొలాల దగ్గర కాపలా కాస్తూ, చేనుకి పెట్రోమాక్స్ లైట్ వేసి, చూస్తున్నట్లు అటూ ఇటూ నాలుగు వైపుల్లో ఏదొక వైపు ఆ కాంతి కిరణాలు కదులుతున్నట్లు అనిపించేవి.'*** స్వభావోక్తి అలంకారం. ఇది ఆముక్తమాల్యదలోని ***"తల పక్షపుట గుచ్చి బాతువులు కేదారంపు కుల్యాంతర స్థలి నిద్రింపగ చూచి..."*** పద్యంలోని రైతుల వర్ణన గుర్తుకు తెస్తుంది.

*"నేను పడుకున్నాను. ఒక అర్ధరాత్రి అమాంతంగా మా ఇంటి కప్పుకు పెద్ద రంధ్రం పడిపోయింది. జీసస్ పుట్టిన పశువుల పాకలోకి రెక్కలున్న తెల్లని వస్త్రాలు ధరించిన దేవతలు... /*

*వాళ్ళు వచ్చే ముందు పెద్ద కాంతి కిరణాలు... / అలాగే వెదజల్లుకుంటూ వచ్చినట్లు మా ఇంటి పైకప్పు నుండి ఒక పెద్ద వెలుగు వచ్చింది." **(జీళ్ళ వర్షం...!)***

**2.4. వైయక్తిక శైలి :** రచనను సొంతం ఏక శైలిలో రాయవచ్చు. అదే కొంత సులభం అనుకుంటాను. అయితే ఆయా పాత్రల అస్తిత్వానికి ఆయా పాత్రల వైయక్తిక శైలిని కూడా ప్రయోగించడమవుతుంది. దార్ల అదే పని చేశారు.

***"ఫర్లేదు తిన్నా... ఎంతో లేదులే... మంచి కూరుంది... తిను ... పొద్దున్నెప్పుడో తిన్నావు కదా... తిను."*** అన్నారు. (నువ్వక్కడి నుండి వెనెక్కివెళ్ళు...!). తండ్రి ఆప్యాయతను, మమకారాన్ని తన తండ్రి మాటల్లోనే అక్షరబద్ధం చేశారు. ప్రతి భాషీయునికి తన వైయక్తిక శైలీతోపాటు, మాండలికం కూడా చివరి శ్వాస దాకా నిలిచి ఉ ంటుంది. అదే ప్రతిఫలించింది.

**2.5 శబ్ద ప్రయోగం :** సమాజంలోని అనేక వ్యవస్థల్లో భాష కూడా ఒక వ్యవస్థ. అందువల్ల తన పరిసరాల్లోని భాషా ప్రభావానికి లోనుకావడం సర్వసాధారణం. సాధారణంగా రాజకీయం, ఆర్థికం, శాస్త్రసాంకేతికం, మొదలైన రంగాల్లో ప్రగతి సాధించిన సమాజ భాషను ఇతర భాషలు అనుసరిస్తాయి.

దార్ల ఆత్మకథ తెలుగు నవల. అయితే పనికట్టుకుని తెలుగు పదాల ప్రయోగానికి ప్రయత్నించలేదు. ఆంగ్లంనుండి పదాలను స్వీకరించారు, సుప్రసిద్ధ తెలుగు పదాలున్నప్పటికీ. రచనావేశంలో దొర్లిన పదాలుగా స్వీకరించాలి. ఈ పదాలన్నీ సగటు తెలుగు భాషీయునికి తెలిసినవే, వాడేవే. అంతేకాక తెలుగు పాఠకులు తమ ఆంగ్లపద సంపద పెంచుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది. మొదట ఆంగ్లంనుండి ఆదాన పదాలను పరిశీలిద్దాం.

తెలుగు భాష సులభంగా పదాలను ఆదానం చేసుకుంటుందని భాషావేత్తలు తెలుపుతారు. ఈ పద్ధతి అటు రచయితకు, వక్తకు సులభం. ఇంగ్లీషు నుంటి ఆదానం చేసుకున్న పదాలను చూద్దాం. వీటికి ప్రత్యామ్నాయంగా తెలుగులో పదాలు లేవు.

ఉదా: క్యారియర్, స్కర్ట్, డ్రెస్, ఫ్రాక్, మేడమ్, చర్చి, పాస్టర్లు, సైకిల్ టైరులు, ట్రాక్టర్లు, మొదలైన పదాలను స్వీకరించారు.

తెలుగులో ప్రత్యామ్నాయ పదాలు వ్యాప్తిలో ఉన్నప్పటికీ ఆంగ్లంనుండి పదాలు స్వీకరించడమైంది.

ప్రారంభంలో అన్యభాషా పదాలను ఆదానం చేసుంటారు. అయితే కొంతకాలం తరువాత ఆయా భాషల్లోని సమానార్థక పదాలతో స్థిరపరచడమవుతుంది. అవి నిలిచిపోతాయి.

ఉదా: బాప్తిజం (Baptism) కు పవిత్ర స్నానం అనే అనువాదం ఉంది. బెల్ కొట్టిన కు (గంట కొట్టిన), మాస్టారు (సార్), ఉదా: బాప్తిజం (Baptism) కు పవిత్ర స్నానం అనే అనువాదం ఉంది. బెల్ కొట్టిన కు (గంట కొట్టిన), మాస్టారు (సార్), బ్యాగ్(సంచి)లో పెట్టేశాను. (నువ్వక్కడినుండి వెనక్కి వెళ్లు). క్లాస్మేట్ (సహపాఠకుడు), హెడ్మాస్టర్ (ప్రధానోపాధ్యాయుడు), పేరెంట్ (తల్లి లేదా తండ్రి), ఎలిమెంటరీ స్కూల్ (ప్రాథమిక పాఠశాల), ఓనర్లయ్యాను (యజమాని అయ్యాను) మొదలైన పదాలున్నప్పటికీ ఇంగ్లీషునుండి ఆదాన పదాలను స్వీకరించారు. సామాన్య జన వ్యవహార పదాలను గ్రహించడం. పప్పు సార్! (ప్రొఫెసర్). ఆరంజ్యోతి (అరుంధతి) అనే సామాన్య జన వ్యవహార పదాలను గ్రహించారు.

ఈ విధంగా దార్ల ఆత్మకథ నెమలి కన్నులు – ఆలంకారిక వన్నెలుగా భాసిస్తోంది. ఇది ఉపదేశాత్మకంగా, భాషా సౌందర్యంతో పాఠక రంజకంగా ఉందని తెలపటానికి సంతోషిస్తున్నాను. తరువాతి ఆత్మకథలు ఆదర్శంగా, మార్గదర్శంగా ఉండగలదని ఆశిస్తూ...దార్ల కలంనుంచి ఆత్మకథ తరువాతి భాగాలు వీలైనంత త్వరలో వెలువడాలని ఆశిస్తూ.....

## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177



# బంజారాల బతుకు చిత్రానికి ప్రతీక 'కేసులా'

**డా. భూక్యా రాజారాం నాయక్**, తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల, ఫోన్ : 994 921 9961




తెలుగు సాహిత్యం ప్రాచీన కాలం నుంచి నేటి వరకు అనేక విధాలుగా పరిణామం చెందుతూ వస్తుంది. దీనిలో భాగంగా ఇటీవలి కాలంలో గిరిజన సాహిత్యం కూడా అనేక ప్రక్రియలోకి కొత్త పుంతలు తొక్కుతూ ఆకర్షణీయంగా సాగుతూ ఉంది. ఈ మధ్యకాలంలో గిరిజన సాహిత్యం, బంజారా సాహిత్యాల వైపు కూడా కవులు, రచయితలు, పరిశోధకులు దృష్టి సారించడం ఆనందదాయకం. ఈ పరిణామంలో వెలువడిందే ఈ "కేసుల" గోర్ బంజారా కథా సంకలనం.

ఇది తెలుగులో వెలువడిన తొలి బంజారా కథా సంకలనంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. కేసుల అంటే బంజారా భాషలో మోదుగ పూలు అని అర్థం. ఈ మోదుగ పూలతో వారికి ప్రత్యేక అనుబంధం ఉంటుంది. మండే ఎండలో అడవికి తిలకం దిద్దినట్టుగా పూస్తుంది ఈ కేసుల (మోదుగపూలు). అడవిని ఆశ్రయంగా చేసుకుని జీవించే బంజారాలు అడవిలోని చెట్టు పుట్టను ఆత్మీయులుగా భావిస్తూ ఈ మోదుగు పూలతో ఒక ప్రత్యేక జీవన అనుబంధాన్ని ఏర్పరచుకుంటారు. బంజారాలు ప్రత్యేకంగా హోలీ పండుగ సందర్భంలో ఈ మోదుగ పూలతో రంగులను తయారు చేసి ఆ రంగు నీళ్లతో హోలీని ఆడుకుంటారు.

బంజారాల జీవన విధానం ఎంత విలక్షణమైనదో వీరి సాహిత్యం కూడా అంతే గొప్పగా ఉంటుంది. తండా మట్టి వాసనను వెదజల్లుతూ ఉస్మానియా యూనివర్సిటీలో కేసుల లెక్క వెలుగుతున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, బంజారా యువరచయిత రమేష్ కార్తీక్ నాయక్‌ల సంపాదకత్వంలో వెలువడిన "తొలి బంజారా కథా సంకలనం ఈ 'కేసుల' గోర్ బంజారా కథలు".

ఈ కథల సంపుటిలో బంజారాల సంస్కృతి సంప్రదాయాలను అద్దం పడుతూ మొత్తం యాభైఐదు కథలు ఉన్నాయి. ఇందులో ప్రతి కథ బంజారాల జీవితంలోని ఒక కొత్త కోణాన్ని తెలియ చేస్తుంది. బంజారాల జీవితం, సాహిత్య సంప్రదాయాలను ఎంతో లోతుగా విశ్లేషిస్తున్నాయి. చదవడం మొదలు పెడితే చాలు ఊపిరి బిగబట్టి చివరి వరకు చదివించే కథలు ఇందులో అనేకం ఉన్నాయి. దీనిలోని ప్రతి కథా బంజారా బతుకు చిత్రంకు అద్దం పడుతుంది. కొన్ని కథలు ఆలోచింప చేస్తే మరి కొన్ని మనుసులో గూడుకట్టుకొన్న దైన్యాన్ని తొలగిస్తాయి. మరికొన్ని కథలు పాఠకుడిని తండాకు లాక్కెళ్ళి జ్యారేర్ బాటి, సోలోయి (జొన్న రొట్టెలు, బంజారాలు ప్రత్యేకంగా చేసే వంటకం నల్ల) రుచిని చూపిస్తాయి. ఈ కథల సంపుటిలో బంజారాలతో పాటు బంజారేతరులు కూడా రాసారు. బంజారా సమాజంపై బయట సమాజానికి ఉన్న అనేక సందేహాలు ఈ కథల వల్ల తేటతెల్లమవుతాయి.

ఇక ఈ గ్రంథంలోని కథల వివరాల్లోకి వెళితే... బంజారాలు ప్రకృతి ప్రియులు. జంతు ప్రేమికులు. ఈ కేసుల కథ సంకలనంలో మొదటి కథ బుజ్జి. మూగజీవాలతో మనుషులకు ఉండే బంధాన్ని ఈ కథ తెలుపుతుంది. పిట్లో అంటే శనగపిండి అని అర్థం. బంజారాలు పేదరికంతో కనీస అవసరాలు తీర్చుకోలేనంత కష్టాలలో ఉండే వారని, కూరగాయలు కూడా కొనుక్కునే స్తోమత లేకపోవడం వల్ల శనగపిండి కూరనే రోజు తినడం వంటి పరిస్థితిని రచయిత మంత్రి శ్రీనివాస్ **'పిట్లో'** అనే కథలో ఒకప్పటి బంజారాల దీన స్థితిని వివరించాడు.

మరొక కథ సమ్మెట ఉమాదేవి రచించిన **'బొడ్రాయి'**. ఈ కథలో ఉరిబొడ్రాయి ప్రత్యేకతను ఊరికి గ్రామదేవతే శ్రీరామరక్ష అని, ఊరికట్టుబాట్లను గురించి తెలుపుతూ ఊరికి కొత్తగా వచ్చే అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలని తెలియచేస్తూ జాగ్రత్త పరుస్తుంది. మరొక కథలో మంగ్లీ అనే అమాయకమైన అందమైన బంజారా ఆడబిడ్డ ట్రైన్‌లో పల్లీలు అమ్ముకుంటూ ఆకతాయి పోలీసు కంట పడుతుంది. ఆమె పోలీస్ ఆఫీసర్‌కు లొంగక పోవడంతో కోపంతో మంగ్లీని ఏదో వంకతో ట్రైన్లో పట్టుకొని ప్రాణాలు పోయేలా కొట్టి చంపడాన్ని చూడవచ్చు. రచయిత అన్వర్ వర్ణించిన తీరు ఈ **"మంగ్లీ"** కథలో పాటకుడిని కంటతడి పెట్టిస్తుంది.

నీ దగ్గర ఎంత మంచితనం ఉన్నా, మంచి నైపుణ్యం ఉన్నా సమాజం నిన్ను ఏదో రకంగా ఇబ్బంది పెడుతూనే ఉంటుందనడానికి నిదర్శనం **'దేవతారలు'** అనే కథ. దేవా నాయక్, తార ఇద్దరూ భార్య భర్తలు. కటిక బీదరికంలో ఉండి ఒక ప్రభుత్వ హాస్టల్లో వంట మాస్టర్లుగా పనిచేస్తూంటారు. కాంట్రాక్టర్ మారడంతో ఉద్యోగం పోయి హైదరాబాద్ లో ఒక ప్రైవేట్ హాస్టల్ పెట్టుకుని నడుపుతుంటారు. అక్కడా అదే మంచితనంతో పనిచేస్తున్నా.. కొందరి కుట్రల వల్ల దానిని పోగొట్టుకొని చివరికి జొమోటో డెలివరీ బాయ్‌గా మారుతారు. వారి పరిస్థితిని **"దేవతారలు"** కథలో చాలా

భావోద్వేగంగా రచయిత **'మన్ ప్రీతం'** వర్ణించారు. మరొకటి నాట్ రీచబుల్. ప్రస్తుత రాజకీయ నాయకులు అమాయకమైన బంజారాలను ఏ విధంగా రాజకీయంగా ఉపయోగించుకొని వదిలేస్తున్నారు అనేది **"నాట్ రీచబుల్"** అనే కథ కండ్లకు కడుతుంది.

బంజారాలు పేదరికంతో కన్న పేగును సైతం అమ్ముకునే వారని, అలాగే ఆడవాళ్లను వ్యభిచార గృహాలకు అమ్ముకునే దుస్థితి ఉండేదని, అంతేగాక అమ్మాయి ఎన్నటికీ పుట్టింటికి బరువు అని బావించి చిన్నతనంలో వివాహం జరిపి తల్లిదండ్రులు వారి బాధ్యతను వదిలించుకునే పరిస్థితి ఉండేదని **"పుల్సీ"** అనే కథలో రచయిత్రి బాలబోయిన రమాదేవి తెలిపారు. తాను పాఠశాలలో చూసిన కొన్ని యథార్థమైన అంశాలను చిత్రిస్తూ అద్భుతంగా ఈ పుల్సీ అనే కథను చిత్రించారు. బంజారా స్త్రీలు ఒక్కసారి ఒకరిని ప్రేమిస్తే ప్రాణత్యాగం అయినా చేస్తారు. కానీ ఇంకొకరి వైపు కన్నెత్తి కూడా చూడరు అన్న దానికి నిదర్శనం **'సీతా'** అనే కథ. దేశ రక్షణలో సీత భర్త ప్రాణాలు వదులుతాడు. పాతిక సంవత్సరాలు కూడా నిండని సీత విధవరాలు అవుతుంది. ఉద్యోగంలో తనపై ఆఫీసర్ తనను మళ్ళీ పెళ్లి చేసుకోమని బతిమాలుతుంది. దానికి సమాదానంగా సీతా **"మేడం, పొరపాటున కూడా మరోసారి ఆ ప్రస్తావన తేవద్దు. నేను మా బావ సీతను అంతే. ఎప్పటికీ భావశీతగానే ఉండిపోతాను"** అని చెప్పటం పాఠకుడి మనసును కదిలిస్తుంది. దేశ రక్షణలో సైనికుల ప్రాణాలు పోతే వారి కుటుంబాల పరిస్థితి ఏ విధంగా తలకిందులు అవుతుందో ఈ 'సీతా' అనే కథ ద్వారా రచయిత్రి 'ఝాన్సీ కొప్పిశెట్టి' వీర జవాన్ల వాస్తవ పరిస్థితిని తెలిపారు.

పట్టుదల సంకల్పం ఉంటే తాను ఉన్న పరిస్థితి నుంచి ఉన్నత స్థితికి మారవచ్చని, సమాజంలో తాను కోరుకున్న మార్పును సైతం చేసి చూపవచ్చని **"సంకల్పం"** అనే కథలో జానమ్మ, ద్వాలి అనే పాత్రల ద్వారా రచయిత్రి లలిత తెలిపారు. హాస్టల్లోను, తాను పుట్టిన తండాలో నీటి ఎద్దడిని బరిస్తూ, సమాజంలో అనేక రుగ్మతులను ఎదుర్కొన్న ద్వాలి చివరికి ఆ జిల్లాకు కలెక్టర్ అయి తండా రూపురేఖలు మారుస్తుంది. మరో కథలో బాగా చదువుకున్న హరిసింగ్ ఉద్యోగం రాకపోవడంతో నిరుద్యోగిగా మారిపోతాడు. చివరికి మందుకు బానిసై తనువు చాలిస్తాడు. ఇంటికి మూలమైన స్త్రీ ఎన్ని కష్టాలు ఎదురైనా కుటుంబ బాధ్యతను నిర్వహిస్తుంది. ఎర్రటి ఎండలో సైతం ఎర్రగా పూసే మొదుగు పూలలాగా జీవితంలో గెలవాలని సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చెప్పిన నీతిని **"కేసుల"** అనే కథలో ప్రొఫెసర్ సూర్యా ధనుంజయ్ తెలపడం జరిగింది.

బంజారాల్లో వారి ఆచార వ్యవహారాలలో ఎటువంటి పరిస్థితుల్లోనైనా, ఏ విషయంలోనైనా బయటి వ్యక్తులకు తండాలోకి ప్రవేశం లేకుండా కట్టుదిట్టమైన తండా వ్యవస్థ నిర్మాణం చేయబడి ఉంటుంది. అటువంటి స్వచ్ఛమైన తండా వ్యవస్థను నేటి రాజకీయాలు, నాయకులు, అగ్రవర్ణాలు ఈ తండా వ్యవస్థలోకి ప్రవేశించి తండాకు రాజకీయ రంగు పులిమి తండాలో ఉన్న ఐక్యతను అన్నదమ్ముల మధ్య ఉన్న సఖ్యత ఏ విధంగా చిద్రం చేస్తున్నారో **'మళ్లీ పండగ వచ్చింది'** అనే కథలో రచయిత డా. భూక్యా రాజారాం నాయక్ తెలియపరచారు.

బంజారాలు ప్రకృతిని ఎంత ఇష్టపడతారో జంతువులను కూడా అంతే ప్రేమిస్తారు. దైవం పట్ల కూడా అంతే భక్తి భావాలు కలిగి ఉంటారన్నదానికి నిదర్శనం యువ రచయిత యడవల్లి సైదులు రాసిన **'ఝుడీ'** అనే కథ తెలుపుతుంది. కన్నపేగును అమ్ముకునేంత దినస్థితి బంజారా సమాజంలో ఉందని మనం అనేక సార్లు వింటుంటాం. అదే అంశాన్ని **'భేటీ'** అనే కథలో రచయిత డాక్టర్ ఎం. ధనంజయ నాయక్ అచ్చంగా వాస్తవ పరిస్థితిని విశ్లేషించారు. రూప్లీ అనే పాత్ర తన కన్నబిడ్డను అమ్ముకోవడానికి పేదరికం మాత్రమే కారణం కాదని, మగ బిడ్డను కనాలనే ఆశ కూడా అంతర్లీనంగా ఉందనీ, మగసంతానం లేకపోతే సమాజం చులకన భావంగా చూస్తుందని, మగబిడ్డ కోసం వారు పడే ఈ యాతనలో ఆడబిడ్డ పుడితే అమ్ముకుంటారన్న వాస్తవాన్ని తెలిపారు. కన్న బిడ్డలు దేవుని ప్రసాదమని, వారే రేపటి దేశ నిర్మాతలని, అమ్ముకోకుడదని ఈ కథలో రచయిత బంజారా సమాజానికి కనువిప్పు చేస్తారు. బంజారా ఆడబిడ్డలు పెండ్లి సందర్భంలో చేసే డావ్లో (వలపోత) ఒక ప్రత్యేకమైన భావోద్వేగ సందర్భం. అప్పటివరకు అందరితో కలిసి మెలిసి తిరిగిన అమ్మాయి పెండ్లి చేసుకుని అత్తారింటికి వెళ్ళే సందర్భంలో తన బాధనంతటిని వలకపోస్తూ చేసే డావ్లోను మంగ్లి పాత్ర ద్వారా **'డావ్లో'** అనే కథలో రచయిత రమేష్ కార్తీక్ నాయక్ తెలిపారు.

బంజారాల జీవితంలో సంస్కృతి సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకం. వారు తండా నుండి బయటకు వచ్చి సమాజంలో కలుస్తున్నప్పుడు ఎదురయ్యే అనేక సమస్యలకు ఈ కథలు అద్దం పట్టాయి. ప్రపంచీకరణలో భాగంగా వారు అసలైన తండా గుండే చప్పుడును కోల్పోతున్నారని, స్వచ్ఛమైన తండా వ్యవస్థలో యాడి పిలుపు మాయమవుతుందని ఇందులో అనేక కథల ద్వారా వ్యక్తం అవుతుంది. ఆధునికీకరణ దృష్ట్యా అంతో ఇంతో మార్పును అందిపుచ్చుకొని బయటికి వస్తున్న అందమైన బంజారా స్త్రీలకు బయటి సమాజం నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను సైతం తెలుపుతున్నాయి ఈ కథలు. ఇంట్లో అమ్మానాన్నల గొడవలు. మద్యం తాగి ఇల్లును గుల్ల చేసి ఆదిలోనే తమ పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న తల్లిదండ్రులు మొదలగు అనేక వాస్తవిక తండా జీవితాలను, తండా పరిస్థితులను వారు ఎదుర్కొంటున్న, చూస్తున్న సమస్యలను బంజారా రచయితలు మాత్రమే కాకుండా బంజారేతర రచయితలు కూడా కథలుగా మలిచారు. ఇలా బంజారాల పరిస్థితిని, సమాజాన్ని కనువిప్పు చేసే అనేక విషయాలు ఈ కేసుల కథా సంపుటిలో విశ్లేషించబడ్డాయి. ప్రత్యేకంగా బంజారాల సంస్కృతి, భాషా, చరిత్ర. ప్రస్తుతం బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ఆధునిక ప్రపంచంలో వీరి పోకడలను ఈ కథల రూపంలో తీసుకురావడం ఎంతో సంతోషకరం. ఇంత గొప్ప ప్రయత్నం చేసిన సంపాదకులను హృదయ పూర్వకంగా అభినందించాల్సిందే.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 (55) హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# సమకాలీన సమాజ చిత్తరువు – దురస్తు

డా. ఉప్పల పద్మ, ఫోన్ : 995 912 6682

కథ అంటే సామాజిక చిత్రం. వేగంగా మారుతున్న సమాజ స్థితిగతులకు అక్షర సాక్ష్యం. వాస్తవ సంఘటనలకు, పరిస్థితులకు కాల్పనిక కళాత్మక వర్ణ చిత్రం. అటువంటి కథలో మానవ జీవన పోరాటంలోని వివిధ కోణాలకు, సంవేదనలకు పెద్దపీట వేసినప్పుడు, జీవితాలకు దగ్గరగా కథలు అల్లినప్పుడు ఆ కథలు ఎప్పటికీ సజీవమే. సమకాలీన సమాజాన్ని, వ్యక్తుల ఆలోచనల్లో వస్తున్న వివిధ మార్పులను ఒడిసి పట్టుకొని రికార్డ్ చేయవలసిన బాధ్యత రచయితలకు ఉంది. అది గుర్తెరిగిన రచయితలు వారి వారి రచనలను వ్యాసంగాను, కవిత గాను, కథగాను వివిధ ప్రక్రియలలో సృజిస్తుంటారు. జీవిత వాస్తవికతను సాహిత్యంలో ప్రతిఫలింప చేయడమే తమ కలం పరమావధిగా భావిస్తుంటారు. అటువంటి రచయితల కథలను సంకలించి **'దురస్తు'** గా అందించారు. సంపాదకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ వెల్దండి శ్రీధర్. వీరు 2013 నుండి తెలంగాణ కథా వార్షికాలు తీసుకు రావాలని **'సింగిడి తెలంగాణ రచయితల సంఘం'** ద్వారా ఒక బృహత్తరమైన కృషికి శ్రీకారం చుట్టారు. ఆ విధంగా మొదలైన తెలంగాణ కథా వార్షికల ప్రస్థానంలో రంది, తన్లాట, అలుగు, కూరాడు, దావత్, రివాజు, రూబిడి, బుగులు, నెనరు, నేటి 'దురస్తు'తో ఇప్పటికి పది సంకలనాలు వెలుగు చూసాయి. 'తన్లాట' మొదలుగా నేటి 'దురస్తు' – 2023 వరకు.

అచ్చుమైన తెలంగాణ కథల సంపుటి పదవ కథావార్షిక 'దురస్తు' (తెలంగాణ కథ 2022). పదహారు కథలతో వెలువడిన పదహారణాల తెలంగాణ సమాజపు నేలతడి. సమకాలీన సమాజ చిత్తరువు. 'దురస్తు' కథా సంకలనాన్ని తెలంగాణ స్ఫూర్తిని దశదిశలా వ్యాపింప చేసి, కనుమరుగైన ఆచార్య రవ్వా శ్రీహరి, గద్దర్, ఆచార్య బాల శ్రీనివాస మూర్తి, బైరి ఇందిర, సాయి చంద్, జాహెద్ అలీ ఖాన్‌లకు స్మృత్యంజలి ఘటిస్తూ ఆరంభించటంతోనే సంపాదకులు ప్రత్యేకతను సాధించారు. తెలంగాణ చారిత్రక మూలాలను విస్మరించక సాగే జీవనది అని చెప్పకనే చెప్పారు. జూపాక సుభద్ర రచించిన **'మా సెల్లే మల్లక్క'** కథతో 'దురస్తు' కథలు ఒక్కొక్కటిగా పరిచయమవుతాయి. చదువుకునే రోజుల్లో యువత విప్లవ రాజకీయాలను ఇష్టపడడం, సమ సమాజమే ధ్యేయంగా వివిధ సంఘాలలో చేరడం సహజంగా చూస్తుంటాం. ఒక్కసారిగా సమాజాన్ని మార్చేయొచ్చు అనే ఉడుకు రక్తపు ఉరుకు లాటలో యువత ప్రయాణం ఎన్ని తీర్లుగ తిరుగుతుందో మరియ (ఎలియాస్ మల్లక్క) పాత్ర ద్వారా పాఠకులకు విశదపరుస్తూనే, పోసక్క పాత్ర ద్వారా సంఘాల్లో పనిచేస్తూ, చదువే ధ్యేయంగా సాగుతూ సమాజం కోసం కృషి చేసిన తీరును రచయిత్రి యథార్థ చిత్రీకరణ చేసింది.

సాధారణమైన వ్యక్తి మొదలు ఎంతోమందికి అది చాలా చిన్న విషయం. రకరకాల మాల్స్ లో పనిచేసే సేల్స్ గర్ల్స్ కూర్చోకూడదు అదంతే అంటారు వాళ్లంతా. కానీ సునీత లాంటి అభ్యుదయవాది సేల్స్ గర్ల్ అవతారమెత్తినప్పుడు సీనంతా ఎలా మారిపోతుందో తెలుసుకోవాలంటే డాక్టర్ ప్రభాకర్ జైనీ రాసిన **'బోన్గిరి టు లష్కర్'** కథ చదవాల్సిందే. సమస్య చిన్నదా? పెద్దదా? అనేది విషయం కాదు. ఆధునిక సమాజంలో పరిష్కార నైపుణ్యాలే కీలకం. **'సునీత బిల్ ఆఫ్ రైట్ టు సిట్'** జీవోను సునీత ఎలా సాధించగల్గిందో ఈ కథ చదివిన పాఠకులకు, ప్రధానంగా మహిళలకు ఆత్మవిశ్వాసం రెట్టింపవకమానదు. రచయిత కథను మలచిన విధానం ఆద్యంతం ఆసక్తికరం.




పి. చంద్ రచించిన **'స్తూపం'** కథ సమకాలీన సమాజపు సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలనెన్నిటినో చర్చించింది. ఒకనాటి దొరల ఇజాన్ని, సామాన్య ప్రజల దైన్యస్థితిని చిత్రిక కట్టింది. మరోవైపు ప్రజల కోసం, ప్రజల వైపు నిలబడ్డ మావోయిస్టుల త్యాగాలను తెలియపరిచింది. కాలంతో పాటు మారే పరిపాలనా వ్యవస్థ, రూపొందే చట్టాలు ప్రజల జీవితాల్లో తెచ్చే మార్పులు పాఠకుల గమనింపుకు వస్తాయి. ప్రజల సుఖ, సంతోషాల కోసం అమరులయ్యే ఎందరో అయిలన్నలను స్మరణకు తెస్తూనే, రంగులు మారుతున్న దొరతనం, ప్రజల జాగరూకత ఆవశ్యకతలను ఈ కథ తెలుపుతుంది.

నేటి ఆడపిల్లల ఆలోచనా సరళిలో వస్తున్న ప్రగతికాముక మార్పుకు ప్రతీక **'సుభాషిణి పెళ్లి'**. విశీ రాసిన ఈ కథ **'చదువు'**, ప్రాంతం, వర్గం వంటివి ఏవీ సవ్యమైన నిర్ణయాలకు కొలమానాలు కావని తేటతెల్లం చేస్తుంది. మేఘన వంటి ఆధునిక యువతి పెళ్లి విషయంలో తల్లిదండ్రుల ఒత్తిడిని అధిగమించి తీసుకున్న స్వతంత్ర నిర్ణయం, సాఫ్ట్ వేర్ జీవితాలలోని ఎగుడుదిగుడులను వివరించిన కథ కె.వి.మన్ ప్రీతం రాసిన **'సూర్యుడి నీడలు'**.

తెలంగాణలో వచ్చే కథలను ఏడుపుగొట్టు కథలు, విప్లవ కథలు అని తూలనాడేవారికి చెంపపెట్టు లాంటి కథ **'వెలుగు రేక'**.

రచయిత్రి స్వర్ణ కిలారి. **'పైసలు ప్రేమలను దూరం చేస్తయని'** నా చిన్నప్పటినుండి వింటున్న సంగతి. **'జాయి జాదులు'** కథలో రచయిత కొట్టం రామకృష్ణారెడ్డి, **'పెద్ద బతుకమ్మ'** కథ ద్వారా రచయిత చందు తులసి మానవ సంబంధాలను సాంస్కృతిక కోణంలో విశదపరిచిన తీరు అనుబంధాల మాధుర్యాన్ని పాఠకులకు చవిచూపించారు. భూమిని ప్రధాన నేపథ్యంగా తీసుకున్న కథల జాబితాలో భూమి పట్టా, ఋణం కథలను ప్రధానంగా చెప్పవచ్చు. భూమిని తమ పేరిట పట్టా చేసుకోవడం కోసం పేదలు పడే కష్టాలు, రాజకీయ నాయకుల ఊకదంపుడు హామీలను వాస్తవికంగా చిత్రించిన కథ యువ రచయిత బద్ది గణేష్ రచించిన **'భూమి పట్టా'**. రాజకీయ ముసుగులో పేద రైతుల భూములను లాక్కునే నాయకుల స్వార్థాన్ని, మోసాలను రచయిత గాజోజు నాగభూషణం రచించిన **'ఋణం'** కథలో చూడవచ్చు. చేసేది లేక బక్క చిక్కిన రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మ త్యాగం చేసుకునే పరిస్థితి ఈ కథ ద్వారా పాఠకులకు అవగతమవుతుంది.

**'అలుకు పూత'** కథలో పేదవాడైనప్పటికీ ముత్యం ఊరి ప్రజల వైద్యం కోసం తనకు ప్రభుత్వం ఇనాముగా ఇచ్చిన భూమిని దానం చేసి సిరిమంతుడు కాకపోయినా తన దాతృత్వాన్ని చాటుకుంటాడు. కానీ వదలని పేదరికంతో చివరకు కుల వాయిద్యమైన రుంజను అమ్ముకునేంత దీన స్థితిని రావుల కిరణ్మయి ఈ కథలో చిత్రించింది.

భారతదేశం 'ఆజాదీకా అమృత్ మహోత్సవాలను' ఘనంగా జరుపుకుంటున్న సందర్భంగా 75 ఏండ్ల క్రితం జరిగిన భారతదేశ విభజన విషాద ఘటనగా ఎలా మిగిలిందో తెలిపిన కథ **'ఆత్మ అగ్ని..అది నిన్ను దహిస్తుంది'** రచయిత రామా చంద్రమౌళి. స్కై బాబా రచించిన **'ఖుష్ మిజాజ్'** కథ ఒక మనిషిలో ఇద్దరుంటారనే విషయాన్ని రూఢీ చేస్తుంది.

ఛాందసమైన ఆచార, సంప్రదాయాలు తరతరాల నుండి మహిళలను పీక్కు తింటున్నాయి. భర్త మరణించడం స్త్రీ చేసిన పాపం అన్నట్లుగా మన వ్యవస్థలో పాతుకుపోయిన కొన్ని పద్ధతుల్లో ఇంకా మార్పు రావడం లేదు. ఎవరైనా మార్పు కోసం ముందడుగు వేస్తే మూతులు, ముక్కులు విరిచే మొహాలనెన్నింటినో దాటుకొని దారిని చేదించాల్సి ఉంటుంది. ఇటువంటి మూఢ విశ్వాసాలలో ముండరాలిని చేసే తంతు ఒకటి. **'ఉల్లి పూసలు'** కథలో రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ఈ తంతును పూలమ్మ పాత్ర ద్వారా నిరసించిన తీరు మనసున్న ప్రతి మనిషినీ చైతన్య స్రవంతిలోకి నడిపిస్తుంది.

కుమ్మరి వృత్తిని ఇతివృత్తంగా తీసుకొని కులవృత్తుల పట్ల ప్రేమను ప్రకటించిన కథ **'సారె'**. రచయిత డా. సాగర్ల సత్తయ్య రాసిన ఈ కథలో కులవృత్తిని ప్రాణంగా చూసుకునే లక్ష్మయ్య, కాలానికి అనుగుణంగా మారాలనుకునే కొడుకు శ్రీకాంత్ ఇద్దరూ రెండు విభిన్నమైన కోణాల్లో కనిపిస్తారు. ప్రపంచీకరణలో భాగంగా కులవృత్తుల నడుం విరిగి నత్త నడక నడుస్తున్న పరిస్థితి ప్రస్తుత సమాజంలో నెలకొని ఉన్నది. ఈ సంఘర్షణను సహజంగా చిత్రిస్తాడు రచయిత. కులవృత్తితో తాను సాధించింది ఏమీలేదని, తనలాగా తన పిల్లలు కులవృత్తిలో కొనసాగకూడదని భావించిన ఒక సగటు తండ్రి, పెద్ద చదువులు చదువుకున్నప్పటికీ వ్యవస్థలోని లోపాలతో ఉపాధి కరువైన కొడుకు **'జెజ్జనక..'** కథలో కనిపిస్తారు. చదువుకున్న యువతకు ఉద్యోగ కల్పన చేయవలసిన ప్రభుత్వాలు **'నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండడం'**, బ్రతుకే కష్టమైన పరిస్థితుల్లో ఉద్యమ డప్పును మోగించడానికి యువత సిద్ధమవ్వక తప్పని స్థితిని రచయిత డా. పసునూరి రవీందర్ ఈ కథలో ప్రతిబింబింపచేసారు. తద్వారా నేటి సమాజంలో నెలకొని ఉన్న నిరుద్యోగ పరిస్థితి, యువత మనోవేదన పాఠకులకు తెలియపరిచారు.

ఈ విధంగా 16 కథలతో వెలుగులీనుతున్న **'దురస్తు'** కథా సంకలనంలో ఏ ఒక్క కథనూ ప్రస్తావించకుండా వదిలిపెట్టలేము. రచయితలు తమ సమకాలీన సమాజంలో చూసిన, విన్న, అనుభవం లోకి వచ్చిన సంఘటనలను కథలుగా మలిచారు. ప్రజల్నే పాత్రలుగా మలిచి, వాస్తవ జీవితాలను కళాత్మకంగా అందించారు. సమాజంలో వేగంగా వస్తున్న మార్పుల్ని గతితార్కికంగా వివేచిస్తూ కథలు అల్లారు.

మొత్తం సంకలనంలో సగానికి పైగా కథలు ఆ ప్రాంతీయ అచ్చమైన తెలంగాణ భాషను ప్రతిబింబించాయి. మిగతా కథలు ఆయా రచయితల దైనందిన భాషలో కనిపిస్తాయి. సగానికి పైగా కథలు పూర్తిగా మాండలిక భాషలోనే ఉండడాన్ని బట్టి తెలంగాణ భాష అస్తిత్వాన్ని ఒకవైపు, కథకు ఉన్నటువంటి మౌలిక గుణమైన మౌఖికతను మరోవైపున కాపాడుతున్నట్లు అనిపించింది. ఇది సంతోషించదగిన పరిణామమే. వివిధ మాండలికాల సమాహారం తెలంగాణ భాష,యాస. 'దురస్తు' లో తెలంగాణలోని వివిధ జిల్లాల ప్రజల జీవభాషలో కథలు ఉన్నాయి.

'దురస్తు' మొత్తం కథల్లో మానవ సంబంధాలు, సాంస్కృతికాంశాలు, భావోద్వేగాలు, భూమి సమస్యలు, రైతు సమస్యలు, స్త్రీల జీవితాలు, సాఫ్ట్ వేర్ జీవితాలు,నిరుద్యోగం, రాజకీయాలు, సామాజిక పరిస్థితులు ఇత్యాది అంశాలన్నీ వస్తువులుగా గోచరమవుతాయి. తెలంగాణ సమాజమంతా కళ్ల ముందు కదలాడుతుంది. తెలంగాణ కథా ప్రఖ్యాతిని మరోసారి నిలిపిన 'దురస్తు' కథా వార్షిక సంకలన ప్రచురణకు ఆర్థికంగా సహకరించిన యాద శంకర మెమోరియల్ ఫౌండేషన్ వదాన్యతకు జేజేలు. నిష్పక్షపాతంగా కథలను ఎంపిక చేసి, దశాబ్ది కాలంగా తెలంగాణ కథాసంకలన మహాయజ్ఞం నిర్వహిస్తున్న సంపాదకుల కృషికి సలాం చెప్తూ, ఈ యజ్ఞం నిరాఘాటంగా కొనసాగాలని ఆశిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

# మెకంజీ కైఫియత్తుల లోని సమాజ భాషా స్వరూపాలు

**ఘట్టమరాజు, ఫోన్ : 996 408 2076**




యు.జి.సి ద్వారా మైనర్, మేజర్ ప్రాజెక్టులు, పీడిఫ్, ఎమెరిటస్ ఫెలోషిప్పులు పొందిన ఎందరో మహానుభావులున్నారు. కాని తమ పరిశోధన ఫలితాల్ని పుస్తక రూపంగా ప్రకటించిన మహనీయులు మాత్రం కొందరే కనపడుతున్నారు. శాంతమ్ పాపమ్! డా. నడుపల్లి శ్రీరామరాజు ఎమెరిటస్ ప్రొఫెసరుగా చేసిన పరిశోధన రెండు పుస్తకాల రూపంలో వెలువడటం అపురూపమే మరి. మొదటి గ్రంథం **'మెకంజీ కైఫియత్తుల సూచి'** గా న్యూఢిల్లీలోని నేషనల్ మిషన్ ఫర్ మాన్యుస్క్రిప్ట్స్ సంస్థ 2019 లో ప్రచురించింది. రెండవ పుస్తకమైన **'మెకంజీ కైఫియత్తుల లలోని సమాజ భాషా స్వరూపాలు'** 2021లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురింపబడటం హర్షణీయం.

కులపతి ఆచార్య తంగెడ కిషన్ రావు **"ఈ కైఫియత్తులలో ప్రతిబింబించే సామాజిక స్వరూపాన్ని ఈ గ్రంథ రచయిత ఎంతో పరిశోధనాత్మకంగా వివరించారు"** అని ఖితాబిచ్చారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని ఈ గ్రంథంలోని 'భాషాస్వరూపం' అనేభాగం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. **"సమాజాన్నీ, భాషనూ అధ్యయనం చేసేవారు ఎంతో ప్రయోజనం పొందే గ్రంథం ఇది. దీన్ని ఆధారంగా చేసుకొని కైఫియత్తుల మీద సమగ్రమైన సామాజిక అధ్యయనాలు, భాషా అధ్యయనాలూ రావలసిన అవసరం ఉంది."** అని పరిమి రామనరసింహంగారు అన్నమాటలు విశ్వవిద్యాలయ పరిశోధనా పర్యవేక్షకులూ, పరిశోధకులూ జాగ్రత్తగా పరిశీలించాల్సిన సంగతే.

డా. నడుపల్లి శ్రీరామరాజు 'మెకంజీ కైఫియత్తులలోని సమాజ భాషా స్వరూపాలు' పరిశోధన గ్రంథాన్ని సమాజ స్వరూపం, భాషాస్వరూపం అనే రెండు భాగాలుగా విభజించారు. రచయిత 18, 19 శతాబ్దాల నాటి చారిత్రక, సాంఘిక, ధార్మిక, రాజకీయ చరిత్రతో పాటు, అంతకంటే ప్రాచీనమైన చరిత్రను కూడా కైఫియత్తుల నుంచి వెలికితీసి పరిశీలించారు. **'సమాజ స్వరూపం'** అనే ఈ విభాగం 99 పేజీల పాటు విస్తరించింది. ఈ అధ్యాయంలో జలవనరులు, పంటలు – తోటలు, గ్రామ నిర్మాణం, గ్రామనామాల పుట్టు పూర్వోత్తరాలు, గుడి– గోపురాలు, కులాలు– తెగలు, గ్రామ– పట్టణ పరిపాలనా విధానం, సాంఘిక దురాచారాలు, నేరాలు– శిక్షలు వగైరా విషయాలు స్థూలంగా వివరింపబడ్డాయి. రెండవ అధ్యాయమైన **'భాషా స్వరూపం'** లో 18, 19 శతాబ్దాలనాటి ప్రజల వాడుకభాష 48 పేజీల్లో లోతుగా చర్చించబడింది.

**'సమాజ స్వరూపం'** విభాగంలో జలవనరుల గురించి విస్తారంగా చెప్పబడింది. కైఫియత్తుల్లో జిల్లాల్లో పుట్టి. ప్రవహించే నదుల చరిత్ర, కాలగర్భంలో మాయమైపోయిన విషయాలు ప్రస్తావించబడ్డాయి. కొన్ని నదీ జలాలు ఆరోగ్యకరమైనవి కావని పేర్కొనబడ్డ ఉదంతం శ్రీకాకుళం జిల్లా 'గోస్తనీ నదీ మాహాత్మ్యం' కైఫియత్తులో చూడవచ్చు. (పేజి:17) కాలువలు, చెరువులు, బావుల్ని రాజమహారాజులు, ఇతర అధికారులతో పాటు కొందరు సంపన్న, సాధారణ స్త్రీలు కూడా నిర్మించినట్లు కొన్ని కైఫియత్తులు తెలుపుతున్నాయి. వీటిని తవ్వించిన వాళ్ల పేరుతో అవి పిలువబడుతున్నాయనీ, దాతల పేర్లతో కొన్ని గ్రామాలు కూడా నెలకొన్నట్లు తెలుస్తూంది. విజయనగరం జిల్లా బొబ్బిలి కైఫియత్తులో తోపులు ఎక్కువైతే, పశ్చిమ గోదావరి జిల్లా మహిమలూరు కైఫియత్తులో టేకుచెట్లు మొదలైనవి దండిగా వున్నట్లు తెలుస్తుంది. విశాఖపట్నం జిల్లా అనకాపల్లి కైఫియత్తు అరటి. పనస, చెరకు, పసుపు, అల్లం, సీతాఫలం, రామాఫలం తోటలు ఎక్కువని విశద పరుస్తాయి. జిల్లా కైఫియత్తుల్లో ఆయా చోట్ల పండే పండ్ల రంగు, రుచి, వాసనల ప్రత్యేక లక్షణాలు కూడా పేర్కొనబడ్డాయి. నానారకాల పూలతోటల వివరాలూ ఇయ్యబడ్డాయి.

కైఫియత్తుల్లో గ్రామాల పుట్టుక, వాటిపేర్ల వెనుకటి చరిత్ర, నివాసుల కులగోత్రాలు, ఉపాధుల వివరాలు చక్కగా వివరింప బడ్డాయి. గ్రామనిర్మాతలు ఉన్నత వర్గాల వాళ్ళేకాక నిమ్నవర్గాల ప్రజల కూడా వుండినట్లు ఈ కవిలెలు చెప్తున్నాయి. ఊర్ల పేర్ల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయి.

ఎన్నో గ్రామాల, పట్టణాల, నదుల, గుడుల పుట్టుక వెనుక పుక్కిటి పురాణ కథలు అల్లుకుని వుండటం ఈ కైఫియత్తుల్లో తరుచుగా కనపడుతుంది. బట్టల నేత పద్మశాలి. దేవాంగ కులస్థులకే పరిమితమని అనుకుంటున్నాం కాని శతాబ్దాల కిందట మంగళ్ళు, మాలలు, మహమ్మదీయులు కూడా చేనేత పరిశ్రమను వృత్తిగా భావించారని కడపజిల్లా ఖాదరాబాదు కైఫియత్తు చెప్తుంది. (పేజి:50) కులాల చరిత్ర

రచనకు ఈ కవిలెలు ఎంతగానో తోడ్పడుతాయి. కర్నూలు జిల్లా 'చెంచువారల యొక్క కైఫియత్తులో యానాదులు, చెంచులు ఒక్కరే అని భావించడం పొరపాటే' (పేజి: 67) ఇద్దరూ వేషభూషల్లోనూ, ఆచార వ్యవహారాల్లోనూ చాలా వేరు. ఈ జిల్లాకు చెందిన "పుట్టుపావల యొక్క కైఫియత్తు' లో పేర్కొనబడ్డ దిగంబరులైన ఆటవిక జాతుల వారి గురించి గ్రంథ రచయిత భావించినట్లుగా పరిశోధన జరగాల్సిందే. (పేజి: 69) వివిధ జిల్లాల కైఫియత్తుల్లో పేర్కొనబడ్డ నానారకమైన పక్షుల పేర్లు వాటి చరిత్ర (ఆర్నిథాలజి) రచనకు దోహదం చేస్తాయి.

కైఫియత్తులద్వారా ఆనాటి పరిపాలనకు సంబంధించిన ఎన్నో విషయాలు తెలుస్తాయి. గుంటూరు జిల్లా పేరనిపాడు నందెలమ్మపేట కైఫియత్తులో పేర్కొనబడ్డ 'కపిలెలనీరు' అన్నమాట నీటి కొలమానాన్ని సూచిస్తుందనటం గమనించ తగ్గది. (పేజి: 74)

సమాజంలో వివిధ రకాల పన్నులు వసూలు చేసే విధానాన్ని కైఫియత్తులు తెలుపుతాయి. కరువు రోజుల్లో కూడా భూమి పన్ను చెల్లించాల్సి వస్తుందని ప్రజలు భయపడి వూరు వదిలి వలస వెళ్ళేవారని పట్టపురాని కవిలె చెప్తుంది. (పేజి: 75) గుంటూరు కైఫియత్తు పురిటి పన్నును గుర్తు చేస్తుంది. (పేజి: 75) సుగుమంచి కైఫియత్తు మంగలిపన్ను, నెకునాంపేట కైఫియత్తు చాకలి పన్ను, రాయలయుగంలో నానారకాల పన్నులు విధింపబడేవి. (పేజి: 76) రెడ్డిసానులు సంస్థానాలు ఏలినట్లు, పేరు ప్రసిద్ధులు పొందినట్లు కర్నూలు జిల్లా అలువకొండ కైఫియత్తు చాటుతుంది. (పేజి:81) హిందూ, బౌద్ధ, జైన మత సంఘర్షణల్ని చాటే కైఫియత్తులు, ఇస్లాం, క్రైస్తవ మతాచార్యుల మతాంతీకరణల్ని తెలియచేసే కవిలెలు ఎన్నో వున్నాయి. (పేజి: 84–88) సతీ సహగమనాల్ని చెరువుల, కాలువల, కట్టలు తెగిపోకుండా స్త్రీల బలిదానాల్ని చాటే అల్లిదొన. కొప్పోలు, శేషమాంబాపురం, బుక్కరాయ సముద్రం, ఒంటి మిట్ట, పోలి కవిలెలు ప్రకటిస్తున్నాయి. ఈవిధంగా కైఫియత్తులు సమాజంలోని స్థితిగతుల్ని వివరంగా తెలియజేస్తున్నాయి. కొంతమంది చరిత్ర కారులు కైఫియత్తుల్లోని కాలం వాస్తవిక కాలంతో సరిపడటం లేదని నిరూపించారు. శాసనాధారాలతో కైఫియత్తుల్లోని విషయాల సత్యాసత్యాల నిరూపణ చేయడం అవసరం. ఈ దృష్టితో ఆంధ్రుల చరిత్ర – సంస్కృతుల్లోని ఖాళీల్ని పూరించడం అవసరం.

కైఫియత్తుల మీద వ్యాసాలు వెలువడ్డా, చిన్నాపెద్ద సిద్ధాంత గ్రంథాలు పుట్టుకొచ్చినా మన చరిత్రకారులు ఆంధ్ర, తెలంగాణా చరిత్ర రచనలో వీటికి తావివ్వలేదు. కొమ్ములు తిరిగిన చరిత్రకారులు కూడా తమ గ్రంథాల్లో పాడిపంటలు, అటవీ సంపద, నీటి వనరులు–పారుదల, జాతి, కుల, మతాల వివరాలు, పన్నులు– శిక్షలు, గుడి గోపురాలు, ప్రజా జీవితం, రోగాలు– రుజినాలు, సైన్యం– యుద్ధం వగైరా విషయాలపై వెలుగు చల్లే కవిలెల వూసెత్తినట్లు కనపడదు.

గ్రంథకర్త కైఫియత్తుల్లో వాడుకభాషను వివిధ అంశాల ఆధారంగా శాస్త్రీయ విశ్లేషణ చేశారు. లేఖన పద్ధతులు, వర్ణం, పదం, లింగ, వచన, కారక, విభక్తి, సంధి, సమాసం మొదలైన అంశాల గురించి లోతైన విశ్లేషణ మనం ఈ అధ్యాయంలో చూడగలం. లోగడ గ్రాంథిక తెలుగుభాష గురించి చక్కని విశ్లేషణ జరిగిందే కాని, కైఫియత్తుల్లోని వాడుక భాష అనుశీలన గురించి పట్టించుకున్న భాషాశాస్త్రజ్ఞులు లేరు. ఈ దిశలో పరిశోధన జరిగితే వ్యావహారిక తెలుగు భాషా వికాసం గురించి కొత్తవిషయాలు మూటకట్టుకోవచ్చు.

ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గారి ఈ ప్రారంభిక కృషి మరింత లోతైన అధ్యయనానికి దారి తీయడానికి అవకాశ ముంది. గ్రంథకర్త అభినందనీయులు.

**(మెకంజీ కైఫియత్తుల లోని సమాజ భాషా స్వరూపాలు. రచయిత : నడుపల్లి శ్రీరామరాజు పేజీలు : 157, వెల : 150, ప్రాప్తిస్థానం : డైరెక్టర్ – ప్రచురణల విభాగం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ –500004)**

## పాటలు పక్షులైతాయి



పాటలు పక్షి సంగీతాన్ని ఆలపిస్తాయి
పాటలు ప్రకృతిలో నుంచి విరబూసిన పూల పరిమళాలు
పాటలు ఎల్లప్పుడూ అద్భుత కాంతులను కురిపిస్తాయి
పాటలు నియంత గీతాలను వ్యతిరేకిస్తాయి

పాటలు నవరసాలను పలికిస్తాయి
పాటలు ఒక్కొక్కసారి మెరుపుతీగల్లాగా మెరిసిపోతాయి
పాటలు మైమరిపించే అనుభూతుల్లోకి సాహసంగా తీసుకెళ్తాయి
పాటలు ఆలోచన కెరటాలు
పాటలు అప్పుడప్పుడు వెన్నెల నవ్వులను విరబూస్తాయి
పాటలు పిల్లగాలి తరగని గనిగా సాగిపోతాయి
అందాలను వినిపిస్తూ

పాటలు పర్వశాల విషాదాల మనోహరాల మమతల కెరటాలు
మనిషి పోయినా చక్కటి పాటలు మాత్రం ఎల్లప్పుడూ ఉంటాయి

**డా. అంజనా శ్రీ ఖమ్మం, భోనగిరి కోట**
**గజ్వేల్, ఫోన్ : 770 253 7453**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4 59 హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

నివాళి

# వెలుగుదారులు చూపించే జీవితం – నంబూరి పరిపూర్ణ

ఆలమూరు సౌమ్య, యు.ఎస్.ఏ., ఫోన్ : 96508 69424

పేరుకు తగ్గట్టు ఆవిడ జీవితం పరిపూర్ణం. స్త్రీవాద రచయిత్రి, స్వతంత్రోద్యమ పోరాట యోధురాలు నంబూరి పరిపూర్ణ 93 సంవత్సరాల వయసులో ఇటీవల కన్నుమూశారు. ఆశ, తెగువ, కరుణ నింపుకున్న జీవితం ఆమెది. ఒక మనిషి జీవిత కథ ఒక సామాజిక చరిత్రను చెబుతుంది. పరిపూర్ణ గారి జీవితం మనకు అలాంటి దర్పణాన్ని అందిస్తుంది.

1931లో కృష్ణాజిల్లాలోని ఓ పల్లెటూరిలో దళిత కుటుంబంలో పుట్టారు నంబూరి పరిపూర్ణ. పదేళ్ల వయసులో ప్రహ్లాద (1941) సినిమాలో చిన్న ప్రహ్లాదుడిగా నటించారు. ఆమె బ్రహ్మాండంగా పాడతారు. స్టేజ్ ఎక్కి పద్యాలు, పాటలు అనర్గళంగా ఆలపించేవారు. అనేక సభల్లో ప్రార్థనా గీతాలు చిన్నారి పరిపూర్ణ చేత పాడించేవారు. తన అన్నయ్యల ప్రోత్సాహంతో హై స్కూలు చదువుల కోసం మద్రాసు వెళ్లారు. 1943లో అక్కడ జరిగిన ఆంధ్రోత్సవాలలో పాల్గొన్నారు. పాటల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్నారు. అప్పుడే గుర్రం జాషువా గారిని కలిశారు. ఆయన చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

పరిపూర్ణ గారి అన్నయ్యలు స్వాతంత్రోద్యమ పోరాటలలో పాల్గొన్నవారు. కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో భాగంగా ఉండేవారు. అలా పరిపూర్ణ గారికి కూడా కమ్యూనిస్టు భావనల పట్ల ఆసక్తి కలిగింది. ఆమె కూడా కమ్యూనిస్టు పార్టీలో భాగమయ్యారు. కమ్యూనిస్టు నాయకుడిని వివాహమాడారు. ముగ్గురు పిల్లల తల్లి అయ్యారు. అయితే, ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తి స్త్రీ వివక్ష, కుల వివక్ష చూపించడంతో ఆ వివాహబంధం నుంచి బయటికొచ్చేసారు. అక్కడి నుంచి ఆమె చేసిన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం.

పట్టుమని పాతికేళ్లు నిండకుండా ముగ్గురు పిల్లలతో జీవన పోరాటం, స్వశక్తిని నమ్ముకుని, శ్రేయోభిలాషుల సాయంతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, అందులో ఎదగడం ఇవన్నీ ఆమెను అసమానంగా నిలబెడతాయి. స్త్రీ సంక్షేమ శాఖలో ఉద్యోగం చేస్తూ కథలు, వ్యాసాలు రాశారు. అవన్నీ కలిపి **'ఉంటాయి మాకుషస్సులు, 'కథాపరిపూర్ణం', 'శిఖరారోహణ'** అనే మూడు సంపుటాలు వెలువడ్డాయి. ఆ తరువాత పరిపూర్ణ గారి ఆత్మకథ 'వెలుగుదారులలో' వచ్చింది. పైన చెప్పిన విశేషాలన్నీ ఆ పుస్తకంలోనివే.

మన సమాజంలో మగవాళ్లు చెప్పిన కథలే ఎక్కువగా చెలామణీ అవుతాయి. స్త్రీల దృక్కోణ నుంచి చెప్పిన కథలు అరుదు. ఆత్మకథలు మరీ అరుదు. మహిళలు వారి కథ వారు చెప్పుకున్నప్పుడు మనకు కొత్త కోణాలు కనిపిస్తాయి. సమాజంలోని ఎత్తుపల్లాలు, వివక్ష







లోతులు తెలుస్తాయి. లోపలి పొరలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. పరిపూర్ణ గారి ఆత్మకథ చరిత్రపై కొత్త వెలుగును ప్రసరిస్తుంది. ఆమె వెలుగుదారులలో నడిచారు. తన జీవిత కథ ద్వారా మనకు వెలుగుదారులు చూపించారు.

ఆ పుస్తకం చదివితే ఒక 80 ఏళ్ల కాలంలో సమాజగతి, గమనం పై అవగాహన వస్తుంది. మొదటి నుంచీ ఆమె వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ వచ్చారు. అది కుల వివక్ష, లింగ వివక్ష అయినా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నారు. పరిపూర్ణగారికి స్త్రీ సంక్షేమ శాఖలో ఉద్యోగం వస్తే బ్రాహ్మణులు అధికంగా ఉన్న ఆ ఊర్లో ఆమెకు ఇల్లు దొరకక, వేరే ఊరికి పోస్టింగ్ మార్పించుకోవడం, ఉద్యోగంలో కొందరు మహిళలు అధికార దర్పంతో ఈవిడను బాధించడం మొదలైనవన్నీ వివక్ష కోణాలను మన కళ్ల ముందు ఉంచుతాయి. ఇలాంటివి ఈరోజుకూ మనకు కనిపించడం నిరాశగానే ఉంటుంది. కానీ, వాటిని ఎదురించే శక్తిని ఇలాంటి పుస్తకాలు మనకిస్తాయి. అందుకోసం చదవాలి ఈ పుస్తకం. ఈ స్ఫూర్తితో ఇంకెంతోమంది స్త్రీలు తమ కథలను రాయాలి.

పరిపూర్ణగారికి ఉన్న గొప్ప ఆభరణం చిత్తశుద్ధి. ఏ పోరాటం చేసినా, ఏ బాధ్యత నిర్వర్తించినా నిజాయితీగా, చిత్తశుద్ధితో చేశారు. తనకు ఎన్ని కష్టాలు, ఇబ్బందులు, వివక్షలు ఎదురైనా అందుకు కారకులను విమర్శించడం తప్పితే ద్వేషం పెంచుకోలేదు. ఇది మనకు మేలుకొలుపు. సమస్యను ఎదుర్కోవడంలో తెగువ చూపించాలి. పరిష్కారం సాధించాలి. కానీ, కోపాన్ని దరిచేరనివ్వకూడదు. మానవ సంబంధాలను కోల్పోకూడదు. ఇదీ ఆవిడ జీవితచరిత్ర చెప్పే గుణపాఠం.

పరిపూర్ణగారి జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నాయో అంతకు మించిన స్నేహ సౌరభాలూ ఉన్నాయి. చిన్నతనం నుంచీ సినిమాల్లో, చదువులో, ఉద్యోగావకాశాల్లో ఎందరో శ్రేయోభిలాషులు ఆమెకు

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024




చేయందించారు. ఇది సమాజానికి మరొక పార్శ్వం. మనకు ధైర్యాన్ని ఇచ్చే అంశం.

ఆమె రాసిన కథలు, వ్యాసాలు కూడా వర్తమాన సామాజిక పరిస్థితులకు అద్దం పట్టినవే. సాహిత్య సృష్టికి ప్రయోజనం ఉండాలని బలంగా నమ్మిన రచయిత్రి ఆమె. అందుకే సమస్యతో పాటు పరిష్కార మార్గాలను సూచించే దిశగా కథలు రాశారు. ఆమె వాక్యం ఆహ్లాదాన్నిస్తుంది. శిల్పం, నడక చదివిస్తాయి. ఆలోచనలో, అభివ్యక్తిలో పరిణితి కనిపిస్తుంది. పరిపూర్ణ గారి కథలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ముఖ్యంగా స్త్రీల జీవితాలకు. **'ఉంటాయి మాకు ఉషస్సులు'**, **'శిఖరారోహణ'** అని కథల, వ్యాసాల సంకలనాలకు పెట్టిన పేర్లు ఆమె స్ఫూర్తికి నిదర్శనలు. **'నా జీవితమే నా రచనలకు వస్తువు'** అంటారామె.

స్త్రీ సాధికారత, హక్కుల గురించి మాట్లాడే పరిస్థితే లేని కాలంలో అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పడం, తనకు తెలిసిన విషయాల గురించి ధాటిగా మాట్లాడడం, తన హక్కులేమిటో తెలుసుకోవడం, వాటిని పొందే ప్రయత్నం చేయడం, సాటి మనిషి పట్ల కరుణ, చేతనైనంత సాయం అందించడం, ప్రేమగా దగ్గరకు తీసుకోవడం ఇవన్నీ ఆమె సాధించిన విజయాలు.

పరిపూర్ణ గారికి 90 సంవత్సరాలు నిండిన సందర్భంలో ఆమె పిల్లలు **'ఒక దీపం వేయి వెలుగులు'** పేరుతో ఒక పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఎంతోమంది సాహితీమిత్రులు, ఆత్మీయులు ఆమె జీవితం, సాహిత్యం, వ్యక్తిత్వం గురించి అందులో రాశారు. ఆ వ్యాసాలు చదివితే ఆమె ఎంతమందికి స్ఫూర్తిగా నిలిచారో, ఎంతమందికి వెలుగుదారులు చూపించారో అర్థమవుతుంది.

చివరివరకూ ఆమె పాటను వదల్లేదు. పాట ఆమెను వదల్లేదు. 90 ఏళ్ల వయసులో కూడా నిండుగా తొణక్కుండా పాడేవారు. వ్యక్తిగతంగా పరిపూర్ణ గారితో పరిచయం ఉన్న నాకు, ఆమె పాడుతుంటే ఎదురుగా కూర్చుని వినడం మధురానుభూతి. ఆ వయసులో కూడా గమకం సరిగ్గా పలకడం లేదనో, అనుకున్న స్థాయికి స్వరం చేరలేదనో అసంతృప్తి వ్యక్తం చేయడం చూస్తే ముచ్చటేసేది. 90 ఏళ్ల వయసులో ఆమెకి ఎంత పంతం బాగా పాడాలని! ఆవిడ స్వయంగా కొన్ని లలిత గీతాలు రాసి, స్వరపరిచారు. అవన్నీ ఆమెకు చివరివరకూ గుర్తుండడం విశేషం.

ఎప్పుడూ చేతిలో పుస్తకంతో కనిపించేవారు. 90 ఏళ్ల వయసులో కూడా రోజూ పుస్తకం చదవనిదే నిద్రపోయేవారు కాదు. చదువుకున్న వాటిపై నోట్స్ రాసుకునేవారు కూడా. చివరివరకూ హుషారుగా కబుర్లు చెబుతూ, పాటలు పాడుతూ జనవరి 26, 2024 సాయంత్రం అందరి దగ్గరా సెలవు పుచ్చుకుని వెళ్లిపోయారు. ఆమె చనిపోయిన వార్త విని ఎంతోమంది సోషల్ మీడియా వేదికలపై స్పందించారు. వారందరికీ ఆమెతో ఒక ఆత్మీయ అనుబంధం ఉంది. అందరూ ఆమెను అత్త అనో, అమ్మ, అమ్మమ్మ అనో సంబోధించారు. తమ కుటుంబంలో మనిషిగా భావించారు. జగమంత కుటుంబం నాది అన్న వాక్యానికి నిలువెత్తు నిదర్శనం నంబూరి పరిపూర్ణ.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం.**

**సంప్రదించండి.**

# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

## స్వ'కృతి'



**జ్ఞాపకాల సంతకం (కవిత్వం)**
ధూళిపాళ అరుణ
వెల : 100/-
**ప్రతులకు :** శ్రీ ధూళిపాళ దత్తాత్రేయ శర్మ, హరిహర త్రిశక్తి క్షేత్రం, వలిగొండ, యాదాద్రి జిల్లా.
ఫోన్ : 9000998850



**అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలు**
- డా. గొల్లపల్లి గణేశ్, వెల : 350 /-
**ప్రతులకు :** రచయిత, తెలుగుపండిట్, ఇం.నెం. 10-140, గోదావరి రోడ్, ధర్మపురి, జగిత్యాలు జిల్లా.
ఫోన్ : 9440227064



**పద్మాకరము (వచన ద్విపదలు)**
దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి
వెల : అమూల్యం / -
**ప్రతులకు :** డి.వి.ఎన్. మూర్తి, కుకట్ పల్లి, హైదరాబాద్
ఫోన్ : 88861 65614



**శ్రీరామాయణ సౌరభము**
సముద్రాల శఠకోపాచార్య
వెల : శ్రీ రామభక్తి /-
**ప్రతులకు :** రచయిత, శ్రీనివాస నిలయం, 2-5-318, నక్కల గుట్ట, హన్మకొండ - 516 001.
ఫోన్ : 98483 73067



**ప్రజాభిమాన పాత్రికేయులు**
**డా. పొత్తూరి వెంకటేశ్వర రావు**
- సంపా. పొత్తూరి సుబ్బారావు.
వెల : 150/-
**ప్రతులకు :** సాహితీ కిరణం, ఇం.నెం. 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ - 500 012.
ఫోన్ : 9490 751 681

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | | |
|---|---|---|
| 1. | భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. | బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. | నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. | మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. | శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. | కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. | షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. | విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. | త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. | పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. | దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. | మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. | మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. | 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. | మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. | ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2024

# నాదేశ్వరి (పద్యకావ్యం)



ఆ మందాకిని చెంత నందన వనంబందాలతాచ్ఛాయ వీ
ణా మాధుర్య రసానుసేకమృదుతా నామ్లాన గాంధర్వ వి
ద్యా మూర్ధన్య కళాప్రపూర్ణవు పరార్థంబైన ఆలాపనా
సామర్థ్యంబొక కొంత మాకు వినిపించన్ రాదె నాదేశ్వరీ! 1

ప్రాణవాయువు బట్టి బంధించి శృతి గూర్చు
పూనిక యోగశాస్త్రానుభవము
అవరోహణారోహణానేకగమకంబు
లందున శబ్దశాస్త్రానుభవము
సోద్రేకముఖ వికాసోచ్చారణాది ల
క్షణముల భరత శాస్త్రానుభవము
సముదాత్త కంపిత సప్తస్వరంబులం
దూనిక మంత్ర శాస్త్రానుభవము
గీతికాలాపగతి నరమూత కనుల
నిస్తుల సమాధి యోగ నిర్నిద్ర శక్తి
కలిగినం గాని వేరైన గలుగ బోదు
నిర్మలానందవిద్య సంగీత విద్య 2

తలిరుటాకులతో దలయూచు లేగొమ్మ
మురిపెంపు ముదమున మొగ్గ దొడుగు
చనువీడకుండ వెంటనె బడు లేదూడ
నలరించి తల్లి పొత్తిలికి బాపు
'కా'వను పొత్తిలి కసికందు జోకొట్టి
బుడిచేతులాడించు బొమ్మజేయు
తోక ద్రొక్కిన రేగు ధూర్తాహి నాడించు
పడగ విప్పుల నృత్య వైభవమున
దన్మయానందమున దము దామె మరచి
కన్నులుండియు బయటి లోకంబు గనని
లలిత శాంభవీ ముద్ర శ్రోతలకొసంగు
నిర్మలానంద విద్య సంగీత విద్య. 3

నాదస్పందనమే ప్రపంచము బహిర్నాదంబు లోనాదమున్
వేదాంతాధ్యానంబుచే గని బుధుల్ విశ్వంబు సర్వంబు నీ
నాదబ్రహ్మమయం బటంచనిరి యీ నాదంబునే సప్తధా
భేదింపంగ స్వరంబులయ్యె ప్రణవంబే యిట్లనేకాకృతిన్. 4

నాదోపాసనకై సమస్త మృగముల్ నానావిహంగంబు లే
దేదో శబ్దమునన్ ధ్వనించి శృతియందే లీనమై పోవు వృ
క్షాదుల్ సాధన చేయు నొక్క ధ్వని నట్లయ్యున్ గృతార్థంబుగా
లేదా సాధన రెండు శబ్దములు వేర్వేరౌచు శబ్దించుటన్. 5

అదె బంభర కుమారు డబ్జంబుపై వ్రాల
మరచియే నీపాట నరయుచుండె
అదిగొ నందన లతాంతాశ్లేషమును వీడె
బాల సమీరుండు పాటకొరకు
అదె మనంబున బొంగి మందమెచ్చి పురివిచ్చె
వన మయూరము నృత్యభంగిమముల
అదిగొ గంగా ప్రవాహమ్ము కమ్మని శ్రుతి
గలిపె విపంచి నేకంబుగాగ
కనుము నీగానరసము నాకాశవాణి
సంతరింపుచు జనియె దిశాంతములకు
సరస సంగీత విద్య విశ్వంబు నెల్ల
తన్మయత ముందు దివ్యౌషధంబు గాదె. 6

తొలి నీ చేసినయట్టి పుణ్యచయమెంతో పక్వమై యీ యన
ర్గల గాంధర్వముగా ఫలించినది నేర్వన్ శక్యమే యేరికిన్
తొలకున్ దొట్రును లేని గాత్రమును శాస్త్రోక్తంబులౌ ధోరణుల్
గలుగం బోవునె జన్మమే కరువుగా గన్‌బెట్టి సాధించినన్. 7

రాయసం శేషగిరి రావు

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## శ్రీ అథర్వణ వేద స్వాహాకార, సహస్ర శ్రీయాగ సహిత ఏకాదశ తమ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక

**14-02-2024 నుండి 24-02-2024 వరకు**

ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**
**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma